

శనివారం 8, నవంబర్ 2025
https://www.telugudesam.org



# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు


వందేమాతరం.. ఎప్పటికీ ప్రతిధ్వనించే నినాదం!


'అనంత'లో లోకేష్‌కు నీరాజనాలు 8

# క్లస్టర్లవారీగా పారిశ్రామికాభివృద్ధి

- మూడు మెగా సిటీలు, 15 ఇండస్ట్రియల్ జోన్లుగా అభివృద్ధి
- పెట్టుబడుల సదస్సుకంటే ముందే పరిశ్రమలకు శంకుస్థాపనలు
- 12వ పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశంలో సీఎం చంద్రబాబు
- రూ. 1,01,899 కోట్లు పెట్టుబడులు..
- 85870 ఉద్యోగాలకు ఎస్ఐపీబీలో ఆమోదం
- 16నెలల్లో రూ. 8,08,899 కోట్ల పెట్టుబడులు, 7,05870 ఉద్యోగాలకు గ్రీన్‌సిగ్నల్

2





## రూ.2.5కోట్ల నజరానా

- శ్రీచరణిని అక్కున చేర్చుకున్న సీఎం చంద్రబాబు
- ప్రతిభకు తగిన బహుమానం ప్రకటించిన సీఎం
- మహిళా క్రికెటర్‌కు ప్రభుత్వం భారీ ప్రోత్సాహకం
- ఇంటి నిర్మాణం కోసం కడపలో 1000 చ.గ. స్థలం
- గ్రూప్ 1 ఉద్యోగం ఇవ్వాలని నిర్ణయించిన సీఎం
- చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిసిన శ్రీచరణి
- పుష్పగుచ్ఛంతో హార్దిక స్వాగతం పలికిన మంత్రి లోకేష్

3



శ్రీచరణి అంకితభావం

## రాష్ట్రానికి గర్వకారణం

- మంత్రి లోకేష్

7

## అన్నదాతకు అండ.. ఎన్జీఆర్ స్ఫూర్తే



- రైతు బాంధవుడిగా ఎన్జీరంగా అందరికీ ఆదర్శం
- గత పాలకులు రైతుల్ని రోడ్డున పడేశారు
- పంటల బీమా ఎగ్గొట్టి.. రైతును దగా చేశారు
- రాష్ట్రంలో ఏ ఒక్కరైతూ అధైర్య పడొద్దు
- ధాన్యంకొన్న 24 గంటల్లో రైతు ఖాతాకు సొమ్ము జమ
- ఎన్జీ రంగా 125వ జయంత్యుత్సవాల్లో సీఎం చంద్రబాబు
- ఆధునిక రాజ్యాంగ సంస్థలు పుస్తకాన్ని ఆవిష్కరించిన సీఎం

4



సీఎం చంద్రబాబు అనుభవం, సమర్థతతో..

## దూసుకెళుతున్న రాష్ట్రం

- ఏపీని చూసి పొరుగు రాష్ట్రాలు అసూయపడే రోజు తీసుకువస్తాం
- వైసీపీ దుష్ప్రచారాలను టీడీపీ కార్యకర్తలు తిప్పికొట్టాలి
- టీడీపీ అంటే అనంతపురం.. అనంతపురం అంటే టీడీపీ
- ఈ జిల్లాకు ఎంత చేసినా తక్కువే
- జగన్ రెడ్డి ఏనాడు సొంత కార్యకర్తలను పట్టించుకోలేదు
- కల్యాణదుర్గం నియోజకవర్గ టీడీపీ కార్యకర్తలు, నేతలతో సమన్వయ సమావేశంలో మంత్రి లోకేష్

6

16 నెలల్లో మనం చేసిన..

## మంచిని ప్రజల్లోకి తీసుకెళ్లండి



- పనిచేసిన కార్యకర్తలను గుర్తించి నామినేటెడ్ పదవులిస్తున్నాం
- శవరాజకీయాలు వైసీపీకి వెన్నతో పెట్టిన విద్య
- ఆ పార్టీ ఫేక్ ప్రచారాలను సమర్థవంతంగా తిప్పికొట్టండి
- కూటమి కార్యకర్తలతో కలిసికట్టుగా ముందుకు సాగండి
- కళ్యాణదుర్గం ఉత్తమ కార్యకర్తల సమావేశంలో యువనేత లోకేష్

5

ఐదేళ్ల పాలన మొత్తం దోపిడీ, విధ్వంసమే..

## మీ క్రెడిట్ మాకొద్దు జగన్

- మంత్రి పార్థసారథి స్ట్రాంగ్ కౌంటర్
- క్రెడిట్ చోరీ చేయడానికి ఐదేళ్లలో జగన్ చేసిన మంచి ఏముంది
- దేశ,దేశాలు తిరిగి దిగ్గజ సంస్థలను రప్పిస్తున్న సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్
- వారి కృషితో పెట్టుబడుల గమ్యస్థానంగా ఏపీ
- మానసిక స్థితి దెబ్బతిని జగన్ పిచ్చిమాటలు

10

## రాష్ట్రానికి మరో భారీ ప్రాజెక్ట్

- దేశంలోనే రెండో అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ సోలార్ సెల్ యూనిట్

- తెలంగాణకు చెందిన ప్రీమియర్ ఎనర్జీస్ రూ.5,942 కోట్ల పెట్టుబడి

- నాయుడుపేట వద్ద ఏర్పాటు

- మంత్రి నారా లోకేష్ వెల్లడి

7

## వచ్చే ఏడాది వెలిగొండ ఆయకట్టుకు నీరు

- యుద్ధ ప్రాతిపదికన ప్రాజెక్టు పనులు
- మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టీకరణ
- నిపుణులతో కలిసి పనులు పరిశీలించిన మంత్రి

9


## యువత భవిష్యత్తు నాశనమే జగన్ లక్ష్యం

- ఐదేళ్ల వైసీపీ పాలనలో గంజాయి అడ్డాగా రాష్ట్రం
- కమ్మ కార్పొరేషన్ చైర్మన్ నాదెండ్ల బ్రహ్మం చౌదరి

9



# క్లస్టర్లవారీగా పారిశ్రామికాభివృద్ధి



- మూడు మెగా సిటీలు, 15 ఇండస్ట్రియల్ జోన్లుగా అభివృద్ధి
- పెట్టుబడుల సదస్సుకంటే ముందే పరిశ్రమలకు శంకుస్థాపనలు
- 12వ పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశంలో సీఎం చంద్రబాబు
- రూ. 1,01,899 కోట్లు పెట్టుబడులు..
- 85870 ఉద్యోగాలకు ఎస్ఐపీబీలో ఆమోదం
- 16నెలల్లో రూ. 8,08,899 కోట్ల పెట్టుబడులు, 7,05870 ఉద్యోగాలకు గ్రీన్‌సిగ్నల్

అమరావతి (చైతన్య రథం): పెట్టుబడులతో ముందుకొచ్చిన పరిశ్రమల నుంచి ప్రతిపాదనలు తీసుకోవడంతో పాటు... అవి కార్యరూపం దాల్చేలా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. పరిశ్రమల కోసం అవసరమైన భూములు.. విద్యుత్ లభ్యత ఉండేలా చూడాలని సీఎం సూచించారు. శుక్రవారం సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన 12వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశం జరిగింది. సమావేశంలో 26 పరిశ్రమలకు సంబంధించిన ప్రతిపాదనల్ని ఎస్ఐపీబీ ఆమోదించింది. వీటిద్వారా రూ.1,01,899 కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి రానున్నాయి. ఈ ప్రాజెక్టుల ద్వారా మొత్తంగా 85,570 ఉద్యోగాలు దక్కనున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గడచిన 16 నెలల్లో జరిగిన 12 ఎస్ఐపీబీ సమావేశాల ద్వారా మొత్తంగా రూ.8,08,899 కోట్ల పెట్టుబడులు, 7,05,870 ఉద్యోగాలు రానున్నాయి. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ... "రాష్ట్రంలో వివిధరంగాల్లో పెట్టుబడులు వచ్చేలా చూడటం అధికారుల బాధ్యత. పెట్టుబడిదారులనుంచి ప్రతిపాదనలు తీసుకుని సమయం వృధాకాకుండా తక్షణం ఆమోదం తెలియచేయాలి. ప్రభుత్వం నుంచి ఆమోదం పొందిన పరిశ్రమలు, ప్రాజెక్టులు గ్రౌండ్ అయ్యేలా చూసే బాధ్యతను అధికారులు తీసుకోవాలి. పెట్టుబడులు పెట్టే పరిశ్రమలనుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూడాలి. క్షేత్రస్థాయిలో ఆయా పరిశ్రమల ఏర్పాటుకు కావాల్సిన అనుమతులను త్వరితగతిన వచ్చేలా శ్రద్ధపెట్టాలి. గత పాలకులు భూమి కేటాయించినా.. ఇప్పటికీ ప్రారంభంకాని ప్రాజెక్టులు ఎన్ని ఉన్నాయో సమీక్షించాలి. ఏ ప్రాజెక్టులైనా నిర్మాణ పురోగతి లేకపోతే అనుమతులు రద్దుచేయాలి. ఎలక్ట్రానిక్ పార్క్ ఏర్పాటుపై అధికారులు దృష్టి సారించాలి. భవిష్యత్తులో ఎలక్ట్రానిక్ రంగంలో విస్తృతమైన అవకాశాలు ఉన్నాయి. చిప్, సెమీకండక్టర్లు, డ్రోన్‌వంటి పరిశ్రమలను ప్రోత్సహించాలి. రాష్ట్రంలో సుమారు 15 పారిశ్రామిక జోన్లను ఏర్పాటు చేసుకుని... క్లస్టర్‌వారీ విధానంతో పారిశ్రామికాభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి. వివిధరంగాల్లో పెట్టుబడులు పెట్టే పరిశ్రమలకు రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం కూడా ప్రోత్సాహకాలిస్తుంది. ఇలాంటివాటిని గుర్తించి ప్రమోట్ చేయాలి. కేంద్రమిచ్చే ప్రోత్సాహకాలు కొంచెం ఆలస్యమైనా... రాష్ట్ర ప్రభుత్వంవైపు ఇవ్వాల్సిన ప్రోత్సాహకాలు ఇవ్వడం ద్వారా పెట్టుబడులు చేజారకుండా చూడాలి. తర్వాత కేంద్ర ప్రభుత్వమిచ్చే ప్రోత్సాహకాలపై సంప్రదింపులు జరుపుదాం. పారిశ్రామిక అవసరాల నిమిత్తం... పరిశ్రమలకు విద్యుత్ సరఫరా విషయంలో ఇబ్బందులు లేకుండా చూసేందుకు కేంద్రం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. దీన్ని రాష్ట్ర ప్రభుత్వం సద్వినియోగం చేసుకోవాలి. కేంద్రంతో కలిసి పనిచేసే అంశాన్ని పరిశీలించాలి. ఇక ప్రభుత్వం కూడా పారిశ్రామిక అవసరాలను దృష్టిలో పెట్టుకుని ల్యాండ్ బ్యాంక్ సిద్ధం చేసుకోవాలి. అలాగే ఎవరైనా ప్రైవేట్ ల్యాండ్ ఓనర్లు తమ భూములను పరిశ్రమలకు, కంపెనీలకు ఇవ్వడానికి ముందుకొస్తే.. అలాంటి వారిని ప్రోత్సహించాలి" అని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు.

## మెగా సిటీలు... మాస్టర్ ప్లాన్లు

"రాష్ట్రంలో మూడు మెగా సిటీలు అభివృద్ధి చేయాలి. అనకాపల్లినుంచి విజయనగరం వరకు విశాఖను మెగా సిటీగా అభివృద్ధి చేయాలి. అలాగే తిరుపతి, అమరావతి నగరాలను కూడా మెగా సిటీలు చేయాలి. ఇప్పటికే అమరావతికి మాస్టర్ ప్లాన్ ఉంది. విశాఖ, తిరుపతి మెగా సిటీలకు కూడా మాస్టర్ ప్లాన్ రూపొందించాలి. ఈ మెగా సిటీలను టూరిజం, ఐటీ సహా వివిధ పరిశ్రమలకు అనుకూలంగా ఉండేలా చూడాలి. ఈమేరకు టూరిజం, ఐటీ, పరిశ్రమలు, మున్సిపల్ శాఖలు సమన్వయం చేసుకుని మెగా సిటీలు అభివృద్ధి జరిగేలా చూడాలి. అలాగే వీటికి టౌన్ షిప్స్ ఇంటిగ్రేషన్ జరగాలి. నివాసయోగ్యమైన నగరాలుగా తీర్చిదిద్దాలి. గూగుల్ డేటా సెంటర్‌వల్ల విశాఖకు మరిన్ని కంపెనీలు, పరిశ్రమలు రానున్నాయి. భవిష్యత్తులో విశాఖకు వచ్చే కంపెనీలకు భూలభ్యత ఉండేలా చూసుకోవాలి. టూరిజం అభివృద్ధికి ఆతిధ్య రంగాన్ని ప్రోత్సహించాలి. ప్రముఖ బ్రాండ్‌లకు చెందిన హోటళ్లు నిర్మించేలా చూడాలి. రాష్ట్రంలో మూడు ఎకనామిక్ కారిడార్లు ఏర్పాటు అవుతున్నాయి. దీనికి అనుగుణంగా అభివృద్ధి ప్రణాళికలు చేసుకోవాల్సి ఉంది. ఈమేరకు మూడు కారిడార్లకు ముగ్గురు సీనియర్ ఐఏఎస్ అధికారులను నియమిస్తాం. బీచ్ టూరిజాన్ని మరింతగా అభివృద్ధి చేయాలి" అని సీఎం చంద్రబాబు సూచించారు.

## పెట్టుబడుల సదస్సును ఘనంగా నిర్వహించాలి


ఈనెల, 14, 15 తేదీల్లో విశాఖ పెట్టుబడుల సదస్సును ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ప్రస్తుతం ఎస్ఐపీబీ ఆమోదించిన పరిశ్రమల్లో వేగంగా శంకుస్థాపనలు జరిగేలా చూడాలని సీఎం ఆదేశించారు. తనతోపాటు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, ఐటీ మంత్రి నారా లోకేష్ సహా వివిధ శాఖల మంత్రులు ఆయా జిల్లాల్లో పరిశ్రమలకు శంకుస్థాపనలు చేస్తామని తెలిపారు. ఆ దిశగా అధికారులు ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఇక ఇటీవల తాను జరిపిన విదేశీ పర్యటనల్లో వివిధ కంపెనీలకు చెందిన ప్రతినిధులను భాగస్వామ్య సదస్సుకు ఆహ్వానించానని.. వారు ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు సుముఖంగా ఉన్నారని.. అలాగే భాగస్వామ్య సదస్సుకు వచ్చేందుకు సంసిద్ధత వ్యక్తం చేశారని వివరించారు. విశాఖలో జరగబోయే పెట్టుబడుల సదస్సుకు భారీఎత్తున పెట్టుబడులు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయని ఈ సందర్భంగా అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. సమావేశంలో మంత్రులు నారా లోకేష్, అచ్చెన్నాయుడు, టీజీ భరత్, నారాయణ, గొట్టిపాటి రవికుమార్, అనగాని సత్యప్రసాద్, బీసీ జనార్దన్ రెడ్డి, వాసంశెట్టి సుభాష్, సీఎస్ విజయానంద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## 12వ ఎస్ఐపీబీలో ఆమోదించిన పెట్టుబడుల వివరాలు

1. రిలయన్స్ కన్స్యూమర్ ప్రొడక్స్ లిమిటెడ్ - రూ.202 కోట్లు -436 మందికి ఉద్యోగాలు.
2. ఎపిటోమ్ కాంపోనెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్ - రూ.700 కోట్లు -1,000మందికి ఉద్యోగాలు.
3. ఎన్‌పీఎస్‌పీఎల్ అడ్వాన్స్ మెటీరియల్ ప్రైవేట్ లిమిటెడ్ -రూ.2,081 కోట్లు -600మందికి ఉద్యోగాలు
4. క్రయాన్ టెక్నాలజీ లిమిటెడ్ -రూ.1,154 కోట్లు -1500మందికి ఉద్యోగాలు
5. ఎస్‌సీఐసీ వెంచర్స్ ఎల్‌ఎల్పీ -రూ.550 కోట్లు -1130మందికి ఉద్యోగాలు.
6. ఇండిచిప్ సెమీకండక్టర్స్ లిమిటెడ్ - రూ.22,976 కోట్లు -1241 మందికి ఉద్యోగాలు.
7. ఫ్లూయింట్‌గ్రిడ్ లిమిటెడ్ -రూ.150 కోట్లు - 2,000 మందికి ఉద్యోగాలు
8. మథర్సన్ టెక్నాలజీ సర్వీస్ లిమిటెడ్ - రూ.110 కోట్లు -700మందికి ఉద్యోగాలు
9. క్వార్ట్జ్ టెక్నోసాఫ్ట్ ప్రైవేట్ లిమిటెడ్ - రూ.115 కోట్లు -2000 మందికి ఉద్యోగాలు
10. కె.రహేజా కార్ప్ రియల్ ఎస్టేట్ ప్రైవేట్ లిమిటెడ్ -రూ.2,172కోట్లు -9,681 మందికి ఉద్యోగాలు
11. విశాఖ రియాల్టీ ప్రైవేట్ లిమిటెడ్ - రూ.2,200 కోట్లు -30వేలమందికి ఉద్యోగాలు
12. ఐ స్పేస్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ -రూ.119 కోట్లు -2,000 మందికి ఉద్యోగాలు
13. ఎస్ఏఈఎల్ సోలార్ పీ12 ప్రైవేట్ లిమిటెడ్ -రూ.1728 కోట్లు -860మందికి ఉద్యోగాలు
14. నవయుగ ఇంజనీరింగ్ కంపెనీ లిమిటెడ్ - రూ.7972 కోట్లు-2,700మందికి ఉద్యోగాలు
15. మైరా బే వ్యూ రిసార్ట్స్ -రూ.157 కోట్లు - 980మందికి ఉద్యోగాలు.
16. విశ్వనాథ్ స్పోర్ట్స్ అండ్ కన్వెన్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ -రూ.51 కోట్లు -750మందికి ఉద్యోగాలు
17. సుగ్నా స్పాంజ్ అండ్ పవర్ ప్రైవేట్ లిమిటెడ్ -రూ.1247 కోట్లు -1,100 మందికి ఉద్యోగాలు
18. సూపర్ స్మెల్టర్స్ లిమిటెడ్ -రూ.8570 కోట్లు -1000మందికి ఉద్యోగాలు
19. వాల్టన్ ల్యాట్స్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.1682 కోట్లు -415 మందికి ఉద్యోగాలు
20. ఏఎమ్‌జీ మెటల్స్ అండ్ మెటీరియల్స్ లిమిటెడ్ -రూ.44,000 కోట్లు -3000 మందికి ఉద్యోగాలు
21. వాసంగ్ ఎంటర్ ప్రైజెస్ -రూ.898 కోట్లు - 17,645మందికి ఉద్యోగాలు
22. బిర్లాను లిమిటెడ్ -రూ.240 కోట్లు - 588మందికి ఉద్యోగాలు
23. సిగాచీ ఇండస్ట్రీస్ లిమిటెడ్ -రూ.1,090 కోట్లు -1250మందికి ఉద్యోగాలు
24. భారత్ డైనమిక్స్ -రూ.489 కోట్లు - 500మందికి ఉద్యోగాలు
25. డాజ్కో ప్రైవేట్ లిమిటెడ్ -రూ.1234 కోట్లు -1454మందికి ఉద్యోగాలు
26. శ్రీవేదా ఇన్నోవేషన్ పార్క్ ప్రైవేట్ లిమిటెడ్ - రూ.12 కోట్లు -1500 మందికి ఉద్యోగాలు

# రూ.2.5కోట్ల నజరానా







- శ్రీచరణిని అక్కున చేర్చుకున్న సీఎం చంద్రబాబు
- ప్రతిభకు తగిన బహుమానం ప్రకటించిన సీఎం
- మహిళా క్రికెటర్‌కు ప్రభుత్వం భారీ ప్రోత్సాహకం
- ఇంటి నిర్మాణం కోసం కడపలో 1000 చ.గ. స్థలం
- గ్రూప్ 1 ఉద్యోగం ఇవ్వాలని నిర్ణయించిన ముఖ్యమంత్రి
- చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిసిన శ్రీచరణి
- పుష్పగుచ్ఛంతో హార్దిక స్వాగతం పలికిన మంత్రి లోకేష్

అమరావతి (చైతన్య రథం): మహిళా క్రికెట్ వరల్డ్ కప్ విజేత, టీమిండియా సభ్యురాలైన తెలుగమ్మాయి శ్రీచరణికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు భారీ నజరానా ప్రకటించారు. శ్రీచరణికి రూ.2.5 కోట్ల నగదు బహుమతి ఇవ్వాలని సీఎం నిర్ణయించారు. దీంతోపాటు ఇంటి నిర్మాణానికి కడపలో 1000 చ.గ. స్థలం కేటాయిస్తున్నట్టు తెలిపారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వంలో గ్రూప్-1 అధికారిగా ఉద్యోగం కల్పిస్తామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. శుక్రవారం సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును, మంత్రి నారా లోకేష్‌ను క్రికెటర్ శ్రీచరణి మర్యాద పూర్వకంగా కలిశారు. ఉమెన్ వరల్డ్ కప్ గెలుచుకున్న ఆనందక్షణాలను సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌తో శ్రీచరణి పంచుకున్నారు. తనకు మద్దతుగా నిలిచినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ శ్రీచరణిని అభినందించారు. ఉమెన్ వరల్డ్ కప్ గెలుచుకోవడం ద్వారా భారత దేశ మహిళల సత్తాచాటారని, మహిళా క్రీడాకారులకు ఆదర్శంగా నిలిచారని సీఎం అన్నారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు భారత జట్టుకు అందించాలని అభిలషించారు. ఈ సందర్భంగా శ్రీచరణి మహిళా క్రికెటర్లు సంతకాలు చేసిన టీ షర్ట్‌ను ముఖ్యమంత్రికి అందించారు. దానిని ఆప్యాయంగా స్వీకరించిన ముఖ్యమంత్రి శ్రీచరణి బృందం భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

శ్రీచరణితోపాటు ముఖ్యమంత్రిని కలిసిన వారిలో మహిళా క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్ ఉన్నారు. అంతకుముందు గన్నవరం ఎయిర్ పోర్టులో శ్రీచరణికి ఘన స్వాగతం పలికిన మంత్రులు అనిత, సవిత, సంధ్యారాణి, ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కేశినేని చిన్ని, కార్యదర్శి సానా సతీష్, శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు... ఆమెతోపాటు సీఎం క్యాంప్ కార్యాలయానికి వచ్చారు. క్యాంపు కార్యాలయంలో మంత్రి నారా లోకేష్ శ్రీచరణికి హార్దిక స్వాగతం పలికారు.








# స్వర్ణాంధ్ర సంకల్ప దిశగా అడుగులు

- పాలనలో నూతన ప్రమాణాలు సెట్‌చేసిన ఏపీఎస్‌డీపీఎస్
- ఉద్యోగుల శిక్షణనుంచి స్వర్ణాంధ్ర విజన్ వరకు నిశ్శబ్ద విప్లవం

అమరావతి (చైతన్య రథం): “ప్రభుత్వ వ్యవస్థ మెరుగుపడాలంటే, ముందు ఆ వ్యవస్థను నడిపేవారి ఆలోచనలు, నైపుణ్యాలు మెరుగుపడాలి” అనే సిద్ధాంతంతో ఏపీఎస్‌డీపీఎస్ (ఆంధ్రప్రదేశ్ స్టేట్ డెవలప్మెంట్ ప్లానింగ్ సొసైటీ) వేసిన అడుగులు, పాలనలో కొత్త దిశ చూపుతోంది. ఆంధ్రప్రదేశ్‌ను భవిష్యత్ అవసరాలకు సిద్ధం చేసే దిశగా ఏపీఎస్‌డీపీఎస్ చేపట్టినచర్యలు రాష్ట్రంలోనే కాకుండా దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటున్నాయి. ఉద్యోగుల నైపుణ్యవృద్ధి నుంచి అభివృద్ధి ప్రణాళికల వరకు పలు వినూత్న కార్యక్రమాలతో ఏపీఎస్‌డీపీఎస్ పాలనలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించింది.

### iGOT కర్మయోగి అమలులో దేశంలోనే ఏపీ అగ్రస్థానం

గతంలో ప్రభుత్వ శిక్షణ అంటే కొన్ని తరగతులు, పేపర్లు, సర్టిఫికేట్‌తో ముగిసిపోయేది. కానీ ఏపీఎస్‌డీపీఎస్ నేతృత్వంలో iGOT కర్మయోగి అమలు శిక్షణను ఒక ఆటోమేటెడ్, నిరంతర, వ్యక్తిగత వృద్ధి ప్రయాణంగా మార్చింది. ఏపీఎస్‌డీపీఎస్ ఆధ్వర్యాన ఉద్యోగుల శిక్షణ కార్యక్రమంలో మన రాష్ట్రం రికార్డులు సృష్టించింది. 8 నెలల్లో iGOT ప్లాట్‌ఫార్మ్‌లో కోర్సు పూర్తి చేసిన వారి సంఖ్య 2.98 లక్షలనుంచి 58 లక్షలకు చేరడం విశేషం. కేవలం 24 గంటల్లో 8 లక్షలమంది ఉద్యోగులను ప్లాట్‌ఫార్మ్‌లోకి తీసుకురావడం మరో మైలు రాయి. ఈ విజయంతో దేశానికి ఆదర్శంగా ఏపీ నిలిచింది. గోవా ప్రతినిధులు ప్రత్యేకంగాఏపీని సందర్శించి అమలు విధానాలను అధ్యయనం చేశారు.

### ప్రతి నియోజకవర్గానికి భవిష్యత్ బ్లూప్రింట్

స్వర్ణాంధ్ర- 2047 విజన్‌ను కార్యరూపంలోకి తీసుకువెళ్లేందుకు ఏపీఎస్‌డీపీఎస్ రాష్ట్రంలో తొలి సారిగా ప్రతినియోజకవర్గానికి ప్రత్యేక విజన్, యాక్షన్ ప్లాన్ రూపొందించింది. 175నియోజకవర్గ యూనిట్లు, 26 జిల్లా యూనిట్లు ఏర్పాటు చేసి క్షేత్రస్థాయి మానిటరింగ్ వ్యవస్థను ప్రారంభించారు. దాంతో అభివృద్ధి అనేది ఇక పేపర్ మీద ప్రణాళిక కాదు.. క్షేత్రస్థాయిలో ఫలితాలు కనిపించే విధానంగా మారుతోంది.

### టీటీడీ శ్రీవారి సేవకు ఆధునిక శిక్షణ

భక్తులకు మెరుగైన సేవ అందేలా ఏపీఎస్‌డీపీఎస్, టీటీడీ, ఐఐఎం-అహ్మదాబాద్ కలిసి శ్రీవారి సేవకు నూతన శిక్షణ మోడల్‌ను రూపొందించాయి. ఫీల్డ్ స్టడీ, మాన్యువల్స్ రూపకల్పన, శిక్షణ కార్యక్రమాలతో మొదటి విడతలో 130మందికి మాస్టర్ ట్రైనింగ్ అందించారు. త్వరలో 1,700 సేవకులు శిక్షణ పొందనున్నారు. భక్తులకు మెరుగైన సేవ అందించడమే ఈ శిక్షణ యొక్క ప్రధాన లక్ష్యం.

### ప్రజా పాలనలోకి యువశక్తి

ప్రతి నియోజక వర్గానికి ఒక యంగ్ ప్రొఫెషనల్స్‌ను నియమించి, 6 రోజుల బూట్ క్యాంప్ శిక్షణతో వారిని ప్రజల ప్రభుత్వం మధ్య విజన్‌ను తయారు చేసింది. క్షేత్రస్థాయిలో డేటా ఆధారిత ప్లానింగ్‌కు ఈ యంగ్ ప్రొఫెషనల్స్ కీలక మద్దతు అందిస్తున్నారు.

### ప్రభుత్వోద్యోగుల పని తీరుకు స్కోర్‌కార్డ్ జీఈపీఈఎస్

ఉద్యోగుల పనితీరు అంచనాకు ఏపీఎస్‌డీపీఎస్ రూపొందించిన జీఈపీఈఎస్ సిస్టమ్‌తో పనితీరు ఉన్నవారికి గుర్తింపు ఇస్తుంది. ప్రతి ఒక్క ప్రభుత్వ ఉద్యోగికి వారి పనితీరును బట్టి స్కోర్‌కార్డ్‌లను ఇస్తుంది. ఉద్యోగులు అలసత్వాన్ని, నిర్లక్ష్యానికి చెక్ పెట్టడంతో పాటు సేవా నాణ్యతకు ప్రమాణాలు అనే మూడు దిశల్లో స్పష్టమైన ఫలితాలు కనిపిస్తున్నాయి.

### గుడ్ గవర్నెన్స్‌కు గ్లోబల్ హబ్‌గా ఏపీ అడుగులు

భవిష్యత్‌లో ఆంధ్రప్రదేశ్‌ను మంచి పాలన ఆలోచనలకు, పరిశోధనలకు, శిక్షణకు కేంద్రంగా తీర్చిదిద్దాలన్న ఆలోచనతో గ్లోబల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గుడ్ గవర్నెన్స్ ప్రతిపాదన పుట్టింది. భారతీయ, అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలు, థింక్ ట్యాంక్‌లతో భాగస్వామ్యాలపై చర్చలు జరుగుతున్నాయి. ప్రజలకు మెరుగైన సేవలు అందించి గుడ్ గవర్నెన్స్‌లోనే గ్లోబల్ హబ్‌గా ఏపీని నిలిపేందుకు వేగంగా అడుగులు పడుతున్నాయి. రాష్ట్ర మంత్రిత్వశాఖలలో వ్యూహాత్మక పనులకు 24 ఎస్‌వీఎంయూ ప్రొఫెషనల్స్ నియామకం జరగగా, ప్రతిభావంతులను ప్రభుత్వ పాలనలోకి తీసుకురావడానికి స్వర్ణాంధ్ర సీఎం ఫెలోషిప్ ప్రవేశపెట్టడం మరో ముందడుగు. ఏపీఎస్‌డీపీఎస్‌లో డిజిటల్ మార్పువల్ల ఉద్యోగ నియామకాలు, హెచ్‌ఆర్ఎంఎస్ పనితీరు అన్నీ ఒక క్లిక్ దూరంలో అయ్యాయి. పాలనలోని ఈ మార్పు ప్రచారం లేకుండానే సాగుతున్నా దాని ప్రభావం ఊహించని విధంగా ఉంటుంది. పాలనలో ప్రతి ఒక్కరినీ భాగస్వామ్యం చేస్తుంది. ప్రజలకు మెరుగైన సేవలను అందిస్తుంది. దేశానికి ఆదర్శంగా రాష్ట్రాన్ని నిలుపుతుంది. ఇది కేవలం ఒక డిపార్ట్‌మెంట్ కథ కాదు. ఇది ఆంధ్రప్రదేశ్‌లో రూపుదిద్దుకుంటున్న పాలనా సంస్కృతి కథ. స్వర్ణాంధ్ర లక్ష్యాలను సాధించాలంటే ఉద్యోగులే ప్రధాన శక్తి అని, శిక్షణ, టెక్నాలజీ, డేటా ఆధారిత పాలన -ఇవే భవిష్యత్ ఆంధ్రప్రదేశ్‌కు బలమైన పునాది అనే ఉద్దేశంతో ఆంధ్రప్రదేశ్ స్టేట్ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ ముందుకు సాగడం హర్షణీయం, అభినందనీయం.

# అన్నదాతకు అండ.. ఎన్జీఆర్ స్ఫూర్తే

- రైతు బాంధవుడిగా ఎన్జీరంగా అందరికీ ఆదర్శం
- గత పాలకులు రైతుల్ని రోడ్డున పడేశారు
- పంటల బీమా ఎగ్గొట్టి.. రైతును దగా చేశారు
- రాష్ట్రంలో ఏ ఒక్క రైతూ అధైర్య పడొద్దు
- ధాన్యంకొన్న 24 గంటల్లో రైతు ఖాతాకు సొమ్ము జమ
- ఎన్జీ రంగా 125వ జయంత్యుత్సవాల్లో సీఎం చంద్రబాబు
- ఆధునిక రాజ్యాంగ సంస్థలు పుస్తకాన్ని ఆవిష్కరించిన సీఎం

గుంటూరు (చైతన్య రథం): రైతు సంక్షేమానికి ఎన్డీయే ప్రభుత్వం కట్టుబడి ఉందని ఏపీ సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. వ్యవసాయ రంగానికి అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నామని, రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర లభించేలా అన్ని చర్యలూ తీసుకుంటున్నామన్నారు. గుంటూరులో ఆచార్య ఎన్జీ రంగా 125వ జయంత్యుత్సవాలకు ముఖ్య అతిథిగా సీఎం హాజరయ్యారు. ఈసందర్భంగా మాట్లాడుతూ... "వందేమాతర గేయానికి 150ఏళ్లు పూర్తయిన రోజునే ఆచార్య ఎన్జీ రంగా 125వ జయంతి జరుపుకోవడం ఆనందంగా ఉంది. రంగా జీవితం మనందరికీ ఆదర్శం. స్వాతంత్ర్య పోరాటంలో వెనకబడిపోతామనే కారణంతో పిల్లలనేవద్దనుకున్నారు రంగా దంపతులు. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో చదువుకున్నప్పటికీ ఆయన జీవిత మంతా స్వాతంత్ర్య సాధనకు, రైతు సంక్షేమానికి కృషి చేశారు"అని ముఖ్యమంత్రి



చంద్రబాబు నివాళి అర్పించారు.

### ఎన్జీ రంగాతో నాది ప్రత్యేక అనుబంధం

'ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నేను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు హైదరాబాద్ వ్యవసాయ యూనివర్సిటీకి ఎన్జీ రంగా పేరు పెట్టాం. విభజన తర్వాత నవ్యాంధ్రలో వ్యవసాయ వర్సిటీకీ ఆయన పేరు పెట్టాం. రూరల్ డెవలప్‌మెంట్‌పై నేను పీహెచ్‌డీ చేయాలనుకున్నప్పుడు రంగా రచనలు, అధ్యయనాలే నాలో స్ఫూర్తిని నింపాయి. 33ఏళ్ల వయసులోనే ఆయన ఆంధ్ర రైతాంగ ఉద్యమాన్ని ముందుండి నడిపించారు. వెంకటగిరి జమీందారీ అణిచివేతకు వ్యతిరేకంగా రైతులపక్షాన నిలిచారు. 1964లో 17వ రాజ్యాంగ సవరణకు వ్యతిరేకంగా పార్లమెంటులో ప్రసంగించి రైతు భూమిని కట్టడి చేసే చట్టాన్ని ఆయన ఆపారు. ఎన్జీ రంగా 50 ఏళ్లపాటు పార్లమెంటేరియన్‌గా చేసిన సేవలకుగాను గిన్నిస్ వరల్డ్ రికార్డులకు ఎక్కడం అరుదైన గౌరవం' అని ముఖ్యమంత్రి చంద్రబాబు గుర్తు చేసుకున్నారు.

### రైతు సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

'తెలుగుదేశం ప్రభుత్వం ఎప్పుడు అధికారంలో ఉన్నా రైతు సంక్షేమం కోసమే పనిచేస్తుంది. ఇప్పుడు



ఎన్డీయే ప్రభుత్వం వ్యవసాయరంగానికి పెద్దపీట వేస్తోంది. రైతుకు ఆదాయం పెరగాలంటే ఖర్చు తగ్గి ఉత్పత్తి పెరగాలి. 2014-2019 మధ్యకాలంలో వ్యవసాయ రంగం జీఎస్‌డీపీలో 16.6 శాతం వృద్ధి రేటు సాధించింది. గత ఐదేళ్ల పాలనలో 10 శాతానికి తగ్గిపోయింది. 2024-25లో 15.45 శాతానికి పెంచాం. గత ప్రభుత్వ అసమర్థ పాలనతో రైతులు రోడ్డున పడ్డారు. రబీలో 48 లక్షల ధాన్యం కొనుగోలుకు రూ.6 వేల కోట్లు మాత్రమే చెల్లించి రూ.1,674 కోట్లు బకాయిలు పెట్టారు. ఎన్డీఏ ప్రభుత్వం వచ్చాక ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ బకాయిలు క్లియర్ చేశాం. 2024 -25లో 55 లక్షల 79 వేల టన్నుల ధాన్యాన్ని రూ.12,857 కోట్లకు కొనుగోలు చేశాం. 8 లక్షల రైతులకు 24 గంటల్లోనే వారి అకౌంట్లకు నగదు జమ చేశాం. అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.7 వేలు జమ చేశామని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు.

### 95 శాతం పంట బీమా చెల్లించాం

'ప్రభుత్వ యంత్రాంగం సహకారంతో టెక్నాలజీ వినియోగించి ఇటీవల తుఫాను నష్టాన్ని గణనీయంగా తగ్గించాం. విపత్తుల్లో నష్టపోయిన రైతులకు 2014-19లో హెక్టారుకు రూ.20 వేలు అందిస్తే గత ప్రభుత్వం దాన్ని రూ.17 వేలకు తగ్గించింది. ఎన్డీయే ప్రభుత్వం రాగానే రూ.25 వేలకు పెంచాం. మూడేళ్ల పంటల బీమా సొమ్ము ఎగ్గొట్టినవారు విమర్శలు చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే 95 శాతం పంట బీమా చెల్లించాం. మామిడికి రూ.240 కోట్లు అదనంగా గిట్టుబాటు ధర ఇచ్చాం. పొగాకుకు రూ.273 కోట్లు ఖర్చు చేశాం. కోకో రైతుకు రూ.14 కోట్లు ఇచ్చాం. కాఫీకి 50 కేజీల చొప్పున ఎకరాకు రూ. 5 వేలు ఇచ్చాం. మిర్చికి రూ.130కోట్లు, టమాటాకు రూ. 12 కోట్లు, ఉల్లి దెబ్బ తిన్నచోట హెక్టారుకు రూ.50 వేల చొప్పున రూ. 100 కోట్లు వ్యయం చేశామని ముఖ్యమంత్రి చంద్రబాబు వివరించారు.

### సమర్థ నిర్వహణతోనే నీటి భద్రత

"సమర్థ నీటి నిర్వహణ, ముందస్తు చర్యలవల్ల రిజర్వాయర్లు 95 శాతం నిండాయి. గత ప్రభుత్వంలో రిజర్వాయర్ల గేట్లను కూడా నిర్వహించలేకపోయారు. ఎన్టీఆర్ స్ఫూర్తితో జలాశయాలను పూర్తిచేశాం. రాయలసీమలో కరవును జయించాం. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పిస్తున్నాం. డ్రిప్ ఇరిగేషన్ సబ్సిడీ ఇస్తున్నాం. ఎస్సీ, ఎస్టీ రైతులకు వందశాతం సబ్సిడీ. మిగిలినవారికి 50నుంచి 90శాతం సబ్సిడీ ఇస్తున్నాం. కౌలు రైతులు అధైర్యపడొద్దు. ఆత్మహత్యలు చేసుకోవద్దు. అన్ని విధాలా ఆదుకుంటాం. మారిన ఆహారపు అలవాట్లకు అనుగుణంగా పంటల మార్పిడి చేసుకోవాల్సిన అవసరముంది. మనం పండించిన పంటలను కొన్ని దేశాలు దిగుమతి చేసుకోవడానికి ఇష్టపడటం లేదు. అందుకు కారణం రసాయన ఎరువుల వాడకమే. సేంద్రియ వ్యవసాయంపై ప్రత్యేక దృష్టి పెట్టడంతోపాటు, పంటలకు సేంద్రియ ఎరువులను మాత్రమే వినియోగించాలి" అని ముఖ్యమంత్రి చంద్రబాబు రైతులకు సూచించారు. అనంతరం 'ఆధునిక రాజ్యాంగ వ్యవస్థలు' అనే పుస్తకాన్ని సీఎం చంద్రబాబు ఆవిష్కరించారు. కార్యక్రమానికి మంత్రి కె అచ్చెన్నాయుడు, ఎంపీ లావుకృష్ణదేవరాయలు, వ్యవసాయ వర్సిటీ అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు, వ్యవసాయరంగ నిపుణులు తదితరులు హాజరయ్యారు.









చైతన్యరథం

# 16 నెలల్లో మనం చేసిన...
# మంచిని ప్రజల్లోకి తీసుకెళ్లండి

- పనిచేసిన కార్యకర్తలను గుర్తించి నామినేటెడ్ పదవులిస్తున్నాం
- శవరాజకీయాలు వైసీపీకి వెన్నతో పెట్టిన విద్య
- ఆ పార్టీ ఫేక్ ప్రచారాలను సమర్థవంతంగా తిప్పికొట్టండి
- కూటమి కార్యకర్తలతో కలసికట్టుగా ముందుకు సాగండి
- కళ్యాణదుర్గం ఉత్తమ కార్యకర్తల సమావేశంలో యువనేత లోకేష్



కళ్యాణదుర్గం (చైతన్యరథం): గత 16నెలల పాలనలో మనం చేసిన మంచిని ప్రజలకు చెప్పుకోవాలి, ప్రజలతో మమేకం కావాలి.... ఇకపై యావత్ పార్టీ కేడర్ క్షేత్రస్థాయికి వెళ్లి ప్రజలను కలవాలని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పిలుపునిచ్చారు. అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం నియోజకవర్గ ఉత్తమ కార్యకర్తల సమావేశంలో శుక్రవారం యువనేత లోకేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ... అధికారంలోకి వచ్చాక ఎన్నో సంక్షేమ పథకాలను ప్రజలకు అందించామన్నారు. దేశంలో ఎక్కడాలేని విధంగా రూ.4వేల పెన్షన్, చదువుకునే పిల్లలందరికీ తల్లికి వందనం, ఉచిత గ్యాస్, ఉచిత బస్సు పథకాలను అమలు చేస్తున్నాం. ఒక్క పెన్షన్లపైనే రూ.40వేల కోట్లు ఖర్చుపెడుతున్నాం. ఇకపై ప్రతి మూడునెలలకు ఒక కార్యక్రమం ఇస్తాం. వీటన్నింటినీ సమర్థవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలి. ప్రతిపక్షంలో ఉన్నపుడు అనేక కేసులు పెట్టించుకుని ఇబ్బందిపడ్డారు, దెబ్బలు తిన్నారు, పనిచేసేవాళ్లను గుర్తించేందుకే ఈరోజు ఉత్తమ కార్యకర్తలతో భేటీ అవుతున్నామని లోకేష్ తెలిపారు.

## పార్టీని నిర్లక్ష్యం చేయవద్దు

పార్టీ సభ్యత్వం, మన టీడీపీ, బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ వంటి కార్యక్రమాల్లో ప్రతిభ చూపినవారిని గుర్తించే వేదిక ఇది. ఇది ఇక్కడితో ఆగదు, మరింత ముందుకు తీసుకెళ్తాం, ఇప్పుడు మన టీడీపీ వచ్చింది. పనిచేసిన వారిని జల్లెడబట్టి నామినేటెడ్ పదవులు ఇస్తున్నాం. పార్టీ పిలుపు ఇచ్చిన ప్రతి కార్యక్రమంలో కేడర్ భాగస్వాములు కావాలి, ప్రజలకు దగ్గర కావాలి. మన పార్టీలో చేసింది చెప్పుకోలేని జబ్బు ఉంది. మనం అధికారంలోకి వచ్చాక చేసింది చెప్పుకోం. నాతో సహా ప్రజల కోసం ఏదో చేద్దామని చూస్తాం తప్ప.. చేసింది చెప్పుకోం. ఈ జిల్లాలో అత్యంత ప్రతిష్టాత్మకమైన కియా మోటార్స్ తెచ్చినప్పటికీ ప్రజలకు చెప్పుకోలేకపోవడం వల్లే 2019లో ఓడిపోయాం. అధికారంలో ఉన్నపుడు సహజంగానే వత్తిడి ఎక్కువగా ఉంటుంది. ఎక్కడకు వెళ్లినా చివరికి తిరిగిరావాల్సింది పార్టీ వద్దకే. పార్టీ శాశ్వతం అన్న విషయాన్ని కార్యకర్తలు మరువద్దు. ఎట్టి పరిస్థితుల్లో పార్టీని నిర్లక్ష్యం చేయొద్దని లోకేష్ ఉద్బోధించారు.

## చేసింది చెప్పకపోవడమే బలహీనత

రాష్ట్రంలో ఎక్కడికి వెళ్లినా ఆ నియోజకవర్గంలో కేడర్ ను కలిశాకే అధికారిక కార్యక్రమానికి వెళ్తున్నా. అధినేత చంద్రబాబు కూడా ఎంత పని వత్తిడి ఉన్నా కార్యకర్తలతో మాట్లాడాకే తిరిగివెళ్తున్నారు. కార్యకర్తలంతా ఈ విషయాన్ని గుర్తు పెట్టుకోవాలి. దేవుడు కూడా అందరి సమస్యలు, కోర్కెలు, తీర్చలేరు. అంతమాత్రాన అలక వహించవద్దు. మనది పెద్ద ఉమ్మడి కుటుంబం. మన సమస్యలు మనమే పరిష్కరించుకోవాలి. పార్టీలో అంతర్గతంగా జగన్ పైకంటే ఎక్కువగా మీ కోసం నేను పోరాడతాను. పార్టీలో సంస్కరణలు తెచ్చేందుకు పోరాడాను. కొంతమంది పని జరగకపోతే సోషల్ మీడియా ఎక్కుతున్నారు, అది మంచి పద్ధతి కాదు. మనం పోరాడాల్సింది మన రాజకీయ ప్రత్యర్థి వైసీపీతో మాత్రమే. మనలో ఉన్న బలహీనత చేసిన మంచిని సరిగా చెప్పలేం. వైసీపీ వాళ్లు చేయనిది కూడా బలంగా చెబుతారని లోకేష్ గుర్తు చేశారు.

## వైసీపీ శవరాజకీయాలు...

వైసీపీ వారికి శవరాజకీయాలు వెన్నతోపెట్టిన విద్య. శ్రీకాకుళం గుడి ఘటనలో 9మంది చనిపోయారు. స్వామిని ప్రజల వద్దకు తీసుకొచ్చేందుకు 94 సంవత్సరాల వృద్ధుడు పాండా రూ.20 కోట్లు పెట్టి గుడికట్టారు. అక్కడ సరైన ఏర్పాట్లు లేకపోవటంతో దురదృష్టకర ఘటన జరిగింది. ఘటన జరిగిన వెంటనే నేను, కేంద్రమంత్రి రామ్మోహన్, రాష్ట్ర మంత్రులు అచ్చెన్న, అనిత హుటాహుటిన అక్కడకు వెళ్లాం. వైసీపీ వాళ్లు ఆ సమయంలో పాండా వ్యాఖ్యలను ఎడిట్ చేసి అనుమతి కోరితే ఇవ్వలేదంటూ తప్పుడు ప్రచారం చేశారు. మన తెలుగుబిడ్డ, క్రికెటర్ శ్రీచరణిని 3నెలల క్రితం విశాఖలో కలిశాను. బాగా ఆడాలని ప్రోత్సహించాను. వరల్డ్ కప్‌లో విజయం సాధించాక చెల్లెమ్మకి మంచి రివార్డు ఇవ్వాలని నిర్ణయించుకున్నాం. ఈ లోగానే వైసీపీ వారు అక్కడ కూడా కులం ప్రస్తావన తెచ్చేందుకు ప్రయత్నించారు. తాజాగా ఉండవల్లిలో శ్రీచరణి నన్ను కలిసినపుడు 24గంటలు ఎలా కష్టపడుతున్నారని అడిగింది. రాజకీయాల్లో మార్పు తేవాలంటే కష్టపడి పనిచేయక తప్పదు. గతంలో 32మంది కమ్మ డీఎస్పీలకు ప్రమోషన్ ఇచ్చామని వైసీపీ వాళ్లు తప్పుడు ప్రచారం చేశారు. చివరకు నలుగురు మాత్రమే ఉన్నారని తేలింది. అధినేత చంద్రబాబుని ఆదర్శంగా తీసుకొని అలసట వీడి ముందడుగు వేయండి. ప్రతిపక్షంలో ఉన్నా, అధకారంలో ఉన్నా ఆయన రేయింబవళ్లు కష్టపడతారు. ఇటీవల నేను ప్రధాని మోదీని చూసి ఆశ్చర్యపోయా. 75ఏళ్ల వయసులో కూడా ఎంతో కష్టపడుతున్నారు. అందుకే వారిలో వయోభారం కనపడదని లోకేష్ అన్నారు.

## గతంలో పడిన కష్టాలను మరువద్దు

పార్టీలో సమస్యలుంటే పరిష్కరించడానికి ఎంపీ, ఎమ్మెల్యే, ఇన్‌ఛార్జి మంత్రి, నేను ఉన్నా. నేను కూడా ఇకపై వారానికి ఒకరోజు పార్టీ కార్యాలయంలో అందుబాటులో ఉంటా. పార్టీ పిలుపు ఇచ్చే అన్ని కార్యక్రమాలు చిత్తశుద్ధితో అమలుచేస్తూ, చేసింది సమర్థవంతంగా జనంలోకి తీసుకెళ్తే 2029 ఎన్నికల్లో కూడా జయం మనదే. అధికార గర్వం, అహంకారం వీడి టీమ్ వర్క్‌గా పనిచేయాలి. మంత్రులందరం రాష్ట్రానికి మేలు చేయాలనే తపనతో పనిచేస్తున్నాం. అధికారంలోకి వచ్చాం కదా అని గతంలో మనం పడిన కష్టాలను మరువద్దు. నాపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, హత్యాయత్నం కేసులు పెట్టారు. చంద్రబాబుని 53రోజులు అక్రమంగా నిర్బంధించారు. ఉత్తమ కార్యకర్తలను గుండెల్లో పెట్టుకొని చూసుకుంటాం. నామినేటెడ్ పదవుల్లో ఇప్పుడు మొదటిరౌండ్ మాత్రమే పూర్తయింది. మరో రౌండ్ ఉంది, కంగారు వద్దు. పనిచేస్తూ వెళ్తే పార్టీ మిమ్మల్ని కచ్చితంగా గుర్తిస్తుంది. నేను మర్చిపోయినా చంద్రబాబు మిమ్మల్ని మర్చిపోరని లోకేష్ భరోసా ఇచ్చారు.

## కూటమి కార్యకర్తలతో కలసివెళ్లండి

చిన్నచిన్న విభేదాలున్నా కూటమి పార్టీల కార్యకర్తలతో కలసికట్టుగా ముందుకెళ్లాలి. రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రంలో ప్రధానమంత్రి నాయకత్వాన్ని బేషరతుగా బలపరుస్తున్నాం. భవిష్యత్తులో కూడా మూడు పార్టీలు కలిసే ఉంటాయి. వైసీపీ ఫేక్ ప్రచారాన్ని పట్టించుకోవద్దు. అధికారం పోయాక వారు అసెంబ్లీనుంచి పారిపోయారు. చంద్రబాబు సింహంలా సింగిల్‌గా నిలబడి పోరాడారు. నాయకుడంటే అలా ఉండాలి. వైసీపీ ఫేక్ బ్యాచ్‌ని ఎవరూ నమ్మరు. ఎర్రబుక్కును ఎగతాళి చేసినవారి పరిస్థితి ఏమిటో మీరంతా చూస్తున్నారు. పార్టీ కేడర్‌ను ఇబ్బందులు పెట్టిన వారెవరినీ వదిలే ప్రసక్తిలేదు. కార్యకర్తలంతా రేయింబవళ్లు కష్టపడాలి. కలసికట్టుగా పనిచేద్దాం, పోరాడదాం. నేను, చంద్రబాబు రాష్ట్రంలో అన్ని నియోజకవర్గాల్లో తిరుగుతాం. ఓర్పు సహనంతో ముందుకెళదాం. మీ ఎమ్మెల్యే ప్రజలకు ఏదో చేయాలనే తపనతో ఉన్నారు. ఆయనకు ఇవ్వడం తప్ప చేయి చాపే అలవాటులేదు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు ఇబ్బందికరంగా ఉన్నాయి. రూ.12లక్షల కోట్ల అప్పు ఉంది. ముఖ్యమంత్రి చంద్రబాబు సమర్థతవల్లే నెగ్గుకురాగలుతున్నాం. ఎన్ని కష్టాలు ఎదురైనా ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చుతాం, వెనుకడుగు వేసే ప్రసక్తి లేదని యువనేత లోకేష్ ఉద్ఘాటించారు.

ఈ సమావేశంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి టీజీ భరత్, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, అనంతపురం పార్లమెంటు ఇన్చార్జి వెంకటశివుడు, జోనల్ కోఆర్డినేటర్, గుంటూరు మేయర్ కోవెలమూడి రవీంద్ర (నాని), తదితరులు పాల్గొన్నారు.







## శ్రీచరణికి ఘనస్వాగతం

భారత మహిళా జట్టులో కీలక పాత్ర పోషించి ప్రపంచ కప్‌ను గెలిచిన అనంతరం, తొలిసారిగా స్వరాష్ట్రానికి వచ్చిన మన ఆంధ్ర అమ్మాయి ఐసీసీ వరల్డ్ కప్- 2025 ఛాంపియన్ క్రికెటర్ శ్రీచరణి కి గన్నవరం ఎయిర్ పోర్ట్‌లో శుక్రవారం మహిళా మంత్రులు సవిత, వంగలపూడి అనిత, గుమ్మిడి సంధ్యారాణి, ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), ఏసీసీ ప్రతినిధులు, శాప్ ఛైర్మన్ రవినాయుడు, అధికారులు ఘనంగా స్వాగతం పలికారు.



## సీఎం చంద్రబాబు అనుభవం, సమర్ధతతో..

# దూసుకెళుతున్న రాష్ట్రం





- ఏపీని చూసి పొరుగు రాష్ట్రాలు అసూయపడే రోజు తీసుకువస్తాం
- వైసీపీ దుష్ప్రచారాలను టీడీపీ కార్యకర్తలు తిప్పికొట్టాలి
- టీడీపీ అంటే అనంతపురం.. అనంతపురం అంటే టీడీపీ
- ఈ జిల్లాకు ఎంత చేసినా తక్కువే
- జగన్ రెడ్డి ఏనాడు సొంత కార్యకర్తలను పట్టించుకోలేదు
- కళ్యాణదుర్గం నియోజకవర్గ టీడీపీ కార్యకర్తలు, నేతలతో సమన్వయ సమావేశంలో మంత్రి లోకేష్

కళ్యాణదుర్గం (చైతన్యరథం): సీఎం చంద్రబాబుకి ఉన్న అనుభవంతో రాష్ట్రాన్ని సమర్థంగా ముందుకు నడిపిస్తున్నారు.. ఏపీని చూసి పొరుగు రాష్ట్రాలు అసూయపడే రోజు తీసుకువస్తాం.. వైసీపీ దుష్ప్రచారాలను టీడీపీ కార్యకర్తలు తిప్పికొట్టాలని పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పిలుపు ఇచ్చారు. అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం నియోజకవర్గ టీడీపీ కార్యకర్తలు, నేతలతో శుక్రవారం మంత్రి లోకేష్ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... మారుతున్న కాలానికి అనుగుణంగా టీడీపీ సిద్ధాంతాలను ముందుకు తీసుకెళ్లాలనే లక్ష్యంతో మొన్నటి కడప మహానాడులో కార్యకర్తలే మా అధినేత అని ప్రకటించామన్నారు. ఆ సిద్ధాంతానికి అనుగుణంగా కార్యకర్తలకు అందుబాటులో ఉంటున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబుకి హృదయపూర్వక నమస్కారాలు. కార్యకర్తలు నడిపించే పార్టీ ఒక్క తెలుగుదేశం పార్టీనే. నాకు అక్కా తమ్ముళ్లు, అన్నా చెల్లెళ్లు లేరు. స్వర్గీయ ఎన్టీఆర్ నాకు కోటి మంది టీడీపీ కుటుంబ సభ్యులను ఇచ్చారు. పసుపు జెండా, రంగును చూసినా మనకు ఎమోషనే. కార్యకర్తలను చూసి ఉత్సాహం తెచ్చుకున్న వ్యక్తి మీ లోకేష్. ఆనాడు పుంగనూరులో చూశాం. స్థానిక ఎన్నికలు జరుగుతుంటే అంజిరెడ్డి తాత పార్టీ కోసం వీరోచితంగా పోరాడారు. పార్టీ కోసం పోరాడిన మంజులారెడ్డి, చెన్నుపాటి గాంధీనే నాకు స్ఫూర్తి. జిల్లా పర్యటనలకు వచ్చినప్పుడు నేను కానీ, సీఎం చంద్రబాబు కానీ ముందుగా కార్యకర్తలను కలిసి వారి సమస్యలు తెలుసుకుంటున్నాం. కార్యకర్తల సంక్షేమం కోసం ఇప్పటికి రూ.135 కోట్లు ఖర్చు చేశాం. ఐదేళ్లు వైసీపీపై పోరాడారు. మీకు నేను ఎంత చేసినా తక్కువేనని మంత్రి లోకేష్ అన్నారు.

### ఇబ్బందులున్నా ముందుకే..

వైసీపీ పాలనలో ఐదేళ్లు ఎన్నో ఇబ్బందులు పెట్టారు. నాపై అక్రమ కేసులు పెట్టారు. పాదయాత్రలో ఇబ్బందులకు గురిచేసినా కార్యకర్తలు అండగా నిలిచి నన్ను నడిపించారు. ఎక్కడికి వెళ్లినా ఘనంగా స్వాగతం పలికారు. ఇప్పుడు అందరూ వస్తారు. ఆ రోజుల్లో బయటకు రావాలంటే భయం. ఎక్కడ ఇబ్బంది పెడతారో, కేసులు పెడతారో అని. టీడీపీ అంటే అనంతపురం.. అనంతపురం అంటే టీడీపీ. మా కుటుంబాన్ని మీరు ఆశీర్వదించి దీవించారు. ఎన్టీఆర్‌ని, హరికృష్ణని, బాలకృష్ణని గెలిపించారు. జిల్లాకు ఎంత చేసిన తక్కువే. మొన్నటి ఎన్నికల్లో సూపర్ మెజార్టీ ఇచ్చారు. రాష్ట్రం ఇబ్బందుల్లో ఉంది. అయినా చంద్రబాబుకి ఉన్న అనుభవంతో సమర్థంగా రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తున్నారు. గత పాలకులు వెయ్యి రూపాయలు పెన్షన్ పెంచడానికి ఐదేళ్లు తీసుకుంటే.. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే రూ.వెయ్యి పెంచింది. వృద్ధులకు రూ.4వేలు, వికలాంగులకు రూ.6వేలు, మంచానికే పరిమితమైన వారికి రూ.15వేలు పెన్షన్ అందిస్తున్నాం. దేశంలో ఏ రాష్ట్రం ఈ విధంగా పెన్షన్లు అందించడం లేదు. అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, ఉచిత గ్యాస్, బస్సు పథకం అందిస్తున్నామని మంత్రి లోకేష్ వివరించారు.

### అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి. నాకు సవాళ్లు అంటే ఇష్టం. అందుకే విద్యాశాఖను ఎంచుకున్నా. మంగళగిరిలో మొదటిసారి పోటీచేసినప్పుడు ఓడిపోయాను. అనేక రకాలుగా అవమానించారు. మొన్నటి ఎన్నికల్లో 91వేల మెజార్టీతో గెలిచా. అక్కడి నుంచి ప్రత్యర్థులకు సౌండ్ లేదు. మెగా డీఎస్సీపైనా అనేక విధాలుగా మాట్లాడారు. 150 రోజుల్లో నిర్వహించి నియామకాలు చేపట్టాం. అనేక పెట్టుబడులు తీసుకువస్తున్నాం. మన పిల్లల భవిష్యత్ కోసం సీఎం చంద్రబాబు అహర్నిశలు కష్టపడుతున్నారని మంత్రి లోకేష్ అన్నారు.

### ఆ రోజు తీసుకువస్తాం

ఎన్నాళ్లు పక్కన ఉన్న తమిళనాడు, కర్ణాటక, తెలంగాణను చూసి అసూయపడతాం. ఏపీని చూసి పొరుగు రాష్ట్రాలు అసూయపడే రోజులు తీసుకువస్తాం. నియోజకవర్గ అభివృద్ధి కోసం సురేంద్రబాబు సొంత నిధులు ఖర్చు చేస్తున్నారు. ఉచిత డీఎస్సీ కోచింగ్ అందించడం ద్వారా 76 మంది ఉపాధ్యాయులుగా నియమితులు అయ్యారు. పనిచేసే వారిని నేను ప్రోత్సహిస్తా. మనం ఎదిగేకొద్దీ ఒదిగి ఉండాలి. మన డిక్షనరీ నుంచి అహంకారం అనే పదాన్ని తీసేయాలని మంత్రి లోకేష్ సూచించారు.

### అబద్ధాలు చెప్పడంలో వైసీపీ దిట్ట

వైసీపీ హయాంలో చంద్రబాబుని అనేక రకాలుగా అవమానించారు. మా తల్లిని అవమానించారు. ఎవరినీ వదిలిపెట్టేది లేదు. శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ ఆలయంలో 9 మంది భక్తులు చనిపోయిన దుర్ఘటనలో ఆలయం నిర్వాహకులు పాండా మాట్లాడిన మాటలపై ఫేక్ వీడియో తయారుచేసి దుష్ప్రచారం చేశారు. గతంలో ఒకే సామాజికవర్గానికి చెందిన 34 మందికి డీఎస్పీ ప్రమోషన్లు ఇచ్చారని దుష్ప్రచారం చేశారు. ఇవన్నీ ఆ పార్టీ ఫేక్ ప్రచారానికి నిదర్శనం. పార్టీలో ఏమైనా సమస్యలు ఉండే మాట్లాడుకుని పరిష్కరించుకుందాం. పార్టీ నేతలు అలక వీడాలని మంత్రి లోకేష్ కోరారు.

### ప్రభుత్వ కొనసాగింపు చాలా అవసరం

మహిళల జోలికి వెళితే ఉపేక్షించేది లేదు. మహిళలను అందరూ గౌరవించాలి. గాజులు తొడుక్కున్నావా, చీర కట్టుకున్నావా లాంటి పదాలను విడనాడాలి. టీడీపీ, జనసేన, బీజేపీ.. మూడు పార్టీలు కలిసికట్టుగా రాష్ట్రాన్ని, దేశాన్ని ముందుకు తీసుకెళ్తున్నాయి. పదిహేనేళ్ల పాటు మనం కలిసికట్టుగా కృషి చేసి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నిలుపుదామని పవనన్న చెబుతున్నారు. ప్రభుత్వ కొనసాగింపు చాలా అవసరం. గుజరాత్, ఒడిశాలో ప్రభుత్వ కొనసాగింపు వల్ల అభివృద్ధి జరిగింది. రాష్ట్రంలో మూడు పార్టీలు కలిసికట్టుగా ముందుకు వెళ్తాయని మంత్రి లోకేష్ స్పష్టం చేశారు.

### కార్యకర్తలను పట్టించుకోని జగన్

శాంతిభద్రతలకు ఎవరు విఘాతం కలిగించినా వదిలిపెట్టం. జగన్ రెడ్డి ఏనాడూ సొంత కార్యకర్తలను పట్టించుకోలేదు. కార్యకర్తలకు కనీసం చేయి అందించరు.. కనీసం ఒక్క ఫోటో ఇవ్వరు. సొంత కార్యకర్త కారు కింద పడి చనిపోతే పక్కన పడేసి వెళ్లిపోయారు. దీనిని అందరూ గమనించాలని, కష్టపడి రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకుందామని మంత్రి లోకేష్ పిలుపు ఇచ్చారు. సమావేశం అనంతరం టీడీపీ కార్యకర్తలను కలిసి అర్జీలు స్వీకరించారు. వారితో కలిసి ఫోటోలు దిగారు.

ఈ సమావేశంలో జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి టీజీ భరత్, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, అనంతపురం జిల్లా టీడీపీ అధ్యక్షులు వెంకటశివుడు, జోనల్ కోఆర్డినేటర్, గుంటూరు మేయర్ కోవెలమూడి రవీంద్రబాబు, తదితరులు పాల్గొన్నారు.



# రాష్ట్రానికి మరో భారీ ప్రాజెక్ట్

- దేశంలోనే రెండో అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ సోలార్ సెల్ యూనిట్
- తెలంగాణకు చెందిన ప్రీమియర్ ఎనర్జీస్ రూ.5,942కోట్ల పెట్టుబడి
- నాయుడుపేట వద్ద ఏర్పాటు
- మంత్రి నారా లోకేష్ వెల్లడి



అమరావతి (చైతన్యరథం): దేశంలోనే రెండో అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ సోలార్ సెల్ అండ్ మాడ్యూల్ తయారీ ప్రాజెక్ట్ ఏపీకి రానుందని విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ వెల్లడించారు. ఇందు కోసం తెలంగాణకు చెందిన ప్రీమియర్ ఎనర్జీస్ సంస్థ ఏపీలో రూ.5,942 కోట్లు పెట్టుబడి పెట్టనుందని తెలిపారు. ఈ మేరకు ఎక్స్‌లో మంత్రి లోకేష్ పోస్ట్ చేశారు. ప్రీమియర్ ఎనర్జీస్ సంస్థ నెల్లూరు జిల్లా నాయుడుపేటలో సౌర యూనిట్ ఏర్పాటు చేయనుంది. ఈ ప్రాజెక్టులో 5 GW సిలికాన్ ఇంగోట్, వేఫర్ ప్లాంట్‌తో కూడిన 4 GW TOPCon సోలార్ సెల్ యూనిట్ భాగంగా ఉంటాయి. ఎకో సిస్టం అభివృద్ధి ఆయే& కొద్దీ ఈ ప్రాజెక్ట్ దాదాపు 3,500 ప్రత్యక్ష ఉద్యోగాలను సృష్టిస్తుంది. ఈ ప్రాజెక్ట్ సాకారం చేయటంలో మేం ఎంతో వేగంగా పనిచేశాం. ఏపీఐఐసీ రికార్డు సమయంలో 269 ఎకరాల భూమిని సిద్ధం చేసింది. అక్టోబర్ 2024లో చర్చలు ప్రారంభమయితే ఫిబ్రవరి 2025 నాటికి భూమిని కేటాయించారు. దగ్గరలో పోర్టుల ఉండటం ఈ ప్రాజెక్ట్‌కు అనుకూల అంశం. ప్రభుత్వం నుంచి మెరుగైన ప్రోత్సాహకాలు ప్రకటించాం. ఏపీని ప్రముఖ సౌర తయారీ కేంద్రంగా రూపుదిద్దటంలో ఈ ప్రాజెక్ట్ కీలకం కానుంది. అదే సమయంలో పారిశ్రామిక వృద్ధితోపాటు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ కూడా బలోపేతం అదుతుంది. 7 GWకి సామర్థ్యాన్ని అందుకునేలా ప్రణాళికలు రూపొందిస్తున్నాం. ఏదేమైనా దేశంలోనే రెండో అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ సోలార్ సెల్ అండ్ మాడ్యూల్ తయారీ ప్రాజెక్ట్‌నే ఏపీకి సగర్వంగా ఆహ్వానిస్తున్నామని మంత్రి లోకేష్ పేర్కొన్నారు.



## శ్రీచరణి అంకితభావం
# రాష్ట్రానికి గర్వకారణం

**- మంత్రి లోకేష్**

అమరావతి (చైతన్యరథం): వరల్డ్‌కప్ గెలుచుకున్న టీమిండియా మహిళా జట్టు సభ్యురాలు శ్రీచరణిపై విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్ ప్రశంసలు కురిపించారు. మొక్కవోని ఆమె పట్టుదల, అంకితభావం ఆంధ్రప్రదేశ్‌ను గర్వపడేలా చేసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆమెకు రూ.2.5 కోట్ల నగదు బహుమతి ప్రకటించిందన్నారు. అంతే కాకుండా గ్రూప్-1 ప్రభుత్వ ఉద్యోగం, కడపలో నివాస స్థలంతో సత్కరిస్తుందని ప్రకటించడానికి సంతోషంగా ఉందని ఎక్స్‌లో మంత్రి లోకేష్ పోస్ట్ చేశారు.

## విద్యార్థుల వందేమాతరం ప్రదర్శన భేష్

**- మంత్రి లోకేష్ అభినందనలు**

అమరావతి (చైతన్యరథం): స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తిని దేశమంతా వ్యాప్తి చేసిన వందేమాతరం గీతం 150 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట ఆంధ్రప్రదేశ్ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలుర పాఠశాలలో విద్యార్థుల ప్రదర్శనను విద్య, ఐటీశాఖల మంత్రి అభినందించారు. వందేమాతరం గీతానికి 150 ఏళ్లు పూర్తయినట్లుగా చూపిస్తూ 500 మంది విద్యార్థులు భారతదేశ పటం ఆకారంలో నిర్వహించిన ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుందన్నారు. వందేమాతరం.. మన దేశాన్ని ప్రగతి పథంలో నడిపించే నిత్య చైతన్య గేయం. వందేమాతరం.. నినదిస్తాం నిరంతరం.. అందరికీ అభినందనలు అని మంత్రి లోకేష్ పేర్కొన్నారు.

## పుట్టపర్తి విమానాశ్రయంలో
# మంత్రి లోకేష్‌కు ఘనస్వాగతం



పుట్టపర్తి (చైతన్యరథం): అనంపురం జిల్లా పర్యటన కోసం శుక్రవారం సాయంత్రం పుట్టపర్తి విమానాశ్రయానికి చేరుకున్న విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్‌కు పుట్టపర్తి విమానాశ్రయానికి చేరుకున్న విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్, ఎంపీలు బీకే పార్థసారథి, అంబికా లక్ష్మీ నారాయణ, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, కల్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, ఎమ్మెల్యేలు కందికుంట వెంకట ప్రసాద్, దగ్గుబాటి వెంకట ప్రసాద్, బండారు శ్రావణి శ్రీ, ఎంఎస్ రాజు తదితరులు మంత్రి లోకేష్‌కు స్వాగతం పలికినవారిలో ఉన్నారు. మంత్రి నారా లోకేష్‌ను కలిసేందుకు టీడీపీ నేతలు, కార్యకర్తలు విమానాశ్రయానికి పెద్దఎత్తున తరలివచ్చారు. ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకించి, ఫోటోలు దిగిన మంత్రి నారా లోకేష్















చైతన్యరథం



# 'అనంత'లో లోకేష్‌కు నీరాజనాలు

అనంతపురం (చైతన్యరథం): కళ్యాణదుర్గం పర్యటనకు వచ్చిన టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్ ఉమ్మడి అనంతపురం జిల్లాలో అడుగడుగునా పార్టీ నేతలు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. ఎక్కడిక్కడ జనం నీరాజనాలు పలికారు. ధర్మవరం పట్టణం పొట్టి శ్రీరాములు కూడలిలో మంత్రి లోకేష్ కు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఘనస్వాగతం పలికారు. ధర్మవరం తెలుగు యువత ఆధ్వర్యంలో గజమాలతో స్వాగతం పలికారు. ప్రతిఒక్కరిని ఆప్యాయంగా పలకరించిన మంత్రి లోకేష్ అర్జీలు స్వీకరించారు.

రాప్తాడు నియోజకవర్గం మామిళ్లపల్లి గ్రామంలో మంత్రి లోకేష్‌కు టీడీపీ శ్రేణులు అపూర్వ స్వాగతం పలికారు. కాన్వాయ్ ఆపి ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ మంత్రి లోకేష్ ముందుకు సాగారు.


వడ్డేపల్లి గ్రామంలో విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల కార్పోరేషన్ చైర్మన్ జి.నారాయణ స్వామి ఆధ్వర్యంలో మంత్రి లోకేష్‌కు టీడీపీ నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికారు. మంత్రి లోకేష్ రాకను పురస్కరించుకుని బాణసంచా కాల్చి టీడీపీ నాయకులు తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ప్రతిఒక్కరికి అభివాదం చేస్తూ, అర్జీలు స్వీకరిస్తూ మంత్రి లోకేష్ ముందుకు సాగారు.

కల్యాణదుర్గం నియోజకవర్గం గోళ్ల గ్రామంలో మంత్రి నారా లోకేష్‌కు గజమాలతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. కల్యాణదుర్గం పట్టణంలో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆధ్వర్యంలో ముదిగల్లు రోడ్డులో మంత్రి లోకేష్‌కు అపూర్వ స్వాగతం లభించింది. బాణసంచా కాల్చి టీడీపీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. టి సర్కిల్, గాంధీ సెంటర్‌లో పెద్దఎత్తున తరలివచ్చిన ప్రజలు మంత్రి లోకేష్‌ను గజమాలతో సత్కరించారు.






















# వచ్చే ఏడాది వెలిగొండ ఆయకట్టుకు నీరు

- యుద్ధ ప్రాతిపదికన ప్రాజెక్టు పనులు
- మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టీకరణ
- నిపుణులతో కలసి పనులు పరిశీలించిన మంత్రి



ప్రకాశం (చైతన్యరథం): ప్రకాశం జిల్లాలో వెలిగొండ ప్రాజెక్టు పనులు వచ్చే సంవత్సరానికి పూర్తి చేసి ఆయకట్టు రైతాంగానికి పూర్తిస్థాయిలో నీరు అందిస్తామని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు. ఇటీవల మొంథా తుఫాన్ కారణంగా దెబ్బతిన్న వెలిగొండ ఫీడర్ కెనాల్‌ను ఇరిగేషన్ నిపుణుల బృందంతో శుక్రవారం ఆయన పరిశీలించారు. మెంథా తుఫాన్ వర్షాలకు ఫీడర్ కెనాల్ 850 మీటర్ వద్ద, వంద అడుగుల పొడవున 30 అడుగుల లోతులో పడిన గండిని పరిశీలించి, జంట సొరంగాలలోకి 9 కి.మీ మేర చొచ్చుకు వచ్చిన నీటిని తొలగించే పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. భవిష్యత్తులో కూడా వచ్చే వరదలను దృష్టిలో పెట్టుకుని ఫీడర్ కెనాల్ సీసీ వాల్ లైనింగ్ నిర్మాణంలో డిజైన్స్ అప్రూవల్ చేయాలని సూచించారు.

ఈ సందర్భంగా వెలిగొండ క్యాంప్ ఆఫీస్ లో ప్రాజెక్ట్ పెండింగ్ పనులపై అధికారులు, ఏజెన్సీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 30 ఏళ్ల కిందట భూమి పూజ చేసిన ఈ ప్రాజెక్టు ఇప్పటికీ పూర్తవ్వకపోవడంపై ఆయన తీవ్ర ఆవేదన చెందుతున్నట్లు రామానాయుడు చెప్పారు. అందువల్లనే కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వెలిగొండ పై సీఎం చంద్రబాబు ప్రత్యేక శ్రద్ధ పెట్టి పనులను పరుగులు తీయిస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలోనే తామంతా రేయింబవళ్లు శ్రమించి వెలిగొండ పూర్తికి కంకణం కట్టుకున్నామన్నారు. వాస్తవాలు ఇలా ఉండగా వెలిగొండ పూర్తి కాకుండానే జాతికి అంకితం చేసిన జగన్, తన అబద్దాల వేదిక సాక్షి మీడియాలో వెలిగొండపై అవాకులు చవాకులు పేలడం ఆశ్చర్యంగా ఉందన్నారు. ఏడాదిన్నరగా ప్రాజెక్టు పనులు కుంటుపడ్డాయని కువిమర్శలు చేయడం విడ్డూరం కాక మరేమిటని ప్రశ్నించారు. రాష్ట్రంలోనే అత్యంత వెనుకబడిన జిల్లా, ఫ్లోరైడ్ బాధిత జిల్లా అయిన ప్రకాశం జిల్లా వాసులను జగన్ దగా చేశాడని మంత్రి ధ్వజమెత్తారు. తల్లిని, చెల్లిని మోసం చేసిన అతనికి ప్రకాశం జిల్లా ప్రజలను మోసం చేయడం పెద్ద విషయం కాకపోవచ్చునని ఎద్దేవా చేశారు.

### ఐదేళ్లలో రూపాయి ఇవ్వలేదు

నిర్వాసితులకు రూ.900 కోట్లకు పైగా పరిహారం అందించాల్సి ఉండగా జగన్ ఐదేళ్ల హయాంలో ఒక్క రూపాయి అందించలేదని మంత్రి దుయ్యబట్టారు. నాడు 2014-19 లో టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు రూ.1373 కోట్లు నిధులు కేటాయించి రూ.1319 కోట్లు అనగా 96శాతం ఖర్చుచేశారని చెప్పారు. ప్రాజెక్ట్ పూర్తికాకుండానే పూర్తయిపోయిందంటూ జాతికి అంకితం చేసిన ఘనుడు జగన్ అని విమర్శించారు. టన్నెల్-2లో ఇంకా 4.2 కి.మీ లైనింగ్ పనులు, బెంచింగ్ పనులు చేయడంతో పాటు, టిబిఎం మెషిన్ తొలగించాల్సి ఉందన్నారు. ఫీడర్ కెనాల్ లైనింగ్, 3 కి.మీ పొడవున రిటైనింగ్ వాల్ నిర్మాణ పనుల కోసం ఇటీవలే రూ.456 కోట్లుతో టెండర్లు పిలిచామని మంత్రి రామానాయుడు వివరించారు. ఈనెలలోనే ఫీడర్ కెనాల్ పనులు మొదలు పెట్టబోతున్నట్లు చెప్పారు. టన్నెల్-2లో టిబిఎం మెషిన్ తొలగించడానికి సాంకేతిక నిపుణుల కమిటీని నియమించామన్నారు.

### గడువులోగా పూర్తి

సిఎం చంద్రబాబు ఆదేశాల మేరకు 2026 కల్లా వెలిగొండ పూర్తి చేసి, ఆయకట్టు రైతులకు నీరందించే లక్ష్యంతో రేయింబవళ్లు పని చేస్తున్నామన్నారు. ఇచ్చిన హామీకి కట్టుబడి ఇటీవలే హంద్రీనీవా కాలువల ద్వారా రాయలసీమకు కృష్ణా జలాలను తరలించి చూపించామన్నారు. అలాగే వెలిగొండకు కూడా 2026 నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి నీరందించటం ఖాయమన్నారు. ఆ లోగానే నిర్వాసితుల కాలనీలు పూర్తి చేయటం, పరిహారం పంపిణీ తదితర సమస్యలు పరిష్కరిస్తామన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో ఈ ప్రాజెక్టుకి సంబంధించి ఏడు కాలనీల్లో నాలుగింటిని నిర్మించినట్లు చెప్పారు. ఆ పనులు తాలూకు బిల్లులు తమ ప్రభుత్వం వచ్చిన తర్వాతే చెల్లించామన్నారు. ఈ కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రణాళికా బద్ధమైన కృషి జరుగుతుందని మంత్రి రామానాయుడు స్పష్టం చేశారు. జగన్ హయాంలో చిల్లిగవ్వ కూడా ఇవ్వని కారణంగా వెలిగొండ నిర్వాసితులకు ఇంకా 900 కోట్ల రూపాయలు చెల్లించాల్సి ఉందన్నారు. 2026 సంవత్సరం చివరికి ప్రాజెక్టు పూర్తి తో పాటు ఇతర సమస్యలను కూడా పరిష్కరిస్తామని రామానాయుడు చెప్పారు.

## 11. 12 తేదీల్లో టీడీపీ కమిటీల ప్రమాణ స్వీకారం

- మండల, క్లస్టర్, యూనిట్, విలేజ్, బూత్ కమిటీల ప్రమాణస్వీకార కార్యక్రమం నిర్వహించండి
- ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జిలకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా లేఖ



అమరావతి (చైతన్యరథం): తెలుగుదేశంపార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఆదేశాల మేరకు 175 నియోజకవర్గాల్లోని మండల, క్లస్టర్, యూనిట్, విలేజ్, బూత్ కమిటీల ప్రమాణస్వీకార కార్యక్రమం ఈ నెల 11, 12, 13 తేదీల్లో అందరు ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జిలు వారి నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో జరిపించాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జిలకు పల్లా లేఖ రాశారు. కార్యకర్తల ఆమోదంతో పార్టీ అధిష్టానం ఖరారు చేసిన తుది జాబితాను ఇప్పటికే ఎమ్మెల్యేలకు, ఇన్‌ఛార్జిలకు పంపించామన్నారు. అందరికీ సమాచారం అందించి ఈ కార్యక్రమం విజయవంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని పల్లా సూచించారు.

తెలుగు జాతి ప్రగతికి పునాది వేసిన

## మహామనిషి ఆచార్య ఎన్జీ రంగా

**- 125వ జయంతి సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు నివాళులు**



అమరావతి (చైతన్యథం): ఆధునిక భారతదేశ శాస్త్రవిజ్ఞాన రంగాలకు దారి చూపించిన మహోన్నత మేధావి, రైతు సంక్షేమం కోసం జీవితాంతం పోరాటం చేసిన వెలుగు దిక్సూచి, స్వాతంత్ర్య సమరయోధుడు, తెలుగు జాతి గర్వకారణం పద్మ విభూషణ్ ఆచార్య ఎన్‌జీ రంగా 125వ జయంతి సందర్భంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఘనంగా నివాళులు అర్పించారు. ఆచార్య రంగా మేధస్సు, పరిశోధన, సేవాస్ఫూర్తి, ప్రజాసంకల్పం నేటి తరాలకు శాశ్వత ప్రేరణ అని మంత్రి అన్నారు. రైతుల హక్కుల కోసం రాజీ పడకుండా పోరాడిన గొప్ప నాయకుడైన రంగా మార్గం అందరికీ అనుసరణీయమన్నారు. శాస్త్రీయ దృష్టి, సాంకేతికత, ఆధునిక వ్యవసాయం, గ్రామీణ అభివృద్ధి అనే విలువలతో నిండిన ఆయన ఆలోచనలు ఇప్పటికీ భారతదేశానికి మార్గదర్శకాలు అని మంత్రి అన్నారు. ఆచార్య రంగా ఆశయాల మేరకే.. రాష్ట్రంలో రైతు సంక్షేమానికి సీఎం చంద్రబాబు నాయుడు సారథ్యంలో కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు, అమలు చేస్తున్న ఆధునిక పథకాలు ఉన్నాయని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. అన్యాయానికి ఎదురు నిలిచి రైతును రక్షించే ధైర్యం, సత్యానికి కట్టుబడటం, దేశాభివృద్ధి పట్ల అంకితభావం రంగా నిజమైన వారసత్వమని పేర్కొన్నారు. రైతు, గ్రామం, దేశం అనే మూడు విలువలకు ప్రాణం పెట్టిన రంగా సేవలను స్మరించుకుంటూ, ఆయనకు శతకోటి నమస్కారాలు చెప్పుకుంటున్నామని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు.

### వందేమాతరం.. భారతీయులకు గర్వకారణం

వందేమాతరం గీతం పుట్టి 150 ఏళ్లైన చారిత్రాత్మక సందర్భం దేశ ప్రజలందరికీ గర్వకారణమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. బంకిమ్ చంద్ర చట్టోపాధ్యాయులు రాసిన వందేమాతరం, స్వాతంత్ర్య సమరయోధులకు ప్రేరణనిచ్చిన ఓ అగ్నిగీతమని, ఈ జాతీయ గీతం దేశ భక్తిని, ఏకత్వాన్ని, త్యాగ స్ఫూర్తిని ప్రతిబింబిస్తుందని తెలిపారు. మనకు స్వాతంత్ర్యం తెచ్చిన వీరుల త్యాగాలను స్మరించుకునేందుకు, ఈ 150 ఏళ్ల సంస్మరణోత్సవం ఎంతో ప్రధానమని మంత్రి అన్నారు. భారత మాతకు వందనం చేసే ఈ గీతం, దేశ నిర్మాణంలో ప్రతి భారతీయుడికి కొత్త స్ఫూర్తి నింపాలని ఆకాంక్షిస్తూ ప్రజలందరికీ ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. వందే మాతరం అనేది కేవలం ఒక నినాదం కాదు.. మన భారతీయుల అస్మిత, అభిమానం, ఔన్నత్యానికి ప్రతీక అని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

## యువత భవిష్యత్తు నాశనమే జగన్ లక్ష్యం

- ఐదేళ్ల వైసీపీ పాలనలో గంజాయి అడ్డాగా రాష్ట్రం
- కమ్మ కార్పొరేషన్ చైర్మన్ నాదెండ్ల బ్రహ్మం చౌదరి



అమరావతి (చైతన్యరథం): జగన్ ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని గంజాయి స్థావరంగా మార్చేశారని కమ్మ కార్పొరేషన్ ఛైర్మన్ నాదెండ్ల బ్రహ్మం చౌదరి ధ్వజమెత్తారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో ప్రపంచ వ్యాప్తంగా ఎక్కడ గంజాయి, డ్రగ్స్ దొరికినా వాటి మూలాలు ఏపీలోనే బయటపడ్డాయన్నారు. ఐదేళ్లపాటు వైసీపీ నాయకులు అధికారాన్ని అడ్డం పెట్టుకొని డ్రగ్స్, గంజాయి వ్యాపారం చేశారని విమర్శించారు.

### డ్రగ్స్‌ను ప్రోత్సహిస్తున్న జగన్

2019 నుండి 2024 వరకు ప్రపంచవ్యాప్తంగా దొరికిన గంజాయి, డ్రగ్స్, మత్తు పదార్థాల వెనుక వైఎస్ఆర్‌సీపీ నాయకులు ఉన్నట్టు బయటపడింది. ఇది వ్యవస్థీకృత నేరం. ఇప్పుడు కూడా ఆ పార్టీ నేతలు అదే దందాలో ఉన్నారు. వైఎస్ఆర్‌సీపీ విద్యార్థి నాయకుడు పులగం కొండారెడ్డి ఇంజినీరింగ్, కాలేజీ విద్యార్థులకు లిక్విడ్ డ్రగ్స్ సరఫరా చేస్తూ చేస్తూ పట్టుబడి రోజులు గడిచినా పార్టీ నుండి సస్పెండ్ చేయలేదు. అంటే జగన్ డ్రగ్స్‌ను ప్రోత్సహిస్తున్నాడని యువత భావిస్తోంది. తాజాగా తాడేపల్లి ప్యాలెస్‌లో జగన్ పెట్టింది స్టూడెంట్స్ వింగ్ మీటింగ్ కాదు.. డ్రగ్స్ వింగ్ సమావేశం. హాజరైన వారంతా గంజాయి, డ్రగ్స్ కేసుల్లో ఉన్న రౌడీ షీటర్లు, సప్లయర్లు, డీలర్లే. స్టూడెంట్ వింగ్ అని డప్పు కొట్టుకోవడం యువతను మోసం చేయడమే. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మంత్రి లోకేష్ దేశవిదేశాలు తిరిగి పరిశ్రమలు, పెట్టుబడులు తెస్తున్నారు. ఉద్యోగాలు, ఉపాధి కల్పిస్తున్నారు. జగన్ మాత్రం 5 ఏళ్లలో ఒక్క ఉద్యోగం, ఒక్క పరిశ్రమ తీసుకురాలేదు. ఒక్క డీఎస్సీ నిర్వహించలేదు. ఆయన హయాంలో గ్రామాల నుండి రాజధాని వరకు డ్రగ్స్, నకిలీ మద్యం విస్తరించాయి. వేలాది మంది చనిపోయారు. జగన్‌ను సూటిగా అడుగుతున్నా.. దేశంలో గంజాయి అమ్మకాల్లో ఆంధ్రప్రదేశ్‌ను మొదటి స్థానానికి తీసుకొచ్చినది నీ పాలన కాదా? వైఎస్ఆర్‌సీపీ పాలనలో 4100 విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. అది నీ బాధ్యత కాదా? గ్రాడ్యుయేట్ నిరుద్యోగితలో 24 శాతంతో దేశంలోనే మొదటి స్థానంలే ఏపీ నిలవటం నీ వైఫల్యం కాదా? కూటమి ప్రభుత్వం వచ్చాక భోగాపురం ఎయిర్‌పోర్ట్ పనులు వేగంగా జరిగి 95% పూర్తయింది. అది నీ ప్రభుత్వంలో మొదలైందా? 2019 ముందు టీడీపీ ప్రభుత్వం పనులు ప్రారంభిస్తే జగన్ పనులు ఆపేసిన విషయం అందరికీ తెలుసు. డ్రగ్స్ మాఫియా పార్టీగా వైఎస్ఆర్‌సీపీని జగన్ మార్చాడు. యువతను, విద్యార్థులను మోసం చేశాడు. ఇక రాష్ట్రానికి జగన్ లాంటి విపత్తు అవసరం లేదు. చంద్రబాబు, లోకేష్, పవన్ కళ్యాణ్ పరిశ్రమలు తెస్తున్నారు. విద్యార్థులంతా మంచి చదువుతో, స్కిల్ డెవలప్‌మెంట్‌తో ఉద్యోగాలు సాధించండి. వైఎస్ఆర్‌సీపీ ముఠాల గంజాయి, డ్రగ్స్ వ్యాపారాలకు దూరంగా ఉండండి. వాటిని అణిచివేసే పని ఈగల్ సంస్థ చూసేకుంటుంది. ఆంధ్రప్రదేశ్ యువత నేడు జగన్‌ను ఒక జోకర్‌గా చూస్తోంది. అది జగన్ తెలుసుకుంటే చాలని నాదెండ్ల బ్రహ్మం ఎద్దేవా చేశారు.

## ఐదేళ్ల పాలన మొత్తం దోపిడీ, విధ్వంసమే..

# మీ క్రెడిట్ మాకొద్దు జగన్

- మంత్రి పార్థసారథి స్ట్రాంగ్ కౌంటర్
- క్రెడిట్ చోరీ చేయడానికి ఐదేళ్లలో జగన్ చేసిన మంచి ఏముంది
- దేశ,దేశాలు తిరిగి దిగ్గజ సంస్థలను రప్పిస్తున్న సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్
- వారి కృషితో పెట్టుబడుల గమ్యస్థానంగా ఏపీ
- మానసిక స్థితి దెబ్బతిని జగన్ పిచ్చిమాటలు



అమరావతి (చైతన్యరథం): ఐదేళ్ల పాలనలో క్రెడిట్ చోరీ, దోపిడీ, విధ్వంసం తప్ప జగన్ సాధించేమీ లేదని రాష్ట్ర గృహనిర్మాణ శాఖమంత్రి కొలుసు పార్థసారథి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మొంథా తుఫాను సమయంలో చంద్రబాబు నాయుడు ప్రభుత్వం సత్వర స్పందన చూపిందని, నష్ట అంచనా నుంచి కేంద్ర కమిటీని రప్పించడం వరకు పార్టీ-అధికార యంత్రాంగాలను సమన్వయం చేసి క్షేత్రస్థాయిలో యంత్రాంగాన్ని నడిపించిన తీరును అందరూ ప్రశంసిస్తున్నారని చెప్పారు. కేంద్ర మాజీ కార్యదర్శి సుభాష్ చంద్ర ఘర్గ్ కూడా చంద్రబాబును "విజన్‌కు మారుపేరు" అంటూ అభినందించారని, రాష్ట్ర ప్రయోజనాల్లో రాజీపడని నాయకుడని కొనియాడారు. వైఎస్సార్‌సీపీ విధ్వంసాన్ని విజన్‌గా చూస్తే, కూటమి ప్రభుత్వం అభివృద్ధి, ఉద్యోగాలు, పెట్టుబడులతో ముందుకు సాగుతోందని పేర్కొన్నారు.

**మానసిక స్థితి దెబ్బతిని..**

దేశవ్యాప్తంగా ఏపీ అభివృద్ధి, పెట్టుబడుల గురించి చర్చిస్తుంటే పులివెందుల ఎమ్మెల్యే జగన్ మానసిక స్థితి దెబ్బతిని అబద్ధాలు చెబుతున్నారని ధ్వజమెత్తారు. వైఎస్సార్‌సీపీ పాలనలో అభివృద్ధి జరిగిందని, ఆ క్రెడిట్‌ను చంద్రబాబు దోచుకుంటున్నారని చెప్పడం హాస్యాస్పదమని మంత్రి తిప్పికొట్టారు. 151 సీట్ల నుంచి 11కి పడిపోవడానికి మోసాలు, విధ్వంసమే కారణమని గుర్తించే ప్రజలు శిక్షించారని గుర్తుచేశారు. నాడు-నేడు పథకంలో 38 వేల స్కూళ్లను రూ.16-17 వేల కోట్లతో అభివృద్ధి చేశానంటూ జగన్ చెబుతున్నారని, కానీ టీచర్లు, వసతులు లేకుండా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పేరుతో కేవలం రూ.6 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేశారన్నారు. అమ్మఒడి ద్వారా ప్రతి పిల్లవాడిని చదివిస్తానని చెప్పి, అధికారంలోకి వచ్చాక ఇంటికి ఒకరికే ఇస్తానని మోసం చేశారని ఆరోపించారు. సూపర్ సిక్స్ మేనిఫెస్టోలో చెప్పినట్లు ప్రతి పిల్లవాడికి చదువు బాధ్యత తీసుకున్న చంద్రబాబు, ఇంట్లో ఎంతమంది పిల్లలున్నా అందరికీ తల్లికి వందనం ఇస్తున్నారని, ఇప్పటివరకు 67 లక్షల మంది విద్యార్థులకు 10,090 కోట్లు ఖర్చు చేశారని మంత్రి వివరించారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో చిక్కి-కోడిగుడ్లలో రూ.200 కోట్ల అవినీతి జరిగినందుకు జగన్ సిగ్గుపడాలి. గోబెల్స్ కూడా చిన్నబోయేలా జగన్ అబద్ధాలు చెబుతున్నారని మంత్రి విమర్శించారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా ఏమీ చేయలేదన్నారు. రైతులకు పనిముట్లు, ట్రాక్టర్ లోన్లు, డ్రిప్ ఇరిగేషన్ ఎగగొట్టారని, కౌలు రైతులను మోసం చేశారని ఆరోపించారు. జగన్ హయాంలో కేవలం 1.43 లక్షల మందికే కౌలు రైతు కార్డులు ఇస్తే, కూటమి ప్రభుత్వం 9.5 లక్షల మందికి సీసీఆర్సీ కార్డులు ఇచ్చిందని చెప్పారు. రైతులకు రూ.14 వేలు ఇస్తానని చెప్పిన జగన్ రూ.7,500 మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకంలో రైతులకు రూ.20 వేలు రెండు విడతలుగా ఇస్తోందని పేర్కొన్నారు. జగన్ రూ.1,674 కోట్ల ధాన్యం బకాయిలు పెట్టి వెళితే కూటమి ప్రభుత్వం చెల్లించిందని చెప్పారు.

ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ పేరు మార్చి విద్యార్థులను గందరగోళానికి గురిచేశారని, అదే క్రెడిట్ చోరీ అయితే జగన్‌కు సరిపోతుందని ఎద్దేవా చేశారు. మొంథా తుఫాను నష్టపరిహారం అందని వారు చెబితే వెంటనే స్పందిస్తామని చెప్పారు. జగన్ హయాంలో 40 లక్షల ఉద్యోగాలు కల్పించామంటూ బూటకపు మాటలు చెబుతున్నారని, ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లకు రూ.5 వేలు వచ్చే వాలంటీర్ ఉద్యోగాలిచ్చి సంబరపడ్డారని విమర్శించారు.

**విత్తనాల కథలు ఆపండి**

జగన్ సొంత జిల్లాలో స్టీల్ ప్లాంట్‌కు శంకుస్థాపన చేస్తే 2 శాతం ప్రోగ్రెస్ కూడా లేదని, భూమి కూడా కేటాయించ లేదన్నారు. మాజీ ఐటీ మంత్రి కోడిగుడ్డు కథలు చెబితే జగన్ విత్తనాల కథలు చెబుతున్నారని ఎద్దేవా చేశారు. విత్తనం వేసిన తర్వాత బాధ్యత కూడా ఉండాలన్నారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ విదేశాల్లో పర్యటించి ప్రాజెక్టులు తెస్తున్నారని, ప్యాలెస్‌లో దాక్కుని అబద్ధాలు చెప్పడం లేదని ఎద్దేవా చేశారు. గూగుల్‌ని తామే తెచ్చామంటూ చెబుతున్నారని, చర్చకు రావాలని మంత్రి ఛాలెంజ్ చేశారు. మంత్రి లోకేష్ సింగపూర్, అమెరికా వెళ్లి గూగుల్, ఆస్ట్రేలియా మెటల్, టాటా, కాగ్నిజెంట్‌లను ఒప్పించి రాష్ట్రానికి తెస్తున్నారని మంత్రి చెప్పారు. మీ క్రెడిట్ మాకు వద్దని, మీరే జాగ్రత్తగా ఉంచుకోండని వ్యంగ్యబాణాలు సంధించారు.

**దశ, దిశ లేని జగన్**

కూటమి ప్రభుత్వంలో ఈవీ పాలసీ తీసుకొచ్చామని, ప్రీమియర్ ఎనర్జీస్‌తో 1,700 కోట్ల బ్యాటరీ ప్లాంట్, సోలార్ స్టోరేజ్ తెస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో రెన్యూవబుల్ ఎనర్జీకి విస్తృత అవకాశాలు ఉన్నా జగన్ ఆ దిశగా ఆలోచన చేయలేదని ప్రశ్నించారు. నాయుడుపేటలో 4 జీడబ్ల్యూ ఇండస్ట్రీ, క్లీన్ ఎనర్జీ పాలసీ కింద ప్రాజెక్టులు వస్తున్నాయని చెప్పారు. 20 లక్షల ఉద్యోగాల లక్ష్యంలో ఇప్పటికే 7.68 లక్షల కోట్ల పెట్టుబడులు గ్రౌండ్ అయ్యాయని, 2027-28 నాటికి 7.20 లక్షల ఉద్యోగాలు నేరుగా వస్తాయని చెప్పారు. టీచర్లు, హెల్త్, పోలీస్ డిపార్ట్‌మెంట్లలో ఖాళీలు భర్తీలు చేస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రాల మధ్య పోటీలో లోకేష్ స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ చూపించారని, టాటా, రిలయన్స్ సంస్థల ద్వారా రూ. 65 వేల కోట్ల పెట్టుబడులు తెచ్చారని చెప్పారు. ఏపీ ఇప్పుడు పెట్టుబడిదారుల డెస్టినేషన్ అయిందని, సాక్షి పేపర్‌లో పేజీలకు పేజీలు కట్టుకథలు రాస్తున్నారని, జగన్ హయాంలో స్టీల్ ప్లాంట్‌ను గాలికి వదిలేశారని విమర్శించారు. గండికోట టూరిజం స్పాట్‌లో టాయిలెట్లు కూడా కట్టలేదని, కూటమి ప్రభుత్వం రూ. 85 వేల కోట్లతో ఒబెరాయ్ 5-స్టార్ హొటల్, రూ. 80 కోట్ల టూరిజం ప్రాజెక్ట్ తెస్తోందని చెప్పారు.

అబద్ధాలు మానండి, విషం చిమ్మే దుర్వ్యసనం మానండి అని జగన్‌కు మంత్రి పార్థసారథి హితవు పలికారు. మంత్రి లోకేష్ అమెరికా వెళ్ళినా, ఆస్ట్రేలియా వెళ్ళినా, సీఎం చంద్రబాబు దుబాయ్ వెళ్ళినా అక్కడ పెద్ద పెద్ద ఇండస్ట్రీస్‌తో అనేక దఫాలు చర్చించి, వారికి ప్రభుత్వం నుంచి అన్ని రకాల సహకారం అందిస్తామని చెప్పి, వారి పెట్టుబడులకు సానుకూలమైన పరిస్థితులను సృష్టించి, పెట్టుబడులను తీసుకువస్తున్నారన్నారు. ఇది జగన్ క్రెడిట్ ఎంత మాత్రం కాదు. అదానీ డేటా సెంటర్‌ను మీరే తెచ్చామంటున్నారు కదా.. మరి 5 సంవత్సరాలలో అదానీ డేటా సెంటర్ ను ఎందుకు ఏర్పాటు చేయలేదని జగన్‌ను మంత్రి పార్థసారథి సూటిగా ప్రశ్నించారు.

## ప్రజా వేదిక షెడ్యూల్



అమరావతి (చైతన్యరథం): తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశానుసారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో "ప్రజా వేదిక" కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ప్రజల వద్ద నుండి ప్రజాప్రతినిధులు వినతులు స్వీకరిస్తున్నారు. ప్రతి శుక్రవారం ఎమ్మెల్యేలు వారి నియోజకవర్గాల్లో గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహిస్తారు. కావున ఆరోజు కేంద్ర కార్యాలయంలో ఎటువంటి గ్రీవెన్స్ కార్యక్రమం ఉండదు. తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, రాష్ట్ర ప్రజలు ఈ విషయం గమనించాలని మాజీ ఎమ్మెల్సీ, కేంద్ర కార్యాలయ కార్యదర్శి, పర్చూరి అశోక్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 8వ తేదీ నుండి 15 వ తేదీ వరకు ప్రజావేదికలో పాల్గొనే నేతల వివరాలను ఆయన వెల్లడించారు.

**ప్రజా వేదికలో పాల్గొనే నాయకుల షెడ్యూల్:**

08/11/2025 (శనివారం) : మంత్రి కొల్లు రవీంద్ర, ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజినేయులు

10/11/2025 (సోమవారం) : మండలి చీఫ్ విప్, ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, ఘాఖీణజూ చైర్మన్ సుజయ కృష్ణా రంగారావు

11/11/2025 (మంగళవారం) : మంత్రి ఎన్ఎండి ఫరూక్, వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్

12/11/2025 (బుధవారం) : మంత్రి నిమ్మల రామానాయుడు, APIWAB చైర్మన్ డా.శివ ప్రసాద్

13/11/2025 (గురువారం) : మంత్రి కొలుసు పార్థసారథి, APHB చైర్మన్ బత్తుల తాతయ్య బాబు

15/11/2025 (శనివారం) :ఎమ్మెల్సీ బిటి నాయుడు,APKVIB చైర్మన్ కెకె చౌదరి

## టీడీపీ కేంద్ర కార్యాలయంలో

# ఘనంగా వందేమాతరం 150 ఏళ్ల సంబరాలు



అమరావతి (చైతన్యరథం): స్వాతంత్ర్య పోరాటానికి బీజం వేసి కులాలు, మతాలు, ప్రాంతాలకు అతీతంగా దేశ ప్రజలను ఒక తాటిపైకి తెచ్చిన గేయం వందేమాతరమని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం తెలుగుదేశం కేంద్ర కార్యాలయంలో వందేమాతరం 150 ఏళ్ల సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు మాట్లాడుతూ.. మన జాతి గొప్పతనం, ఔన్నత్యం నలుదిశలా చాటిచెప్పిన గొప్ప గేయం వందేమాతరం అన్నారు. 150 ఏళ్లు చరిత్ర కలిగిన వందేమాతరం గేయాన్ని 145 కోట్ల మంది ప్రజలు ఇప్పటికీ ఆనందంగా పాడుకోవడం చాలా గొప్ప విషయమని పేర్కొన్నారు.

టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య మాట్లాడుతూ.. భారత దేశ గొప్పతనాన్ని వర్ణిస్తూ బంకించంద్ర చటర్జీ 150 ఏళ్లు సజీవంగా నిలిచేలా వందేమాతరం గేయం రాశారన్నారు. ప్రతీ భారతీయుడు గర్వించేలా వందేమాతరం గేయం రూపొందించారన్నారు. ఈ సందర్భంగా వందేమాతరం గేయంలో ఉన్న ప్రతీ పదానికి గల అర్థాన్ని వివరించారు.

మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ కేంద్ర కార్యాలయ కార్యదర్శి పర్చూరి అశోక్ బాబు మాట్లాడుతూ.. స్వాతంత్ర్య పోరాటంలో ప్రతీ ఒక్కరి నోట వినిపించిన పదం వందేమాతరమన్నారు. కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు వందేమాతరం ఉద్యమంలా సాగిందన్నారు. 1905 బెంగాల్ విభజన సమయంలో జరిగిన వాస్తవ ఘటనలను వివరించారు. నీలి మందు పంటకు వ్యతిరేకంగా రైతులు పోరాటం చేసినప్పుడు మహిళలను బ్రిటీష్ సైన్యం క్రూరంగా హింసిస్తే వారి నోట వందేమాతరం పదం వచ్చిందన్నారు. అంతే గాని పంట పండిస్తామనలేదన్నారు. నేటి తరం యువత వందేమాతరం గేయ ప్రాముఖ్యతను తెలుసుకోవాలన్నారు.

టీడీపీ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి, నాలెడ్జ్ సెంటర్ ఛైర్మన్ గురజాల మాల్యాద్రి మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో కుల, మత, ప్రాంతాలకు అతీతంగా భారతీయుల ఐక్యతకు వందేమాతరం గేయం పునాదిగా నిలిచిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం మారకుండా ఉంటే ఆంధ్రప్రదేశ్ సుభిక్షంగా ఉంటుందన్నారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, పోలవరం బనకచర్ల ప్రాజెక్టుతో రాష్ట్రం సస్యశ్యాములం అవుతుందన్నారు. ఈ సందర్భంగా అల్లూరి సీతారమారాజు, పింగళి వెంకయ్య, అయ్య దేవర కాళేశ్వరరావు, కళా వెంకట్రావు లాంటి స్వాతంత్ర్య ఉద్యోమ నాయుకుల గొప్పతనం గుర్తు చేశారు. కార్యక్రమంలో శ్రీశైలం బోర్డు సభ్యులు ఏవీ రమణ, కమ్మ కార్పొరేషన్ ఛైర్మన్ బ్రహ్మం చౌదరి, హజ్ యాత్ర కమిటీ ఛైర్మన్ హసన్ భాష, రాష్ట్ర మీడియా కో ఆర్డినేటర్ దారపనేని నరేంద్ర బాబు, కార్యకర్తలు, కార్యాలయ సిబ్బంది పాల్గొని వందేమాతరం గేయం ఆలపించారు.

# ప్రజల చేతిలో పల్లె రహదారుల సమాచారం

- త్వరలో అందుబాటులోకి 'జియో రూరల్ రోడ్ మేనేజ్మెంట్ సిస్టం'
- పైలెట్ ప్రాజెక్టుగా అడవి తల్లి బాటకు అనుసంధానం
- సాస్కీ నిధులతో పల్లె పండగ 2.0
- క్షేత్ర స్థాయి పర్యటనలతో జల్ జీవన్ మిషన్, స్వమిత్వ పనుల పరిశీలన
- స్వచ్ఛ జలం.. గుంతలు లేని రోడ్ల నిర్మాణానికి ప్రథమ ప్రాధాన్యం
- అధికారులతో సమీక్షలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్



అమరావతి (చైతన్యరథం): పల్లె ప్రజలకు నాణ్యతతో కూడిన స్వచ్ఛమైన తాగునీటి సరఫరా, గుంతలు లేని రహదారులు అందుబాటులో ఉంచాలన్నదే తన ప్రధాన లక్ష్యమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. తన ప్రతి అడుగూ ఆ దిశగానే ఉంటుందని తెలిపారు. జల్ జీవన్ మిషన్, పల్లె పండగ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పక్కాగా పాటించాలని అధికారులను ఆదేశించారు. పల్లె రోడ్ల సమాచారం ప్రజలందరికీ అందుబాటులో ఉండేలా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో త్వరలో సరికొత్త సాంకేతికతను ఆవిష్కరించబోతున్నట్టు తెలిపారు. 'జియో రూరల్ రోడ్ మేనేజ్మెంట్ సిస్టం' ద్వారా గ్రామీణ రోడ్ల పూర్తి సమాచారాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకునే సాంకేతికతను అందుబాటులోకి తీసుకురానున్నట్టు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సాస్కీ నిధుల సాయంతో పల్లె పండగ 2.0ని ప్రారంభించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో పల్లె పండగ 2.0, అడవి తల్లి బాట పనుల పురోగతి, జల్ జీవన్ మిషన్, స్వమిత్ర పథకాలపై పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ, గ్రామీణ నీటి పారుదల శాఖ, ఇంజినీరింగ్ విభాగం అధికారులతో శుక్రవారం ఆయన సమీక్ష నిర్వహించారు. నిధులు అందుబాటులో ఉన్నా పనుల్లో ఆశించిన స్థాయిలో పురోగతి లేకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. అడవి తల్లిబాట, జల్ జీవన్ మిషన్ పనులు వేగవంతంగా పూర్తి చేసేలా తక్షణం ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. ప్రతి పనిని నిర్ణీత కాల వ్యవధిలో పూర్తి చేసేలా ఈ ప్రణాళికలు ఉండాలన్నారు. ఈ మేరకు యంత్రాంగానికి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా సాస్కి నిధులకు అనుమతుల స్టేటస్ గురించి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రిచంద్రబాబు నాయుడు సూత్రప్రాయంగా ఆమోదించారని, ఆర్థిక శాఖ నుంచి సమ్మతి రావాల్సి ఉందన్నారు. ఈ అంశంపై తక్షణం ఆర్థిక శాఖతో చర్చించాలని అధికారులను ఆదేశించారు.

### ప్రజలకు అందుబాటులో వివరాలు

ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గ్రామీణ రహదారులన్నింటినీ జియో రూరల్ రోడ్ మేనేజ్మెంట్ సిస్టంకు అనుసంధానించే ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. మనం ప్రయాణం చేసే మార్గంలో రోడ్డు ఉందా.. లేదా? ఉంటే ఎలా ఉంది? అనే వివరాలు ప్రజల చేతిలో అందుబాటులో ఉండే వ్యవస్థను తీసుకురావాలి. అసలు రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో ఎన్ని రహదారులు ఉన్నాయి.. అవి ఎలా ఉన్నాయి? అనే వివరాలు కూడా ప్రతి ఒక్కరికీ తెలియాలి. కొత్త రహదారి నిర్మిస్తే అందుకు సంబంధించిన వివరాలు ఎప్పటికప్పుడు ప్రజలకు అందుబాటలోకి రావాలి.

క్షేత్ర స్థాయిలో వాస్తవ పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకొని, రహదారులను మెరుగుపరచుకునేలా ఈ సాంకేతికత ఉండాలి. ఈ విధంగా జియో రూరల్ రోడ్ మేనేజ్మెంట్ సిస్టంను త్వరితగతిన అభివృద్ధి చేయండి. అధునాతన సాంకేతికత సాయంతో ఆ విధమైన వ్యవస్థకు రూపకల్పన చేయండి. 48 గంటల్లో అందుకు సంబంధించి ఒక స్పష్టమైన యాక్షన్ ప్లాన్ సిద్ధం కావాలి. ఒక వర్కింగ్ గ్రూప్ రూపొందించి ఎప్పటికప్పుడు సమాచారాన్ని అందులో పొందుపరచాలి. ఈ అంశంలో అర్టీజీఎస్, ఇంజినీరింగ్ విభాగం అధికారులు సమన్వయంతో ముందుకు వెళ్లాలి. అడవి తల్లి బాటను పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంచుకుని ఈ సిస్టంకు అను సంధానించండి. తద్వారా ఎప్పటికప్పుడు గిరిజన గ్రామాల్లో పనుల పురోగతిని పరిశీలించే అవకాశం కలుగుతుంది. ఏ పని చేసినా ప్రజలకు జవాబు దారీతనంగా ఉండాలి అన్నదే తమ ఉద్దేశమని పవన్ స్పష్టం చేశారు.

### అడవి తల్లిబాట పట్ల అలసత్వం వద్దు

గిరిజన గ్రామాల్లో చేపట్టిన అడవి తల్లిబాట పనుల్లో ఆశించిన స్థాయిలో పురోగతి కనబడడం లేదు. ఏజెన్సీ ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణానికి సవాళ్లు ఎదుర్కోవాల్సి ఉంటుంది. పక్కా ప్రణాళికతో అన్నింటినీ అధిగమించాలి. కేంద్ర ప్రభుత్వం నుంచి పీఎం జన్మన్ పథకం కింద వచ్చే నిధులతోపాటు, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు, రాష్ట్ర ప్రభుత్వం సాయం మొత్తం కలిపి రూ.1,158 కోట్లు అందుబాటులో ఉన్నాయి. మొత్తం 761 గిరిజన గ్రామాలను అనుసంధానిస్తూ 662 రహదారులు నిర్మించాలన్న సంకల్పంతో పనులు ప్రారంభించాం. అడవి తల్లిబాట పనులను వేగవంతం చేయండి. ఎక్కడైనా అటవీ శాఖతోగాని, ఇంకా ఏదైనా సమస్యలు ఉంటే వాటిని తక్షణం పరిష్కరించుకునేలా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకోండి. అధికారులు ఎప్పటికప్పుడు క్షేత్ర స్థాయికి వెళ్లి పనుల పురోగతిని పరిశీలించాలి. ముఖ్యంగా అల్లూరి సీతారామరాజు జిల్లా, మన్యం జిల్లాల కలెక్టర్లు ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తూ ఏదైనా సమస్య ఉంటే దాన్ని తక్షణం పరిష్కరించి పనులు ముందుకు తీసుకువెళ్లేలా చర్యలు తీసుకోవాలని పవన్ ఆదేశించారు.

### పల్లె పండగ 2.0ని పట్టాలెక్కిద్దాం

పల్లె పండగ 2.0 కోసం సాస్కీ నిధులు వినియోగించుకోవడంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు.. ఆర్థిక శాఖతో సమన్వయం చేసుకుంటూ త్వరితగతిన నిధులు విడుదలయ్యేలా కృషి చేయాలి. తక్షణం పల్లె పండగ 2.0ని పట్టాలెక్కించేందుకు ఏర్పాట్లు చేయాలి. రూ.2,123 కోట్ల సాస్కీ నిధులతో పల్లెల్లో 4007 కిలోమీటర్ల మేర రహదారులు, గోకులాలు, మ్యాజిక్ డ్రైన్ల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయి. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి, కమిషనర్లు ఈ ప్రక్రియను పర్యవేక్షించాలని పవన్ సూచించారు.

### జల్ జీవన్ మిషన్ ప్రాజెక్టుల పురోగతిపై దృష్టి

పల్లెల్లో ప్రతి ఇంటికీ తాగునీరు అందించాలన్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్రంలో జల్ జీవన్ మినష్ పనులు ముందుకు తీసుకువెళ్తున్నాం. ప్రస్తుతం చిత్తూరు, ప్రకాశం, పల్నాడు, ఉభయ గోదావరి జిల్లాల్లో నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టుల్లో నాణ్యతా ప్రమాణాలు పక్కాగా అమలు చేయాలి. నీటి నాణ్యత పక్కాగా ఉండాలి. అదే అందరి ప్రథమ బాధ్యత కావాలి. నవంబర్ మూడో వారం నుంచి జల్ జీవన్ మిషన్ ప్రాజెక్టుల పురోగతిపై దృష్టి సారించాలని నిర్ణయించాం. 17వ తేదీ తర్వాత క్షేత్ర స్థాయిలో పర్యటించి జల్ జీవన్ మిషన్ పనుల్లో పురోగతి, ఇప్పటికే ప్రజలకు అందుబాటులో ఉన్న నీటి సరఫరా వ్యవస్థల వద్ద నీటి నాణ్యతను స్వయంగా పరిశీలిస్తాను. గ్రామీణ ప్రజలకు అందించే మౌలిక వసతుల్లో రోడ్లు, తాగు నీటికే అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించినట్లు పవన్ తెలిపారు.

### కోటి మందికి స్వమిత్వ యాజమాన్య హక్కు పత్రాలు

గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల ఆస్తులకు యాజమాన్య హక్కులు కల్పించే స్వమిత్వ పథకం ద్వారా వచ్చే మార్చి నాటికి రాష్ట్రవ్యాప్తంగా కోటి మందికి ప్రాపర్టీ కార్డులు అందజేసే విధంగా ముందుకు వెళ్లాలి. స్వమిత్వ మొదటి విడత కార్యక్రమంలో భాగంగా ఇప్పటికే 613 గ్రామాల్లో సర్వే పూర్తి చేసి 5.18 లక్షల మందికి యాజమాన్య పత్రాలు అందించేందుకు సిద్ధం చేసినట్టు అధికారులు తెలిపారు. రెండో విడత మరో 5,847 గ్రామాల్లో సర్వే ప్రక్రియ పూర్తి చేసి ఈ నెలాఖరుకి మరో 45.66 లక్షల మందికి వారి యాజమాన్య హక్కు పత్రాలు సిద్ధం చేస్తాం. డిసెంబర్ నుంచి మూడో విడత ప్రారంభించి మిగిలిన గ్రామాల్లో సర్వే పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు నిర్దేశించాం. అందుకోసం సర్వే విభాగం గ్రామ సర్వేయర్ల సేవలను పంచాయతీరాజ్ శాఖకు కేటాయించే ఏర్పాటు చేయాలి. పంచాయతీరాజ్ శాఖ, సర్వే శాఖతో సమన్వయం చేసుకుంటూ ఈ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలి. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి, కమిషనర్లు స్వమిత్వ సర్వేను నిరంతరం పర్యవేక్షించాలి. క్షేత్ర స్థాయి పర్యటనల్లో భాగంగా స్వమిత్వ పథకం కింద నిర్వహిస్తున్న సర్వేలో ప్రత్యక్షంగా పాల్గొని ప్రజల అభిప్రాయం సేకరిస్తాం. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన రీ సర్వే, గత ముఖ్యమంత్రి ఫోటోతో కూడిన పాసు పుస్తకాల కారణంగా ప్రజలు తీవ్ర భయభ్రాంతులకు గురయ్యారు. మన ప్రభుత్వంలో అలాంటి తప్పులకు తావుండదు. రీ సర్వే తర్వాత ఎవరి భూములు వారికి అప్పగిస్తూ ప్రాపర్టీ కార్డులు ఇస్తాం. రాజ ముద్రతో కూడిన కార్డులు అందిస్తాం. ఈ ప్రాపర్టీ కార్డులు వచ్చిన తర్వాత ఆయా స్థలాలు అమ్ముకునేందుకు, ఇతర ఆర్థిక ప్రయోజనాల కోసం వినియోగించుకునేందుకు అవకాశం లభిస్తుందని పవన్ తెలిపారు.

ఈ సమీక్షా సమావేశంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి శశిభూషణ్ కుమార్, కమిషనర్ కృష్ణ తేజ, సర్వే విభాగం కార్యదర్శి కూర్మనాథ్, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన చీఫ్ ఇంజినీర్ బాలూ నాయక్, గాయత్రి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## విద్యకు సీఎం చంద్రబాబు అత్యధిక ప్రాధాన్యత

**- మంత్రి కొల్లు రవీంద్ర**




విజయవాడ (చైతన్యరథం): విద్యారంగానికి సీఎం చంద్రబాబు నాయుడు, కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. విజయవాడలో శుక్రవారం ALLEN సంస్థ నూతన బ్రాంచి ప్రారంభోత్సవంలో పాల్గొన్న మంత్రి రవీంద్ర మాట్లాడుతూ విద్యతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని కూటమి ప్రభుత్వం బలంగా నమ్ముతోందన్నారు. రాష్ట్రాన్ని నాలెడ్జి హబ్‌గా మార్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రయత్నిస్తున్నారు. ముఖ్యమంత్రి విజన్‌కు ూూజుచీ లాంటి సంస్థల తోడ్పాటు అత్యంత అవసరం. గతంలో విజన్ 2020తో ఉమ్మడి రాష్ట్రంలో ఐటీని అభివృద్ధి చేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుంది. విజన్ 2020, ఐటీ గురించి నాడు చంద్రబాబు మాట్లాడితే ఎంతో మంది అవహేళన చేశారు. కానీ, వెనక్కి తగ్గకుండా వెళ్లడం కారణంగానే నేడు ప్రపంచ వ్యాప్తంగా తెలుగు వారికి ప్రత్యేక గర్తింపు లభించింది. విద్యా సంస్థలకు పెద్దపీట వేసిన కారణంగానే.. గతంలో ఐఎస్బీ, అమృత్ లాంటి సంస్థలు ఏపీలో ఏర్పాటయ్యాయి. బెంగళూరులో ఏర్పాటుకు సిద్ధమైన ఐఎస్‌బీని ఏపీకి తీసుకురావడం ఒక చరిత్ర. ఇప్పుడు కూడా గూగుల్ లాంటి ప్రఖ్యాత కంపెనీలు ఏపీకి రావడం వెనుక చంద్రబాబు కృషి ఉంది. నాడు మైక్రోసాఫ్ట్ రాకతో ఉమ్మడి రాష్ట్రంలో ఐటీ విప్లవం మొదలైంది. ఇప్పుడు క్యాంటం కంప్యూటింగ్, గూగుల్ రాకతో ఏపీ ఏఐకి కేంద్రంగా మారబోతోంది. ప్రఖ్యాత విద్యా సంస్థల్ని ఏపీలో ఏర్పాటు చేస్తూనే విద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తున్నాం. స్కూల్ కమిటీల, పేరెంట్ టీచర్ సమావేశాలు ఏర్పాటుతో విద్యా వ్యవస్థలో వినూత్న మార్పులు తీసుకొస్తున్నాం. రాష్ట్రంలో ALLEN లాంటి సంస్థల ఏర్పాటు ద్వారా ప్రభుత్వ లక్ష్యాల సాధన మరింత సులువు అవుతుంది. స్కిల్ డెవలప్మెంట్ ద్వారా రాష్ట్రంలోని యువతకు మరింత మెరుగైన అవకాశాలు కల్పించుకుందామని మంత్రి కొల్లు రవీంద్ర పిలుపునిచ్చారు.

## భారతీయులందరికీ గర్వకారణం 'వందేమాతరం'

**- మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి**



అమరావతి(చైతన్యరథం): వందేమాతరం గీతం భారతీయులందరికీ గర్వకారణం అని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి, ప్రకాశం జిల్లా ఇన్చార్జి మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అన్నారు. ఈ గీతాన్ని మొదటిసారి ఆలపించి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కేంద్ర ప్రభుత్వ పిలుపుమేరకు శుక్రవారం ఉదయం ప్రకాశం జిల్లా కేంద్రం ఒంగోలులో ప్రకాశ భవనం సమీపంలోని చర్చి సెంటరు, అంబేద్కర్ విగ్రహం వద్ద పెద్ద సంఖ్యలో ప్రజలు మానవహారంగా ఏర్పడి ఈ గీతాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయులందరూ ఒకటేననే ఐక్యతను చాటుతూ స్వాతంత్రోద్యమ స్ఫూర్తిని రగిలించిన వందేమాతరం గీతం గొప్పదనాన్ని మరోసారి నేటి తరానికి కూడా తెలియజేసేలా కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఈ గీతాలాపనకు పిలుపునిచ్చిందన్నారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి మాట్లాడుతూ తరాలు మారినా వన్నెతెరగని గీతం వందేమాతరం అని చెప్పారు. దీని విశిష్టతను అందరూ తెలుసుకోవాల్సిన ఆవశ్యకత ఉందని అన్నారు. కలెక్టర్ పి.రాజాబాబు మాట్లాడుతూ బంకించంద్ర చటర్జీ రచించిన ఈ గీతం స్వాతంత్రోద్యమ సమయంలో ప్రజల్లో శక్తిని నింపిందని అన్నారు. ఆత్మగౌరవాన్ని కాపాడుకుంటూ కోట్లాదిమందిని ఏకతాటిపైకి తీసుకొచ్చిందన్నారు. నాటి స్ఫూర్తిని నేటి తరానికి తెలియజేసేలా ఏడాది పాటు ప్రత్యేక ఉత్సవ కార్యక్రమాలను దేశవ్యాప్తంగా నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం పిలుపునిచ్చినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక శాసన సభ్యులు, ఇతర ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

చైతన్యరథం

# సమస్యల్లేని నియోజకవర్గంగా మచిలీపట్నం

**- తీర్చిదిద్దుతామని మంత్రి కొల్లు రవీంద్ర ఉద్ఘాటన**
**- ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నాం**
**- నియోజకవర్గంలోని ప్రతి సమస్యకూ పరిష్కారం చూపిస్తాం**
**- అభివృద్ధికి ప్రజల నుండి కూడా సూచనలు స్వీకరిస్తాం**
**- మచిలీపట్నం పార్టీ కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహించిన మంత్రి**



మచిలీపట్నం (చైతన్యరథం): మచిలీపట్నం నియోజకవర్గంలోని ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడంతో పాటుగా, ప్రతి సమస్యకూ పరిష్కారం చూపించడమే లక్ష్యంగా అడుగులు వేస్తున్నామని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మచిలీపట్నంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శక్రవారం గ్రీవెన్స్ నిర్వహించిన మంత్రి ప్రజల నుండి వినతులు స్వీకరించారు. ప్రధానంగా పెన్షన్లు, ఇళ్ల పట్టాల గురించిన అర్జీలు వస్తున్నాయని, వాటన్నింటినీ పరిష్కరించి ప్రతి ఒక్కరికీ తోడుగా నిలుస్తామని హామీ ఇచ్చారు.

అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ప్రజల సమస్యల పరిష్కారానికి తొలి ప్రాధాన్యం ఇస్తోందన్నారు. మా దృష్టికి వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరిస్తున్నాం. ఒకవైపు సంక్షేమం అభివృద్ధి చేస్తూనే.. సమస్యల పరిష్కారానికీ పెద్దపీట వేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నిత్యం ప్రజల్లోనే ఉంటూ ప్రజలకు అండగా నిలుస్తున్నారు. అందుకు తాజాగా వచ్చిన తుపాను సమయంలో వారి పనితీరు నిదర్శనం అన్నారు. తుపాను తీరం దాటే సమయంలో ఆర్టీజీఎస్ నుండి పరిస్థితిని నిత్యం పర్యవేక్షించి ప్రాణ నష్టం సంభవించకుండా చూసుకున్నారు. అధికారుల్ని అప్రమత్తం చేసి తుపానును సమర్థవంతంగా ఎదుర్కొన్నాం.

తుపాను సమయంలో పార్టీ నాయకులు, అధికారుల పనితీరు అభినందనీయం. తీరం దాటే సమయంలో ఇళ్ల నుండి ఎవరూ బయటకు రాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవడం వలన ప్రాణ నష్టం నిలువరించగలిగాం. 90 కి.మీల పైబడిన వేగంతో వచ్చిన గాలుల ధాటికి విద్యుత్ స్తంభాలు విరిగిపడి సరఫరాకు ఇబ్బందులు ఎదురయ్యాయి. కానీ, అధికారుల సమన్వయంతో 24 గంటల్లోనే విద్యుత్ పునరుద్ధరించాం. కూలిన చెట్లును గంటల వ్యవధిలోనే తొలగించి రవాణాకు ఆటంకాలు లేకుండా చూసుకున్నాం. నియోజకవర్గ అభివృద్ధికి ప్రజలు కూడా సూచనలు ఇవ్వాలని మంత్రి కోరారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి కేంద్రంగా మారుద్దామన్నారు. ఇళ్ల స్థలాలు, పెన్షన్లకు సంబంధించిన దరఖాస్తులే అధికంగా వస్తున్నాయని, వాటన్నింటినీ వీలైనంత వరకు పరిష్కరించి పేదలకు అండగా ఉంటామని మంత్రి కొల్లు రవీంద్ర హామీ ఇచ్చారు.

**కార్యకర్త కుటుంబానికి రూ.5లక్షల చెక్కు**

మచిలీపట్నంకు చెందిన టీడీపీ కార్యకర్త సైకం పూర్ణచంద్రరావు రోడ్డు ప్రమాదంలో మరణించడంతో.. వారి కుటుంబ సభ్యులకు రూ.5 లక్షల చెక్కును మంత్రి కొల్లు రవీంద్ర చేతుల మీదుగా అందించారు. పార్టీ సభ్యత్వం తీసుకోవడంతో ప్రమాద బీమా రూ.5 లక్షల ఆర్థిక సాయం అందిందన్నారు. వారి పిల్లల చదువులకు సైతం పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రభుత్వ పరంగా కూడా అండగా ఉంటామని ధైర్యం చెప్పారు.

సైకం పూర్ణచంద్రరావు భార్య సక్కుబాయి మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదం కుటుంబాన్ని రోడ్డున పడేసింది, కానీ పార్టీ అండగా నిలిచి రూ.5 లక్షలు ఇవ్వడంతో పిల్లల చదువులకు కొండంత ధైర్యం కలిగిందన్నారు. పార్టీ పరంగా ఆర్థిక సాయం అందించడంతోనే కుటుంబం కాస్తైనా నిలదొక్కుకోగలుగుతుందనే ధైర్యం కలిగినట్లు తెలిపారు.

# విపత్తులవేళ ప్రాణరక్షక దళం.. 108 హెల్త్ సర్వీసెస్!

**- వర్షం, గాలి, వరద, ఎక్కడైనా సేవలోనే అంబులెన్స్‌లు**
**- మొంథా తుఫాన్ సమయంలో ప్రజల ప్రాణాలకు భద్రత**

అమరావతి (చైతన్యరథం): ఇటీవల రాష్ట్రంలో తీవ్ర ప్రభావం చూపిన మొంథా తుఫాన్ సమయంలో ప్రజల ప్రాణాలను కాపాడటంలో 108 హెల్త్ సర్వీసెస్ కీలక పాత్ర పోషించింది. తుఫాన్ కారణంగా భారీ వర్షాలు, గాలులు, వరదలతో అనేక ప్రాంతాలు తీవ్ర ప్రభావానికి గురైన వేళ, ప్రజలకు సమయానుకూలంగా అత్యవసర వైద్య సేవలను అందించేందుకు 108 బృందం నిర్విరామంగా పనిచేసింది. తుఫాన్ హెచ్చరికలు అందిన వెంటనే 108 కమాండ్ కంట్రోల్ సెంటర్ అత్యవసర స్థితిని ప్రకటించి, రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు అలర్ట్ జారీ చేసింది. అంబులెన్స్ డ్రైవర్లు, ఎమర్జెన్సీ టెక్నీషియన్లు, డ్యూటీ సూపర్వైజర్లు తమ వాహనాలతో సిద్ధంగా ఉండాలని ఆదేశాలు జారీ అయ్యాయి.

తుఫాన్ ప్రభావిత జిల్లాల్లో అంబులెన్స్‌లను వ్యూహాత్మకంగా నియమించి, ఎక్కడ ప్రమాద సూచనలు ఉన్నా అక్కడ ముందుగానే వాహనాలను నిలిపి ఉంచారు. ఏ క్షణంలోనైనా అత్యవసర పిలుపు వస్తే వెంటనే స్పందించేందుకు సిబ్బంది పూర్తి సిన్నద్ధతతో ఉన్నారు. రాష్ట్ర, స్థాయి అధికారులతో సమన్వయం కొనసాగిస్తూ, 108 కమాండ్ సెంటర్ అన్ని చర్యలను సమర్థంగా పర్యవేక్షించింది. కలెక్టర్లు, డీఎంహెచ్‌ఓలు, పోలీసు శాఖ, ఫైర్ సర్వీసులతో సమన్వయం చేస్తూ ప్రతి అత్యవసర పరిస్థితిలో సమయస్ఫూర్తితో వ్యవహరించి అవసరమైన చర్యలు చేపట్టింది.

విపత్తులవేళ ప్రాణరక్షక దళంగా మారిన 108 హెల్త్ సర్వీసెస్!



తుఫాను ప్రభావం మధ్యలో కూడా 108 సిబ్బంది రాత్రింబగళ్లు నిరంతరంగా సేవలందించారు. భారీ వర్షం, గాలి,నీటిలో చిక్కుకున్న ప్రజలను సురక్షిత ప్రదేశాలకు తరలించి, వైద్యసహాయం అందించారు. కొన్నిచోట్ల సిబ్బంది రోగులను భుజాలపై మోసుకుని అంబులెన్స్ వరకు తీసుకువెళ్లిన సందర్భాలు ఉన్నాయి. గర్భిణులు, వృద్ధులు, ప్రమాద బాధితులు, తీవ్ర అనారోగ్యంతో ఉన్న పౌరులకు సమయానుకూలంగా వైద్యసేవలు అందించారు. మొంథా తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో 108 హెల్త్ సర్వీసెస్ అత్యవసర వైద్యసేవల్లో విశేషంగా పాల్గొంది. మొత్తం 1828 ఫోన్ కాల్స్ అందుకుని, ప్రతి కాల్‌కి వెంటనే స్పందించి అందరికీ వైద్యసేవలు అందించారు. ఈ సేవల కోసం 1800 మంది సిబ్బంది నిరంతరంగా పని చేయగా, 672 అంబులెన్స్ వాహనాలు తుఫాన్ ప్రభావిత జిల్లాల్లో రాత్రింబగళ్లు సేవలందించాయి. అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాపాయంలో ఉన్న వారందరినీ సురక్షితంగా కాపాడడంలో 108 బృందం విజయవంతమైంది. ప్రజల ప్రాణ భద్రతే తమ ధ్యేయంగా సేవలందించింది.

తుఫాన్ తగ్గిన తరువాత కూడా 108 బృందాలు పునరావాస ప్రాంతాల్లో వైద్య మద్దతు, రోగుల తరలింపు, ఫస్ట్ ఎయిడ్ సేవలు వంటి కార్యక్రమాలను కొనసాగించాయి. ప్రజల నుంచి 108 సిబ్బందికి ప్రశంసల వెల్లువ వచ్చింది. తుఫాన్ రాత్రి మా ప్రాణాలు కాపాడింది 108.. అంటూ పలువురు కృతజ్ఞతలు తెలిపారు. ఇది 108 సేవల పట్ల ప్రజల నమ్మకానికి నిదర్శనం. ప్రభుత్వం కూడా 108 బృందం అంకితభావంతో చేసిన సేవలను అభినందించింది. భవిష్యత్తులో విపత్తుల సందర్భాల్లో మరింత సమర్థవంతంగా స్పందించేందుకు డిజాస్టర్ రెస్పాన్స్ మాడ్యూల్‌ను బలోపేతం చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

ఏదేమైనా ప్రజల ప్రాణ భద్రతే తమ ప్రధాన ధ్యేయమని 108 హెల్త్ సర్వీసెస్ మరోసారి నిరూపించాయి. విపత్తు సమయంలో సేవా ధర్మాన్ని నిలబెట్టిన ఈ బృందం రాష్ట్రానికి గర్వకారణం. తుఫాన్‌లు, వరదలు, ప్రమాదాలు ఏవైనా సరే.. 108 అంబులెన్స్‌లు తక్షణం స్పందించే సజీవ రక్షక దళంగా మారాయి. అత్యవసర పిలుపు అందిన వెంటనే ప్రాంతాన్ని గుర్తించి అతి తక్కువ సమయంలో అక్కడికి చేరుకుని రోగుల ప్రాణాలను కాపాడడమే ఈ బృందం లక్ష్యం. ఆధునిక వైద్య పరికరాలతో సిద్ధంగా ఉన్న అంబులెన్స్‌లు, శిక్షణ పొందిన సిబ్బంది, సమన్వయంతో పనిచేసే కమాండ్ కంట్రోల్ వ్యవస్థ కలిసి ప్రజలకు భరోసానిచ్చే ఆరోగ్య భద్రతా కవచంగా నిలుస్తున్నాయి.

# అండర్‌పాస్‌లు, ఫ్లైఓవర్లు ఏవీ?

**- మచిలీపట్నం - విజయవాడ ఆరు వరుసల జాతీయ రహదారి డీపీఆర్‌పై మంత్రి జనార్దన్ రెడ్డి అభ్యంతరం**



విజయవాడ (చైతన్యరథం): మచిలీపట్నం – విజయవాడ జాతీయ రహదారి ఆరు వరుసలుగా విస్తరించే ప్రతిపాదిత డీపీఆర్‌లో అండర్ పాస్‌లు, ఫ్లై ఓవర్ల ప్రస్తావన లేకపోవటంపై రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రతిపాదిత డీపీఆర్‌పై నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్‌ఏఐ) అధికారులతో ఆర్ అండ్ బీ కార్యాలయంలో శుక్రవారం మంత్రి బీసీ జనార్థన్ రెడ్డి సమీక్షించారు. వీడియో ప్రజంటేషన్ ద్వారా ఎన్‌హెచ్‌ఏఐ విజయవాడ ప్రాజెక్టు డైరెక్టర్ ప్రతిపాదిత డీపీఆర్ పై విద్యాసాగర్ మంత్రికి వివరించారు. ఈ సమావేశంలో ప్రజాప్రతినిధులు, కలెక్టర్లు లేవనెత్తిన అభిప్రాయాలపై ఎన్‌హెచ్‌ఏఐ అధికారులను మంత్రి వివరణ కోరారు. ప్రతిపాదిత డీపీఆర్ లో విజయవాడలోని బెంజి సర్కిల్ నుంచి భవిష్యత్తులో రాబోయే ఓఆర్‌ఆర్ వరకు ఎటువంటి అండర్ పాస్‌లు, ఫ్లై ఓవర్ల ప్రస్తావన లేకపోవడంపై అభ్యంతరం తెలిపారు. ఈ క్రమంలో స్థానికంగా ప్రజా ప్రతినిధులు, కలెక్టర్ నుంచి వచ్చిన ప్రతిపాదనలను పరిశీలించాలని ఎన్‌హెచ్‌ఏఐ అధికారులను మంత్రి ఆదేశించారు. విజయవాడ నుంచి పెనమలూరు వరకు భవిష్యత్తులో మెట్రో ఏర్పాటుకు నిర్ణయిస్తే.. దానిని డబుల్ డెక్కర్‌గా ప్రతిపాదించాలని ప్రజాప్రతినిధులు, కలెక్టర్లు సూచించారన్నారు.

# భవిష్యత్తు పర్యాటకానిదే

**- లండన్‌లో ఇండియన్ హై కమిషన్ హైటీ కార్యక్రమంలో మంత్రి కందుల దుర్గేష్**
**- ఏపీకి రావాలని ఇన్వెస్టర్లకు ఆహ్వానం**
**- పర్యాటక, ఆతిథ్య రంగాల్లో పెట్టుబడులు పెట్టాలని వినతి**
**- భరోసా కల్పించే బాధ్యత తీసుకుంటామని హామీ**
**- లండన్ లో ముగిసిన మంత్రి దుర్గేష్ పర్యటన**



అమరావతి (చైతన్యరథం): భవిష్యత్తు అంతా పర్యాటకానిదే అని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. లండన్ లో వరల్డ్ ట్రావెల్ మార్కెట్ –2025 ప్రదర్శన ముగిసిన అనంతరం ఇండియన్ హై కమిషన్ ఏర్పాటు చేసిన హైటీ కార్యక్రమంలో మంత్రి కందుల దుర్గేష్ ప్రసంగించారు. డబ్ల్యూటీఎం ప్రదర్శనలో పాల్గొనడం సంతోషంగా ఉందని, ఇది రాష్ట్ర పర్యాటకానికి విస్తృత ప్రచారం కల్పించేందుకు మంచి వేదికగా ఉపయోగపడిందని తెలిపారు. ఈ సందర్భంగా డబ్ల్యూటీఎం సదస్సుకు వచ్చిన అంతర్జాతీయ పర్యాటక సంస్థల ప్రతినిధులను ఏపీకి రావాలని మంత్రి దుర్గేష్ ఆహ్వానించారు. ఏపీ పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా ఉందని, నూతన పర్యాటక పాలసీని విడుదల చేశామని తెలుపుతూ ఏపీకి రండి... స్థానిక పర్యాటక ప్రదేశాలను సందర్శించండి.. పర్యాటక, ఆతిధ్య రంగాల్లో పెట్టుబడులు పెట్టి ఏపీ పర్యా టక అభివృద్ధికి దోహదపడండి అని ఇన్వెస్టర్లను మంత్రి కోరారు. రాష్ట్రాభివృద్ధిలో పర్యాటక రంగం గేమ్ చేంజర్ అని, ఈ క్రమంలో ఏపీ పర్యాటకాభివృద్ధికి సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, కేంద్ర సహకారం మెండుగా ఉందన్నారు. కమ్యూనిజం, సోషలిజం, క్యాపిటలిజం కంటే టూరిజానికే భవిష్యత్తు ఉందని సీఎం చంద్రబాబు నాయుడు చేసిన వ్యాఖ్యలను ఈ సందర్భంగా గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన 15నెలల కాలంలో తాము రూ.12వేల కోట్ల పర్యాటక పెట్టుబడులు ఆకర్షించామని వెల్లడించారు. ఎకో, అడ్వెంచర్, బీచ్ టూరిజంలలో పెట్టుబడులు పెట్టేందుకు అవకాశాలు ఉన్నాయని, అంతేగాక వెల్ నెస్ సెంటర్స్, ఆయుర్వేద కేంద్రాలకు ఏపీ అనువైన ప్రదేశం అని తెలిపారు. ఎకో టూరిజంపై ఏపీ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారని పేర్కొన్నారు. పర్యాటక ప్రాజెక్టులకు విద్యుత్ సబ్సిడీలు, ఇతర ప్రోత్సాహకాలు అందిస్తున్నామని, టూరిజంలో ఏపీ దేశానికి మోడల్‌గా మారడంతో పాటు నంబర్ వన్‌గా నిలవాలన్నదే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా నవంబర్ 14, 15 తేదీల్లో విశాఖలో జరగనున్న భాగస్వామ్య సదస్సుకు ఇన్వెస్టర్లను ఆహ్వానించారు. విభిన్న జాతుల, మతాల, సంస్కృతుల సమ్మేళనం భారతదేశం అని మంత్రి దుర్గేష్ అన్నారు. ఐకమత్యమే తమ బలమని చెబుతూ భారత్ మాతాకీ జై అని నినదించారు. ఈ సందర్భంగా వికసిక్ భారత్ లక్ష్యం దిశగా తాము అడుగులు వేస్తున్నామని తెలిపారు. కాగా మంత్రి కందుల దుర్గేష్ మూడు రోజుల లండన్ పర్యటన ముగియడంతో ఏపీకి తిరుగు ప్రయాణం అవుతారు.

# మంథా తుఫాన్ సమయంలో ప్రజల ప్రాణాలను కాపాడిన 108 సర్వీసులు!

●విపత్తులవేళ ప్రాణరక్షక దళంగా మారిన 108 హెల్త్ సర్వీసెస్!

●వర్షం, గాలి, వరద ఎక్కడైనా సేవలోనే అంబులెన్స్‌లు!

●ప్రాణభద్రత కోసం నిరంతర పోరాటం...108 సిబ్బంది అంకితభావం ఆదర్శం!



అమరావతి (చైతన్యరథం): రాష్ట్రాన్ని ప్రభావితం చేసిన మంథా తుఫాన్ సమయంలో ప్రజల ప్రాణాలను కాపాడటంలో 108 హెల్త్ సర్వీసెస్ కీలక పాత్ర పోషించింది. తుఫాను కారణంగా భారీ వర్షాలు, గాలులు, వరదలతో అనేక ప్రాంతాలు తీవ్ర ప్రభావానికి గురైన వేళ, ప్రజలకు సమయానుకూలంగా అత్యవసర వైద్య సేవలను అందించేందుకు 108 బృందం అచంచలంగా పనిచేసింది. తుఫాను హెచ్చరికలు అందిన వెంటనే 108 కమాండ్ కంట్రోల్ సెంటర్ అత్యవసర స్థితిని ప్రకటించి, రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు అలర్ట్ జారీ చేసింది. అంబులెన్స్ డ్రైవర్లు, ఎమర్జెన్సీ టెక్నీషియన్లు, డ్యూటీ సూపర్వైజర్లు తమ వాహనాలతో సిద్ధంగా ఉండాలని ఆదేశాలు జారీ చేయబడినవి. తుఫాను ప్రభావిత జిల్లాల్లో అంబులెన్స్‌లను వ్యూహాత్మకంగా నియమించి, ఎక్కడ ప్రమాద సూచనలు ఉన్నా అక్కడ ముందుగానే వాహనాలను నిలిపి ఉంచారు. ఏ క్షణంలోనైనా అత్యవసర పిలుపు వస్తే వెంటనే స్పందించేందుకు సిబ్బంది పూర్తి సిద్ధతతో ఉన్నారు. రాష్ట్ర స్థాయి మరియు జిల్లా స్థాయి అధికారులతో సమన్వయం కొనసాగిస్తూ, 108 కమాండ్ సెంటర్ అన్ని చర్యలను సమర్థంగా పర్యవేక్షించింది. కలెక్టర్లు, డీఎంహెచ్‌ఓలు, పోలీసు శాఖ, ఫైర్ సర్వీసులతో సమన్వయం చేస్తూ ప్రతి అత్యవసర పరిస్థితిలో సమయపూర్వక చర్యలు చేపట్టింది.

**విపత్తులవేళ ప్రాణరక్షక దళంగా మారిన 108 హెల్త్ సర్వీసెస్!**

తుఫాను ప్రభావం మధ్యలో కూడా 108 సిబ్బంది రాత్రింబగళ్లు నిరంతరంగా సేవలందించారు. భారీ వర్షం, గాలి, నీటిలో చిక్కుకున్న ప్రజలను సురక్షిత ప్రదేశాలకు తరలించి, వైద్యసహాయం అందించారు. కొన్నిచోట్ల సిబ్బంది రోగులను భుజాలపై మోసుకుని అంబులెన్స్ వరకు తీసుకువెళ్లిన సందర్భాలు చోటుచేసుకున్నాయి.తుఫాను కాలంలో మొత్తం 1,828 ఫోన్ కాల్స్‌కి స్పందించి, ప్రతి పిలుపు వెనుక ఉన్న ప్రాణాన్ని కాపాడేందుకు ప్రయత్నం జరిగింది. గర్భిణులు, వృద్ధులు, ప్రమాద బాధితులు, తీవ్ర అనారోగ్యంతో ఉన్న పౌరులకు సమయానుకూలంగా వైద్యసేవలు అందించబడ్డాయి. తుఫాను మంథా ప్రభావిత ప్రాంతాల్లో 108 హెల్త్ సర్వీసెస్ అత్యవసర వైద్యసేవల్లో విశేషంగా పాల్గొంది. మొత్తం 1828 ఫోన్ కాల్స్ అందుకుని, ప్రతి కాల్‌కి వెంటనే స్పందించి 1828 మందికి వైద్యసేవలు అందించారు. ఈ సేవల కోసం 1800 మంది సిబ్బంది నిరంతరంగా పని చేయగా, 672 అంబులెన్స్ వాహనాలు తుఫాన్ ప్రభావిత జిల్లాల్లో రాత్రింబగళ్లు సేవలందించాయి. అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాపాయంలో ఉన్న వారందరినీ సురక్షితంగా కాపాడడంలో 108 బృందం విజయవంతమైంది. ప్రజల ప్రాణ భద్రతను కాపాడటమే తమ ధ్యేయంగా సేవలందించింది. తుఫాను తగ్గిన తరువాత కూడా 108 బృందాలు పునరావాస ప్రాంతాల్లో వైద్య మద్దతు, రోగుల తరలింపు, ఫస్ట్ ఎయిడ్ సేవలు వంటి కార్యక్రమాలను కొనసాగించాయి. 672 అంబులెన్స్ వాహనాలు తుఫాన్ ప్రభావిత జిల్లాల్లో నిరంతరం పనిచేయగా, 1,800 మంది సిబ్బంది అంకితభావంతో సేవలందించారు. ప్రజల నుంచి 108 సిబ్బందికి ప్రశంసల వెల్లువ వచ్చింది. "తుఫాన్ రాత్రి మా ప్రాణాలు కాపాడింది 108" అంటూ పలువురు కృతజ్ఞతలు తెలిపారు. ఇది 108 సేవల పట్ల ప్రజల నమ్మకానికి నిదర్శనం.ప్రభుత్వం కూడా 108 బృందం చేసిన సమర్పణాత్మక సేవలను అభినందించింది. భవిష్యత్తులో విపత్తుల సందర్భాల్లో మరింత సమర్థవంతంగా స్పందించేందుకు డిజాస్టర్ రెస్పాన్స్ మాడ్యూల్ను బలోపేతం చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ప్రజల ప్రాణ భద్రతే తమ ప్రధాన ధ్యేయమని 108 హెల్త్ సర్వీసెస్ మరోసారి నిరూపించాయి. విపత్తు మధ్యలోనూ సేవా ధర్మాన్ని నిలబెట్టిన ఈ బృందం రాష్ట్రానికి గర్వకారణం.

**ప్రజల కోసం ఎల్లప్పుడూ సిద్ధంగా - 108 అంబులెన్స్‌లు**

ప్రజల ప్రాణ భద్రత కోసం ఎప్పుడూ అప్రమత్తంగా ఉండే 108 హెల్త్ సర్వీసెస్, విపత్తు పరిస్థితుల్లోనూ తమ సేవా ధర్మాన్ని నిలబెట్టుకున్నాయి. తుఫానులు, వరదలు, ప్రమాదాలు ఏవైనా ఎదురైనా 108 అంబులెన్స్‌లు క్షణంలో స్పందించే సజీవ రక్షక దళంగా మారాయి. అత్యవసర పిలుపు అందిన వెంటనే ప్రాంతాన్ని గుర్తించి అతి తక్కువ సమయంలో అక్కడికి చేరుకుని రోగుల ప్రాణాలను కాపాడడమే ఈ బృందం లక్ష్యం. ఆధునిక వైద్య పరికరాలతో సిద్ధంగా ఉన్న అంబులెన్స్‌లు, శిక్షణ పొందిన సిబ్బంది, సమన్వయంతో పనిచేసే కమాండ్ కంట్రోల్ వ్యవస్థ కలిసి ప్రజలకు భరోసానిచ్చే ఆరోగ్య భద్రతా కవచంగా నిలుస్తున్నాయి.




# ప్రజాదర్బార్‌లో ప్రజా సమస్యలు తెలుసుకున్న పాతపట్నం ఎమ్మెల్యే ఎంజీఆర్



పాతపట్నం (చైతన్యరథం): నియోజకవర్గం పాతపట్నం, మెలియాపుట్టి, హిరమండలం, కొత్తూరు, ఎల్ ఎన్ పేట, మండలాలకు చెందిన ప్రజా సమస్యలపై పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు శుక్రవారం నాడు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు ప్రజల నుండి ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు "ప్రజా దర్బార్ " నిర్వహించారు. పాతపట్నం నియోజకవర్గం రాజకీయ చరిత్రలో తొలిసారిగా ఎమ్మెల్యే ఎంజీఆర్ ఈ కార్యక్రమం నిర్వహించడం పట్ల అన్ని వర్గాల ప్రజలు పార్టీలకు అతీతంగా పార్టీ రహితముగా "ప్రజా దర్బార్" నిర్వహించడం పట్ల ప్రజల నుండి హర్షాతిరేఖలు వచ్చాయి. గత ప్రభుత్వ పాలనలో ప్రజా సమస్యలు గాలికి విడిచిపెట్టడంతో ప్రజా సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్న చందంగా ఉన్నాయి. ఈ తరుణంలో ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు ప్రయత్నించిన ఎమ్మెల్యే ఎంజీఆర్ కృషి పట్ల పలువురు అభినందించారు. ముఖ్యంగా ఐదు మండలాల నుండి వచ్చిన ఫిర్యాదులలో భూ వివాదాలు, రెవెన్యూలతోపాటు రహదారుల సమస్యలు, విద్యుత్ కోతలు, తాగునీటి సమస్యలు, ప్రధాన సమస్యలే ఎమ్మెల్యే దృష్టికి వచ్చాయి. దీనితోపాటు రేషన్ కార్డులు కావాలని పింఛనులు కావాలని, ఇల్లు స్థలాలు కావాలని, గృహ నిర్మాణాలు చేపట్టాలని, వృద్ధులు వికలాంగులు, వితంతువులు వ్యక్తిగత ఫిర్యాదులు అందాయి. వాటిని పరిష్కరించాలని అధికారులకు సూచించారు.

# సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తా...అధికారుల తీరు పట్ల గంటా అసంతృప్తి



మధురవాడ (చైతన్యరథం): వచ్చే వారం నుంచి గ్రీవెన్స్ నిర్వహణకు ముందురోజు క్షేత్ర స్థాయిలో పర్యటించి సమస్యలకు పూర్తి స్థాయి పరిష్కారం చూపిస్తానని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చెప్పారు. మధురవాడ జోనల్ కార్యాలయంలో శుక్రవారం ఆయన గ్రీవెన్స్ నిర్వహించారు. పార్కులు, ఓపెన్ స్పేస్‌లు, గెడ్డలు తదితర ప్రభుత్వ స్థలాల ఆక్రమణలను.. అనధికార నిర్మాణాలను.. స్వయంగా పరిశీలిస్తానని తెలియజేశారు. పిర్యాదుల పరిష్కారంలో టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్, విద్యుత్, రెవిన్యూ తదితర విభాగాల పనితీరు పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజా పిర్యాదులను పై అధికారులకు పంపించి పరిష్కారమైన జాబితాలో చూపించడం సరి కాదన్నారు. గ్రీవెన్స్ మొక్కుబడి తంతుగా జరగకుండా నివేదికల ఫార్మెట్ మార్చమని అధికారులను ఆదేశించారు. అధికారులు ఏ లెక్కలు చెప్పినా ఆశించినంతగా పిర్యాదుల పరిష్కారం జరగడం లేదని పేర్కొన్నారు. ప్రతి సోమవారం ఉన్నతాధికారులు గ్రీవెన్స్ నిర్వహిస్తున్నా.. ఇంకా అనేక సమస్యలకు పూర్తి స్థాయి పరిష్కారం దొరకడం లేదన్నారు. మెరుగైన ఫలితాలు సాధించవచ్చన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశంతో ప్రతి శుక్రవారం ఎమ్మెల్యేలు కూడా గ్రీవెన్స్ నిర్వహించనున్నామని వివరించారు. గ్రీవెన్స్ లో వచ్చే పిర్యాదులపై ఇక మీదట సంబంధిత అధికారుల క్షేత్ర స్థాయి పరిశీలన తప్పనిసరన్నారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మి, కార్పొరేటర్లు గాడు చిన్ని కుమారి లక్ష్మి, మొల్లి హేమలత, లొడగల అప్పారావు, కూటమి నేతలు చిక్కాల విజయ్ బాబు, కె.అచ్యుతరావు, మామిడి దుర్గారావు, నాగోతి సత్యనారాయణ, మొల్లి లక్ష్మణరావు, వాండ్రాసి అప్పలరాజు, బోయి రమాదేవి, మంగాదేవి, కురుమిన లీలావతి తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి అర్జీని పరిష్కరించే చర్యలు చేపడతాం : ఎమ్మెల్యే శిరీష దేవి



రంపచోడవరం (చైతన్యరథం): ప్రతి అర్జీని పరిష్కరించే చర్యలు కూటమి ప్రభుత్వం తీసుకుంటుందని నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి వ్యాఖ్యానించారు. గంగవరం మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయం ఆవరణలో శుక్రవారం ఆమె మండల పార్టీ అధ్యక్షులు పల్లాల వెంకటరెడ్డి అధ్యక్షతన ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... తన దృష్టికి వచ్చిన ప్రతీ సమస్య పరిస్కారం చేయటమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు చాలా మట్టుకు నెరవేర్చమని తెలిపారు. అలాగే మండలస్థాయి అధికారులకు కూటమి నాయకులు తీసుకు వచ్చిన ప్రతీ సమస్య పరిస్కారం చేయాలని అధికారులకు ఆదేశించారు. గ్రామాల్లో ఎలాంటి సమస్య ఉన్నా అధికారులు స్పందించి పరిస్కారం చేయాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు పూర్తి పారదర్శకంగా వ్యవహరించాలని ఎలాంటి ఒత్తిళ్లకులోనుకాకుండా చర్యలు చేపట్టాలని కోరారు. పలువురు అందించిన అర్జీలను పరిశీలిస్తే... రంపచోడవరం నియోజకవర్గాన్ని రాజమండ్రి జిల్లాలో కలపకుండా రంపచోడవరం జిల్లా చేయాలని కోరారు. ఆముదాలబంద గ్రామానికి విద్యుత్ సమస్య పరిష్కారించాలని కోరారు. కొత్తడ పునరావాస కాలనీకి సిమెంట్ రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని కోరారు. పంచాయతీ స్థలాన్ని కబ్జా చేసి అక్రమ నిర్మాణం చేసిన వారిని తొలగించాలని కోరారు. నెల్లిపూడిలో కుంతీదేవి గుడి నిర్మాణం చేపట్టాలని కోరారు. ఎల్లాపురం గ్రామంలో పాఠశాల భవనం సిద్ధిలమైపోయిందని నూతన భవనం నిర్మాణం చేయాలని గ్రామస్తులు కోరారు. కొండ పోడు భూములకు పట్టాలు కావాలని, కొన్ని గ్రామాల్లో పలు దేవాలయ నిర్మాణాలు కావాలని కోరారు. ప్రజాదర్బార్‌లో అధిక భాగం రెవెన్యూకు సంబంధించిన సమస్యలు, సామాజిక ఫించన్లు, మౌళిక వసతుల కల్పన కొరకు ఇలా అనేక రకాల సమస్యలు ప్రజా దర్బార్‌లో ఆమె దృష్టికి తీసుకురాగా వెనువెంటనే సంబంధిత అధికారుల దృష్టిలో ఉంచి పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు.

# వందేమాతరం గీతాలాపన కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ తోయక



కురుపాం (చైతన్యరథం): పార్వతీపురం మన్యం జిల్లా, కురుపాం మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వందేమాతరం గేయం రచించి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ మరియు కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి పాఠశాల విద్యార్థులతో కలిసి వందేమాతరం గీతాలాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... వందేమాతరం గీతాలాపన దేశమాత ఆరాధనతో సమానమని, వందేమాతరం గీతంలోని శబ్దం ప్రజల్లో ఆత్మవిశ్వాసం, ప్రేరణను నింపుతుందని, భవిష్యత్తుకు భరోసాను కల్పిస్తుందని అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్ పర్సన్ కడ్రక కళావతి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, నియోజకవర్గ మహిళా కార్యదర్శి వెంపటాపు భారతి, మాజీ ఏఎంసీ చైర్మన్ కోలా రంజిత్ కుమార్, మాజీ ఎంపీపీ రమణమూర్తి, ఎంపీడీవో, ఎంఈఓ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజాసమస్యల పరిష్కారమే నా ధ్యేయం : ఎమ్మెల్యే గొండు శంకర్



శ్రీకాకుళం (చైతన్యరథం): శ్రీకాకుళం నియోజకవర్గ ఎమ్మెల్యే గొండు.శంకర్, ప్రజల కష్టాలు తీర్చటానికి, అందరికోసం .. అందరివాడై, ప్రజాసమస్యలను భుజానవేసుకొని, సత్వర పరిష్కారమందిస్తున్నారని, ప్రజాదర్బార్‌లో వినతులు అందించటానికి వచ్చిన నియోజకవర్గ ప్రజలు, స్థానికులు తెలిపారు. స్థానిక విశాఖ కోలనీ పార్టీ కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజాదర్బార్‌కు శుక్రవారం జనవాహినితో కిక్కిరిసిపోయింది. ప్రతీ సమస్యకు గొండు.శంకర్ తనదైన శైలిలో పరిష్కారమార్గం చూపిస్తుండటంతో, శ్రీకాకుళం అర్బన్, రూరల్, గార మండల ప్రజలు, వికలాంగుల బృందం, ప్రజాదర్బార్‌కు వచ్చి తమ సమస్యలను విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రజలు సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే సంబంధిత అధికారులతో సంప్రదించి, సమస్య పరిష్కరించే దిశగా ప్రయత్నాలు చేస్తున్నామని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వము ప్రజా సమస్యల పరిష్కారానికే పెద్దపీట వేస్తుందని, సూపర్ సిక్స్ లో ఇచ్చిన హామీలను అమలుపరుస్తూ తిరుగులేని సుపరిపాలన అందిస్తుండటంతో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. గడిచిన కాలంలో కూటమి అమలుపరిచిన పథకాలే ఇందుకు నిదర్శనమని, రానున్న కాలంలో రాష్ట్రభివృద్ధిని చూస్తారన్నారని, ప్రజాసమస్యల పరిష్కారమే నా ధ్యేయమని, అందరికీ అందుబాటులో ఉండి, న్యాయం జరిగేలా చూస్తానన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం, రూరల్, గార, పరిసర గ్రామ ప్రజలు, టీడీపీ నగర, మండల నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు, క్లస్టర్ ఇన్చార్జ్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం బాధితులకు సీఎం రిలీఫ్ చెక్కులు పంపిణీ కార్యక్రమం చేపట్టారు.

## మైలవరం ప్రజాదర్బారుకు అనూహ్యస్పందన... వినతుల స్వీకరణ



మైలవరం (చైతన్యరథం): ప్రజాసమస్యల పరిష్కార వేదికగా నిర్వహించిన 'ప్రజాదర్బారు'కు అనూహ్యస్పందన లభించింది. మైలవరం పట్టణంలోని శాసనసభ్యుని వారి కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజాదర్బారులో స్థానిక ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ పాల్గొన్నారు. నాలుగు గంటలకు పైగా నిర్విరామంగా వినతులను స్వీకరించారు. ప్రజల సమస్యలను ఓపికగా విని వారి సమస్యల పరిష్కారం కోసం ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ... ప్రజాదర్బార్ వేదికలో అన్నిశాఖల అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. ఇక్కడకు వచ్చే సమస్యలను నెల రోజుల వ్యవధిలో పరిష్కరిస్తామన్నారు. అధికారులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలన్నారు. ప్రజా సమస్యలకు మొక్కుబడిగా కాకుండా నాణ్యతతో కూడిన పరిష్కారం లభించాలని అన్నారు. ప్రభుత్వ అధికార యంత్రాంగం ఎక్కడికక్కడ బాధ్యతతో పని చేయాలన్నారు. సమస్యల మూలాలను గుర్తించి శాశ్వత పరిష్కార దిశగా చర్యలు చేపట్టాలని అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజల నమ్మకాన్ని కూటమి ప్రభుత్వం నిలబెడుతుందన్నారు. ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు, రాష్ట్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. సూపర్ సిక్స్ హామీలు ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నారని అన్నారు. శుక్రవారం నిర్వహించిన ప్రజాదర్బారులో పోలీసు, రెవెన్యూ, పంచాయతీ రాజ్, విద్యుత్తు, రహదారుల అభివృద్ధి, వివిధ శాఖలకు సంభందించిన సమస్యలతో పాటు వ్యక్తిగత సమస్యలపై ప్రజలు అర్జీలు సమర్పించారు. వాటిలో సమస్య తీవ్రతను బట్టి వెంటనే పరిష్కరించే అవకాశం ఉన్నవాటిని తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

## ప్రజాసమస్యల పరిష్కారమే నా ధ్యేయం : ఎమ్మెల్యే బగ్గురమణమూర్తి



నరసన్నపేట (చైతన్యరథం): నియోజకవర్గ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, ప్రజల కష్టాలు తీర్చటానికి, అందరికోసం .. అందరివాడై, ప్రజాసమస్యలను భుజానవేసుకొని, సత్వర పరిష్కారమందిస్తున్నారని, ప్రజాదర్బార్‌లో వినతులు అందించటానికి వచ్చిన నియోజకవర్గ ప్రజలు, స్థానికులు తెలిపారు. కత్తెరవానిపేట పార్టీక్యాంపు కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజాదర్బార్‌కు శుక్రవారం జనవాహినితో కిక్కిరిసిపోయింది. ప్రతీ సమస్యకు రమణమూర్తి తనదైన శైలిలో పరిష్కారమార్గం చూపిస్తుండటంతో, మండల ప్రజలు, నియోజకవర్గ ప్రజలు, ప్రజాదర్బార్‌కు వచ్చి తమ సమస్యలను విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రజలు సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే సంబంధిత అధికారులతో సంప్రదించి, సమస్య పరిష్కరించే దిశగా ప్రయత్నాలు చేస్తున్నామని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వము ప్రజా సమస్యల పరిష్కారానికే పెద్దపీట వేస్తుందని, సూపర్ సిక్స్‌లో ఇచ్చిన హామీలను అమలుపరుస్తూ తిరుగులేని సుపరిపాలన అందిస్తుండటంతో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. గడిచిన కాలంలో కూటమి అమలుపరిచిన పథకాలే ఇందుకు నిదర్శనమని, రానున్న కాలంలో రాష్ట్రభివృద్ధిని చూస్తారన్నారని, ప్రజాసమస్యల పరిష్కారమే నా ధ్యేయమని, అందరికీ అందుబాటులో ఉండి, న్యాయం జరిగేలా చూస్తానన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిసర గ్రామ ప్రజలు, టీడీపీ నగర, మండల నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు, క్లస్టర్ ఇన్చార్జ్, తదితరులు పాల్గొన్నారు.

## ఏసీఏ ఆధ్వర్యంలో శ్రీచరణికి ఘనస్వాగతం పలికిన ఎంపీ కేశినేని



గన్నవరం (చైతన్యరథం): ఐసీసీ ఉమెన్స్ క్రికెట్ వరల్డ్ కప్ 2025 విజేత, టీమిండియా సభ్యురాలైన శ్రీచరణికి గన్నవరం ఎయిర్ పోర్ట్‌లో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ తరపున ఘనస్వాగతం లభించింది. ఏసీఏ సెక్రటరీ సానా సతీష్ బాబు మహిళ మంత్రులు వంగలపూడి అనిత, ఎస్. సవిత, గుమ్మడి సంధ్యరాణి, శాప్ అధ్యక్షుడు ఎ.రవినాయుడుతో కలిసి ఏసీఏ అధ్యక్షుడు, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ స్వాగతం పలికారు. శ్రీచరణికి పుష్పగుచ్ఛం అందించి ఏసీఏ ప్రెసిడెంట్ కేశినేని శివనాథ్ అభినందనలు తెలిపారు. తొలిసారిగా ఉమెన్ వరల్డ్ కప్ సాధించిన ఇండియా టీమ్ లో తెలుగమ్మాయి శ్రీచరణి ఆడటం ఎంతో గర్వంగా వుందన్నారు. సౌతాఫ్రికాతో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో శ్రీచరణి ఇండియా విజయంలో కీలకపాత్ర పోషించిందని ప్రశంసించారు. వేలాది తరలివచ్చిన క్రికెట్ అభిమానులు శ్రీచరణికి జయజయ ధ్వానాలతో చిన్నారులు జాతీయ జెండాలతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఏసీఏ కోశాధికారి దండమూడి శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీ బి.విజయకుమార్, అపెక్స్ కౌన్సిల్ మెంబర్ అస్కార్ వినోద్ కుమార్‌లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## స్వాతంత్రోద్యమంలో కీలక పాత్ర పోషించిన వందేమాతరం గేయం

- వందేమాతం జాతీయ గేయం 150 వసంతాల సంస్మరణోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే వనమాడి కొండబాబు



కాకినాడ (చైతన్యరథం): స్వాతంత్రోద్యమంలో వందేమాతరం గేయం కీలక పాత్ర పోషించిందని, దేశ భక్తికి ప్రతీకగా వందేమాతరం గేయం స్వాతంత్ర ఉద్యమాన్ని ఉత్తేజపరిచిందని కాకినాడ సిటీ శాసనసభ్యులు వనమాడి కొండబాబు పేర్కొన్నారు. సాలిపేట గర్ల్స్ హైస్కూల్ నందు నిర్వహించిన వందేమాతరం జాతీయ గేయం 150 వసంతాల సంస్మరణోత్సవ వేడుకలో కాకినాడ సిటీ శాసనసభ్యులు వనమాడి కొండబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వనమాడి కొండబాబు మాట్లాడుతూ... 1875 నవంబర్ 7వ తేదీన ప్రముఖ బెంగాలీ కవి బంకించంద్ర చటర్జీ రచించారని, భారత స్వాతంత్రోద్యమంలో వందేమాతరం గేయం కీలక పాత్ర పోషించిందని, దేశభక్తికి ప్రతీకగా మారి స్వాతంత్ర ఉద్యమాన్ని ఉత్తేజపరచడం జరిగిందని, 1950 భారతదేశం గణతంత్ర దేశంగా ఆవర్భించిన సందర్భంలో వందేమాతరం గేయాన్ని జాతీయ గేయంగా గుర్తించారని, నేడు కేంద్ర ప్రభుత్వం వందేమాతరం జాతీయ గేయం 150 వసంతాల సంస్మరణోత్సవ వేడుకలు దేశ వ్యాప్తంగా నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఈవో రమేష్, ఎంఈవో సుబ్బారావు, కేవీవీ సత్యనారాయణ, సాలిపేట గర్ల్స్ హైస్కూల్ ఆధ్యాపక సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజలకు ప్రభుత్వాన్ని చేరువ చేయడమే ప్రజాదర్బార్ లక్ష్యం

- 45దఫాలుగా ప్రజాదర్బార్ నిర్వహణ... కొత్తపేట ఎమ్మెల్యే బండారు



కొత్తపేట (చైతన్యరథం): ప్రభుత్వాన్ని ప్రజలకు చేరువ చేయడమే ప్రజాదర్బార్ లక్ష్యమని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు వ్యాఖ్యానించారు. శుక్రవారం రావులపాలెం క్యాంపు కార్యాలయంలో జరిగిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులు స్వీకరించారు. మొత్తం 161 వినతులు ప్రజల నుంచి అందగా పలు సమస్యలను అప్పటికప్పుడే అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. ప్రజాదర్బార్‌కు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందన్నారు. తమ దృష్టికి వచ్చిన ప్రతీ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు.

**మరో వెయ్యేళ్ళయినా వందేమాతరం స్ఫూర్తి రగులుతూనే ఉంటుంది...**

మరో వెయ్యేళ్ళు గడిచినా భారతీయుల్లో వందేమాతరం గీతం స్ఫూర్తి అలాగే నిల్చి ఉంటుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు వ్యాఖ్యానించారు. వందేమాతరం గీతాన్ని బంకించంద్ర ఛటర్జీ రచించి శుక్రవారానికి 150 సంవత్సరాలు పూర్తి కావడంతో వాడపాలెం పాఠశాలలో జరిగిన వేడుకల్లో ఆయన పాల్గొన్నారు.విద్యార్థులతో కల్సి వందేమాతరం ఆలపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... బ్రిటీష్ వాడి గుండెల్లో రైళ్లు పరిగెత్తించిన స్వాతంత్ర్య సమర నినాదం వందేమాతరం అని కొనియాడారు. 1875 నవంబర్ 7వ తేదీన ఈ గీతాన్ని బంకించంద్ర చటర్జీ రచించారని తెలిపారు. స్వాతంత్రం వచ్చాక 1950 జనవరి 24న రాజ్యాంగ సభ వందేమాతరం గీతాన్ని జనగణమనతో సమానంగా గౌరవిస్తూ జాతీయ గీతంగా గౌరవించిందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల నేతృత్వంలో వందేమాతరం గీతం 150వ వార్షికోత్సవాన్ని నేడు మనం జరుపుకుంటున్నారన్నారు.

## పెట్టుబడులను అడ్డుకునేందుకు జగన్ విద్వేషపూరిత కుట్ర

విజయవాడ (చైతన్యరథం): "పెట్టుబడులను అడ్డుకునేందుకు జగన్ మోహన్ రెడ్డి విద్వేషపూరిత కుట్రకు తెర లేపుతున్నాడని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకోవాలనే ఉద్దేశంతో కుట్ర రాజకీయాలు నడిపిస్తున్నాడు" అని గొల్లపూడి కార్యాలయంలో శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, దేశ, విదేశాల నుండి పెట్టుబడిదారులు ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో భాగస్వాములు కావాలనే ఆసక్తి కనబరుస్తున్న వేళ జగన్ రెడ్డి మాత్రం ద్వేషపూరిత వ్యాఖ్యలతో రాష్ట్ర ప్రతిష్ఠను దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నాడని విమర్శించారు. "ఇంటెలిజెన్స్, కౌంటర్ ఇంటెలిజెన్స్ విభాగాలు అప్రమత్తంగా ఉండాలని, పెట్టుబడులపై నమ్మకం కోల్పోయేలా చేసే కుట్రలు తక్షణమే గుర్తించాలి," అని దేవినేని ఉమ పేర్కొన్నారు. వైసీపీ పాలనలో ఐదేళ్ల కాలంలో రాష్ట్రం అవినీతి, మత్తు పదార్థాలు, నాసిరకం మద్యం మయమైపోయిందని ఆయన తీవ్రంగా విమర్శించారు. "నాసిరకం మద్యం విచ్చలవిడిగా తయారు చేసి పంది కొక్కుల్లాగా వేల కోట్లు దోచుకుని వేలాదిమంది ప్రాణాలు బలి చేశారు," అని ఉమ ఆరోపించారు.

## అధికారులు తిప్పించుకోకుండా పనులు పూర్తి చేయాలి

**●ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజాదర్బార్ నిర్వహించిన జీవీ**



వినుకొండ (చైతన్యరథం): నియోజకవర్గంలోని ఏ విభాగం అధికారులు అయినా తమ వద్దకు సమస్యలతో వచ్చే ప్రజల్ని మళ్లీమళ్లీ తిప్పించుకోకుండా పనులు పూర్తిచేయాలని, అప్పుడే వారిపై పెట్టుకున్న నమ్మకానికి అర్థం ఉంటుందన్నారు ప్రభుత్వచీఫ్‌విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు. ప్రతి సమస్య అధికారులు, ఉద్యోగులు వీలైనంత వరకు స్వయంగా పరిశీలించి తక్షణ పరిష్కారం చూపడం అవసరమని స్పష్టం చేశారు. వినుకొండ పట్టణం కొత్తపేటలోని తన కార్యాలయంలో శు క్రవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ప్రజలు నేరుగా చీఫ్ విప్ జీవీ ఆంజనేయులును కలిసి తమ సమస్యలు విన్నవించుకున్నారు. వివిధ మండలాల నుంచి తరలివచ్చిన ప్రజల సమస్యలను శ్రద్ధగా విని వారికి అండగా ఉంటామని, పరిష్కారం చూపుతామని ఆయన పేర్కొన్నారు. పెన్షన్లు,మున్సిపల్, రెవెన్యూ, తాగునీటి సహా వివిధ సమస్యలపై 60 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా మాట్లాడిన చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అధికారులు జనాలతో కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ చేయించుకోకుండా ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరించాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం వేగంగా స్పందించడం వారి ప్రాథమిక బాధ్యతని గుర్తించాలని స్పష్టం చేశారు. ప్రజాదర్భార్‌కు వచ్చే అర్జీలపై తమ కార్యాలయం నుంచి కూడా ట్రాకింగ్ ఉంటుందని, వివిధ శాఖల మధ్య సమన్వయంతో చేయాల్సిన పనులపై సమీక్షలు కూడా నిర్వహిస్తునే ఉంటామన్నారు. అది గుర్తు పెట్టుకుని పనిచేస్తే వ్యక్తిగతంగా అధికారులకు, ప్రభుత్వానికి కూడా మంచి పేరు వస్తుందన్నారు.

## నియోజకవర్గంలో రేషన్ మాఫియా వెనుక వైసీపీ హస్తం

**● దుష్టపాలన అంతమైనా... దుష్టులు అంతం కాలేదు : గళ్ళా మాధవి**



గుంటూరు (చైతన్యరథం): దుష్టపాలన అంతమైనా... దుష్టులు అంతం కాలేదు. దుష్టమూలాలు ఇంకా అక్కడక్కడ కొనసాగుతూనే ఉన్నాయి. వాటిని కూకటి వేళ్లతో పెకలించి ప్రజాధనాన్ని కాపాడేందుకు కూటమి ప్రభుత్వం సర్వధా సన్నధంగా ఉంటుంది. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో జరుగుతున్న రేషన్ మాఫియా వెనుక వైసీపీ నాయకుల ప్రత్యక్ష ప్రమేయం ఉంది. పేదల హక్కుగా భావించే రేషన్ బియ్యాన్ని సైతం అక్రమంగా తరలించి, దాని ద్వారా వస్తున్న అక్రమ సంపాదనను రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో ఖర్చు చేసేందుకు వైసీపీ నాయకులు నీచమైన ప్రణాళికలు రచిస్తున్నారు. ప్రజాధనంపై మీ కబంధ హస్తాలు ఇంక పనిచేయవు. పేద ప్రజల ఆకలిని రాజకీయం చేసి, వారి వాటా బియ్యాన్ని దోచుకుని ఎన్నికల వ్యయానికి వాడుకోవాలనే మీ అవినీతి కుతంత్రాలకు కూటమి ప్రభుత్వం చెక్ పెడుతుంది. ప్రజాధనం దోచుకుంటే ప్రజలు చూస్తూ ఊరుకోరు. దోపిడీకి అలవాటుపడిన మీ మనస్తత్వాన్ని ప్రజలు తిరస్కరించారు. అయినా కూడా మీ బుద్ధి మారకుండా, చట్ట విరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే, పర్యవసానాలు చాలా తీవ్రంగా ఉంటాయి. సీఎం చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నంతవరకు, తప్పు చేసిన ఏ ఒక్కరినీ అది ఎంతటి శక్తిమంతమైన నాయకుడైనా సరే క్షమించే ప్రసక్తే లేదు. కఠిన చర్యలు తథ్యం. రేషన్ మాఫియాకు పాల్పడిన ప్రతి వైసీపీ నాయకుడిపై, వారికి సహకరించిన ప్రతి అధికారిపైనా చట్టపరంగా ఉక్కుపాదం మోపి, దోచుకున్న ప్రజాధనాన్ని పూర్తిగా రికవరీ చేసి, జైలుకు పంపుతామని హెచ్చరిస్తున్నాం. పేదలకు అందాల్సిన ప్రతి పైసా, ప్రతి బియ్యపు గింజ వారి చెంతకే చేరుతుంది.

## ఇది విజనరీ ప్రభుత్వం : ఎమ్మెల్యే నసీర్

గుంటూరు (చైతన్యరథం): ఇది విజనరీ ప్రభుత్వం అని, పేదలకు మంచి చేయడమే తెలుసునని వేస్తోందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. శుక్రవారం స్థానిక తూర్పు శాసనసభ్యుల వారి కార్యాలయంలో రూ.1.06 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. స్థానిక సుద్ధపల్లి డొంకకు చెందిన షేక్ దరియావలికి రూ.40 వేలు, వాసవి నగర్‌కు చెందిన తన్నీరు అంకమ్మరావుకు రూ.66 వేలు చొప్పున అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ గుంటూరు తూర్పు నియోజకవర్గంలో పేదల ఆరోగ్యమే పరమావధిగా పని చేస్తున్నామని తెలిపారు. అనారోగ్యంతో ఆసుపత్రులపాలైన కుటుంబాలకు సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో భరోసా కల్పిస్తున్నామని తెలిపారు. నియోజవర్గంలో ప్రజలకు ఏ చిన్న సమస్య వచ్చినా తామున్నామనే ధైర్యం కల్పిస్తున్నామని చెప్పారు. అభివృద్ధి, సంక్షేమ రంగాలలో ప్రజలకు సంతృప్తి స్థాయిలో సేవలందిస్తున్నామని అన్నారు. ఎన్నికల్లో చెప్పిన విధంగా సూపర్ సిక్స్ పథకాలను చెప్పింది చెప్పినట్లుగా అమలు చేశామన్నారు. స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వరంగా మారిందని చెప్పారు. అందుకే కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు మనసారా ఆశీర్వదిస్తున్నారని పేర్కొన్నారు.

## మచిలీపట్నంలో సీసీ రోడ్డు, డ్రైనేజీ, కల్వర్టు పనులకు శ్రీకారం

**●ప్రజల సదుపాయాల కల్పనకు కట్టుబడి పని చేస్తాం**

**●తాగునీరు, రోడ్లు, మురుగు సమస్య లేకుండా చర్యలు**

**●పేదలందరికీ సంక్షేమ పథకాలు అందిస్తాం**

**●మచిలీపట్నం 39వ వార్డులో అభివృద్ధి పనులకు మంత్రి కొల్లు రవీంద్ర**



మచిలీపట్నం (చైతన్యరథం): మచిలీపట్నంలోని 39వ డివిజన్ కాసానిగూడెంలో సీసీ రోడ్డు, డ్రైనేజీ, కల్వర్టు, పైపులైన్ పనులకు రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర శంకుస్థాపన చేశారు. సుమారు 23.54 లక్షల వ్యయంతో 150 మీటర్ల పొడవున రోడ్డు, పైపులైను, డ్రైనేజీ నిర్మాణం చేపట్టనున్నామని తెలిపారు. పంపుల చెరువు నిండిన ప్రతిసారీ వరదతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వర్షం పడినప్పుడు కూడా మురుగు రోడ్లపై నిలిచి అవస్థలు పడుతున్నారు. ఆ సమస్యలన్నింటికీ పరిష్కారం చూపించబోతున్నామన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక ప్రతి ఇంటిక సంక్షేమ పథకాలు అందిస్తున్నామని, ప్రతి వీధినా అభివృద్ధి కనిపిస్తోందని తెలిపారు. గుంతలు లేని రోడ్లు లక్ష్యంగా గతంలో పని చేశాం. ఇప్పుడు మురుగు కాల్వలు, తాగునీటి పైపులైన్ల సమస్లకు కూడా పరిష్కారం చూపించబోతున్నాం. ఇదే వార్డులో ఇప్పటి వరకు రూ.5.63 కోట్ల విలువైన సంక్షేమ పథకాలు అమలు చేశామని తెలిపారు. తల్లికి వందనం పథకం ద్వారా 453 మంది పిల్లల తల్లుల ఖాతాల్లో రూ.67.95 లక్షలు జమ చేశాం. 17 మంది ఆటో డ్రైవర్లకు రూ.2.55 లక్షలు అందించాం. అట్టడుగు వర్గాలను అభివృద్ధి పథంలోకి తీసుకొచ్చేందుకు కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోంది. ఇప్పటికే ప్రతి గడపకూ సంక్షేమం నినాదంతో ముందుకు వెళ్తున్నామన్నారు. మున్సిపల్ నిధులను సద్వినియోగం చేసుకుంటూ మచిలీపట్నంలో డ్రైనేజీ సమస్య పరిష్కారానికి రూ.13 కోట్లు మంజూరయ్యాయని, మరో రూ.60 కోట్లు కేంద్ర ప్రభుత్వం నుండి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని, తద్వారా నియోజకవర్గంలోని డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపిస్తామన్నారు. నియోజకవర్గంలోని పేదలందరికీ పక్కా ఇంటి కలను సాకారం చేసే దిశగా అడుగులు వేస్తున్నామని, టిడ్కో ఇళ్లను పూర్తి చేసి పేదలకు అందిస్తామన్నారు. అదే సమయంలో సొంతంగా ఇళ్లు కట్టుకునే వారికి కూడా రూ.2.50 లక్షల వరకు ఆర్థిక సాయం అందిచనున్నామని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎస్ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు, మార్కెట్ యార్డు ఛైర్మన్ కుంచె దుర్గాప్రసాద్, మున్సిపల్ మాజీ ఛైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, లోగిశెట్టి స్వామి, జనసేన పార్టీ పట్టణాధ్యక్షుడు గడ్డం రాజు, 39వ డివిజన్ ఇంఛార్జి కట్టా అంజిబాబు, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పి.వి.ఫనికుమార్, రూరల్ పార్టీ అధ్యక్షులు కాగిత వెంకటేశ్వరరావు, కోస్తా మురళీకృష్ణ, నాగబాబు, మరకాని సమతాకీర్తి, అన్నం ఆనంద్, దింటకుర్తి సుధాకర్, దేవరపల్లి అనిత తదితరులు పాల్గొన్నారు.

## లక్షల కోట్లు కొల్లగొట్టిన బడాచోర్ జగన్ : ప్రత్తిపాటి



చిలకలూరిపేట (చైతన్యరథం): "జగన్ ఐదేళ్ల పాలనలో రాష్ట్ర ఖాతాలో అంతులేని అవినీతి, అప్రతిష్ట జమ అయితే.. అభివృద్ధి మమా అన్న విధంగా జరిగింది. ఆయనకు, వైసీపీ నేతలకు తమ ఖాతాల్లో అంతులేని అవినీతి సంపద జమైతే, రాష్ట్రానికి, ప్రజలకు మాత్రం ఎప్పటికీ పూడ్చలేని భారీనష్టం జరిగింది. ప్రజాసంక్షేమం నేతిబీరలో నెయ్యి చందంగా అమలైంది. ఐదేళ్లలో నూరేళ్లకు సరిపడా నష్టాన్ని, విధ్వంసాన్ని రాష్ట్రానికి ప్రజలకు కానుకగా ఇచ్చిన క్రెడిట్ జగన్ కే సాధ్యమైంది. క్రెడిట్ చోరీ గురించి జగన్ మాట్లాడుతుంటే ప్రజలతో పాటు వైసీపీశ్రేణులే నివ్వెరపోతున్నాయి. తండ్రి పాలనలో లక్షలకోట్లు కొల్లగొట్టిన బడాచోర్.. క్రెడిట్ చోరీ అంటుంటే ప్రజలు నివ్వెరపోతున్నారు. అంగుళం భూమి.. అరపైసా నిధులు ఇవ్వకుండా విమానాశ్రయాలు, పోర్టులు నిర్మించడం కలల సామ్రాజ్యంలోనే సాధ్యమవుతుందని, డెవలప్‌మెంట్ అంటే 16 నెలల జైల్ ట్రీట్మెంట్, పదితరాలకు సరిపడా ప్రజాధనం సెటిల్మెంట్ కాదనే వాస్తవాన్ని జగన్ గ్రహిస్తే మంచిది.

**నూరేళ్లకు సరిపడా నష్టమే జగన్ చేసిన అభివృద్ధి**

ఐదేళ్ల పాలనలో రాష్ట్రానికి నూరేళ్లకు సరిపోయే నష్టమే జగన్ చేసిన అభివృద్ధి. ప్రజల, ప్రభుత్వ ఆస్తులు దోచేసే చీకటి జీవోలు.. చట్టాలు జగన్ క్రెడిట్లో భాగాలే. వేలకోట్ల ఇసుకదోపిడీ.. జే బ్రాండ్ మద్యం.. జే ట్యాక్స్ ధాటికి పరిశ్రమల పలాయనం జగన్ ఖ్యాతే. స్వప్రయోజానాలు పణంగా పెట్టి పొరుగు రాష్ట్ర నాయకులతో ములాఖత్‌లు.. ఏపీ సాగునీటి ప్రాజెక్టుల తాకట్లు జగన్ చలవే. నా.. నా అంటూ నమ్మిన ఎస్సీ, ఎస్టీల నోట్లో మట్టి కొట్టి. బీసీలు, మైనారిటీల బతుకుల్లో నిప్పులు పోయడం జగన్ గొప్పతనమే రాష్ట్రానికి అంతా తానే చేస్తే ప్రజలు 11తో ఎందుకు సత్కరించారో, ప్రతిపక్ష హోదా అడుక్కునే స్థాయికి ఎందుకు దిగజార్చారో జగనే చెప్పాలి.

**చంద్రబాబుకు, ప్రభుత్వానికి మంచిపేరు రాకూడదన్న దుగ్దతో జగన్ మాట్లాడుతున్నాడు**

గూగుల్ డేటా సెంటర్‌తో రాష్ట్రానికి ఎలాంటి ఉపయోగం లేదని తన అవినీతి మీడియాలో, పార్టీ సోషల్ మీడియాలో ప్రచారం చేయించింది జగన్ కాదా? డేటాకు మైండ్ అప్లై చేస్తే ఏఐ అవుతుందన్నప్పుడే జగన్‌కు దూరంగా ఉండాలని వైసీపీనేతలు, ప్రజలు గ్రహించారు. మొక్కుబడిగా చేపట్టిన 'అన్నదాతలకు అండగా' షో అట్టర్ ఫ్లాప్ అయినా, పెయిడ్ ఆర్టిస్టుల ప్రదర్శన నీరుగారినా జగన్ మతిభ్రమణానికి బ్రేకులు పడలేదని, చంద్రబాబుకు, కూటమి ప్రభుత్వానికి మంచి పేరు రాకూడదన్న దుగ్ధతో జగన్ సోయి లేకుండా మాట్లాడుతున్నాడని సొంతపార్టీ నేతలే చెవులు కొరుక్కుంటున్నారు." అని మాజీమంత్రి ప్రత్తిపాటి ఒక ప్రకటనలో ఎద్దేవా చేశారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు



వేమూరు (చైతన్యరథం): ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు వ్యాఖ్యానించారు. శుక్రవారం వేమూరు మండలంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి పెద్దఎత్తున అర్జీలు స్వీకరించారు. అర్జీలపై పూర్థిస్తాయిలో పరిశీలించి సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు మాట్లాడుతూ... ప్రజాదర్బార్ సందర్భంగా చేపట్టిన అర్జీల స్వీకరణలో అధిక భాగం రెవెన్యూ సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. వివిధ సమస్యలపై ప్రజల నుంచి వచ్చే అర్జీలను, వినతులను సత్వరం పరిష్కరించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అధికారులను ఆదేశించామని ఆనందబాబు తెలిపారు. కూటమి పాలనలో రాష్ట్ర ప్రజలు సంతోషంగా ఉన్నారని, ఏడాదిన్నర పాలనలో 95 శాతం హామీలు అమలు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో వేమూరు మండలానికి చెందిన కూటమి నాయకులు, పార్టీ కార్యకర్తలు, గ్రామ / మండల స్థాయి ప్రజాప్రతినిధులు సంబంధిత ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారమే లక్ష్యం

### చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని వెల్లడి



చంద్రగిరి, (చైతన్యరథం): తిరుపతి రూరల్ మండలంలో రఘునాథ రిసార్ట్స్‌లోని చంద్రగిరి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే పులివర్తి నాని ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ కార్యాలయానికి సమస్యలతో వచ్చిన ప్రజల నుండి అర్జీలు స్వీకరించి, సమస్యను విన్నారు. ముఖ్యంగా రెవెన్యూ సమస్యలు, హౌసింగ్, పెన్షన్ వంటి సమస్యలు వచ్చాయి. ఆ వినతి పత్రాలను ఆయా మండలాలకు సంబంధించిన అధికారులకు అందజేసి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశిస్తానని ఎమ్మెల్యే తెలిపారు. చంద్రగిరి నియోజకవర్గంలో చాలా రెవెన్యూ సమస్యలు ఉన్నాయి. గత వైసీపీ పాలనలో ఆ పార్టీ నాయకులు భూ సమస్యలను చాలానే సృష్టించారు. ఇప్పటికే వాటిలో కొన్ని సమస్యలను తీర్చగలిగామన్నారు. మరికొన్ని ఆస్తి తగాదాలు, కోర్టు పరిధిలో ఉన్న సమస్యలు కోర్టు ద్వారా పరిష్కారం అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజలు, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పలమనేరు పార్టీ కార్యాలయంలో గ్రీవెన్స్ లో పాల్గొన్న ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి



చిత్తూరు పార్టీ కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహించిన ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్

# నేను నాయకురాలిని కాదు... ప్రజాసేవకురాలిని!

### ప్రజాదర్బార్‌లో కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి వెల్లడి



కోవూరు, (చైతన్యరథం): నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారం కోసం తన ఇంటి తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పేర్కొన్నారు. కోవూరు మండలం లేగుంటపాడులో పార్టీ ఆదేశానుసారం ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఆమె ప్రజా దర్బార్ నిర్వహించి ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరించారు. కోవూరు మండల పరిధిలోని కోవూరు, ఇనుమడుగు, లేగుంటపాడు, వేగూరు, మోదెగుంట, చెర్లోపాళెం, పోతిరెడ్డిపాళెం, పాటూరు తదితర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై తమ సమస్యలను ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి గారికి వినతి పత్రాల రూపంలో అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా ఎన్నికైనప్పటి నుంచి గ్రీవెన్స్ నిర్వహిస్తూ నిత్యం వందల కొద్ది ప్రజల సమస్యలను పరిష్కరిస్తున్నానన్నారు. పార్టీ ఆదేశానుసారం ఇకపై వారానికోరోజు ప్రతి మండలంలో ప్రజాదర్బార్ నిర్వహణ ద్వారా స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. స్థానిక నాయకులు వారానికో రోజు సచివాలయ సిబ్బందితో కలిసి గ్రామ స్థాయిలో ప్రజా సమస్యల పరిష్కారానికి పాటు పడాలన్నారు. తాను నాయకురాలిని కానని ప్రజాసేవ చేసేందుకు రాజకీయాలలోకి వచ్చిన సేవకురాలినని ఆమె తన ఎన్నికల నినాదాన్ని మరో సారి గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పెన్నాడెల్టా ఛైర్మన్ జెట్టి రాజగోపాలరెడ్డి, ఎంపీపీ తుమ్మల పార్వతి, జొన్నవాడ ఆలయ ఛైర్మన్ తిరుమూరు అశోక్ రెడ్డి, టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు కొల్లారెడ్డి సుధాకర్ రెడ్డి, ఎంపీసీలు కొల్లారెడ్డి సునీల రెడ్డి, నాగరాజు, వేగూరు సర్పంచ్ అమరావతి, టీడీపీ నాయకులు కాటంరెడ్డి కృష్ణారెడ్డి, యాకసిరి వెంకటరమణమ్మ, పిచ్చుక మధుసూధనరావు పాల్గొన్నారు.



దోమల పెరుగుదల నివారణ, డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధుల నుంచి ప్రజలను రక్షించేందుకు చేపట్టిన చర్యల్లో భాగంగా కాలువల్లో స్వయంగా ఆయిల్ బాల్స్ వేస్తున్న టీడీపీ నాయకుడు ధర్మవరం సుబ్బారావు, డాక్టర్ గణేశ్ కుమార్

# కార్యకర్తల వెంటే ఎమ్మెల్యే ఇంటూరి

కందుకూరు, (చైతన్యరథం): తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు కష్టంవస్తే, ఆదుకోవడంలో ముందుంటారని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మరోసారి నిరూపించుకున్నారు. ఉలవపాడు దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి ఒంగోలు రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని ఎమ్మెల్యే నాగేశ్వరరావు రెండో రోజు కూడా పమర్శించారు. రెండు కాళ్లు విరిగి ఆపరేషన్ చేయించుకున్న రావినూతల బేబీ ప్రసన్న, ఒక కాలు విరిగిన రావినూతల లక్ష్మిలను ఆప్యాయంగా పలకరించి ధైర్యం చెప్పారు. ఆసుపత్రి డాక్టర్లతో ఎప్పటికప్పుడు మాట్లాడుతూ ట్రీట్మెంట్ గురించి తెలుసుకుంటున్నానని, అధైర్యపడవద్దని భరోసా కల్పించారు. పూర్తిగా నయమై ఇంటికి తిరిగి వెళ్లేంతవరకు, తర్వాత కోలుకునేంతవరకు తాను నిరంతరం మీ ఆరోగ్యం



గురించి వాకబు చేస్తూనే ఉంటానని ఎమ్మెల్యే చెప్పారు. అలాగే అదే ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మరో ముగ్గురిని కూడా ఎమ్మెల్యే పరామర్శించి ధైర్యం చెప్పారు. డిశ్చార్జ్ అయ్యేంతవరకు టీడీపీ నాయకులు దగ్గరుండి చూసుకుంటారని వారికి మాట ఇచ్చారు. అనంతరం ఆసుపత్రి వైద్యులతో మాట్లాడి బాధితుల ట్రీట్మెంట్ వివరాలు తెలుసుకున్నారు.

# స్వచ్ఛాంధ్ర నిధుల మంజూరులో పుట్టపర్తికి ప్రాధాన్యత


### స్వచ్ఛ ఆంధ్ర మిషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ వెల్లడి



పుట్టపర్తి, చైతన్యరథం): ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి విచ్చేసిన స్వచ్ఛ ఆంధ్ర మిషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి రామ్‌కు ఎమ్మెల్యే పల్లె సింధురా రెడ్డి, మాజీమంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయనకు మాజీమంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి చేతుల మీదుగా భగవాన్ సత్య సాయి బాబా చిత్రపటాన్ని బహూకరించి శాలువాతో సత్కరించారు. అనంతరం అక్కడి నుంచి పుట్టపర్తి మున్సిపాలిటీలో జరుగుతున్న అభివృద్ధి పనులను స్వచ్ఛంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభిరామ్ తో పాటు మాజీమంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ క్రాంతికుమార్ డిఈ నరసింహామూర్తి పరిశీలించారు. కర్ణాటక నాగేపల్లి బ్రిడ్జ్ వద్ద నూతనంగా ఏర్పాటు చేస్తున్న కూరగాయల మార్కెట్ వద్ద స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నిధులతో మరుగుదొడ్లు మంజూరు చేస్తామని కొమ్మారెడ్డి హామీ ఇచ్చారు. కూరగాయల వేస్ట్, చెత్తను సేంద్రియ ఎరువులు తయారుచేసే కేంద్రాన్ని మంజూరు చేస్తామని తెలిపారు. ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రమైన పుట్టపర్తి మున్సిపాలిటీలో పరిశుభ్రతకు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చి తగిన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ కాంత్ కుమార్‌కు సూచించారు. పుట్టపర్తి అభివృద్ధికి స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ నిధులు మంజూరుకు తన సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులు కూటమి పార్టీల నాయకులు బోయ రామాంజనేయులు, సామ కోటి ఆదినారాయణ గంగాధర్ నాయుడు, మండల కన్వీనర్లు వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ ఒలిపి శ్రీనివాసులు, రాష్ట్ర డైరెక్టర్ కాలే నాయక్, సింగల్ విండో అధ్యక్షులు విజయ్ కుమార్, గోపాల్ రెడ్డి, కన్వీనర్లు జయచంద్ర, మల్లి తదితరులు పాల్గొన్నారు.

# సీఎం చంద్రబాబు చొరవతో దొనకొండకు మహర్దశ

### దర్శి తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి



దర్శి, (చైతన్యరథం): దొనకొండను పారిశ్రామిక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు జరుగుతున్న కృషికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు దర్శి తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి కృతజ్ఞతలు తెలిపారు. గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలుసుకొని తుఫాన్ నష్ట నివారణ చర్యలు రోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి అవసరమైన నిధులు తదితర అంశాలపై చర్చించారు. దర్శి నియోజకవర్గంలోని వెనుకబడిన దొనకొండ ప్రాంతంలో ఆర్డీఎస్ పరిశ్రమను స్థాపించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. వెనుకబడిన దొనకొండ ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకునేందుకు ఇది మంచి అవకాశంగా కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తీసుకున్న చొరవకు ఆమె ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. దొనకొండలో వలసలు నివారించేందుకు ఇది ఎంతో మేలు చేస్తుందన్నారు. యుద్ధ ఆయుధాలకు అవసరమైన సామాగ్రిని తయారు చేసే పరిశ్రమను దొనకొండలో స్థాపించడం ఆనందదాయకమన్నారు .దర్శి పట్టణంలో డిగ్రీ కాలేజీ నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు కు సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారన్నారు. అదేవిధంగా ఇటీవల తుఫాన్ బీభత్సానికి దర్శి ప్రాంతంలో జరిగిన పంట నష్టం, అదేవిధంగా ప్రభుత్వ ఆస్తుల నష్టాలపై సీఎం చంద్రబాబుకు నివేదిక అందజేశారు. కూటమి 18 నెలల పాలనపై ప్రజలలో ఉన్న ఆనందాన్ని సీఎం చంద్రబాబుకు వివరించారు.

# ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి వెల్లడి**



కోడుమూరు, (చైతన్యరథం): తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి ఆదేశాల మేరకు శుక్రవారం కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి తన నివాసంలో నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో నియోజకవర్గం నలుమూలల నుంచి విచ్చేసిన వివిధ వర్గాల ప్రజల నుంచి వచ్చిన సమస్యలపై ఎమ్మెల్యే ప్రత్యక్షంగా అర్జీలు స్వీకరించారు. అర్జీలను పరిశీలించి సంబంధిత అధికారులతో ఫోన్‌లోనే మాట్లాడి కొన్ని సమస్యలకు తక్షణ పరిష్కారం అందించారు. మరికొన్ని సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించేందుకు హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి పూర్తిగా కట్టుబడి ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

# ఆలూరులో ప్రజాదర్బార్ విజయవంతం

**ఆలూరు టీడీపీ ఇంచార్జ్ వైకుంఠం జ్యోతి**



ఆలూరు, (చైతన్యరథం): ఆలూరు టీడీపీ ఇంచార్జ్ వైకుంఠం జ్యోతి ఆధ్వర్యంలో ఆలూరు నియోజకవర్గంలోశుక్రవారం ప్రజా సమస్యల పరిష్కారం లక్ష్యంగా నిర్వహించిన 'ప్రజా దర్బార్' కార్యక్రమం విజయవంతంగా జరిగింది. ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సమస్యలను నేరుగా ఆలూరు టీడీపీ ఇంచార్జ్ వైకుంఠం జ్యోతికి విన్నవించుకున్నారు. జ్యోతి ప్రతి సమస్యను ఓపికగా ఆలకించి, పరిష్కారం దిశగా అధికారులకు తక్షణమే తగిన సూచనలు జారీ చేశారు. ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకున్న ఆలూరు నియోజకవర్గ ప్రజలందరికీ ధన్యవాదాలు తెలిపారు. "ప్రజాసేవలో తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందని జ్యోతి పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారమే తమ ధ్యేయమని మీడియాతో మాట్లాడుతూ వెల్లడించారు. ప్రతీ శుక్రవారం నిర్వహించే ఈ 'ప్రజా దర్బార్' కార్యక్రమాన్ని ప్రజలంతా తప్పక వినియోగించుకోవాలి." అని పిలుపునిచ్చారు.

# ఆదోనిలో 'ప్రజా దర్బార్' ఘనవిజయం!

**ఆలూరు టీడీపీ ఇన్చార్జి కే మీనాక్షి నాయుడు**




ఆదోని, (చైతన్యరథం): తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే కే మీనాక్షి నాయుడు ఆధ్వర్యంలో ఆదోని నియోజకవర్గంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహించిన 'ప్రజా దర్బార్' కార్యక్రమం విజయవంతమైంది. ఉదయం మొదటి నుంచే ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై తమ గ్రామాల, వార్డుల సమస్యలను నేరుగా మీనాక్షి నాయుడుకి తెలియజేశారు. ప్రజల నుంచి అందిన అర్జీలలో రెవెన్యూ శాఖకు సంబంధించిన ఆర్‌ఓఆర్, అడంగల్, సర్వే అంశాలపై ఎక్కువగా అర్జీలు వచ్చాయి, అందిన అన్ని అర్జీలను సంబంధిత అధికారులకు పంపించి, పరిష్కారం దిశగా వారికి సూచనలు ఇచ్చి, ప్రతి అర్జీ స్టేటస్‌ను నిరంతరం తెలుసుకుంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మీనాక్షి నాయుడు హామీ ఇచ్చారు. ప్రతి సమస్యను ఓపికగా ఆలకించి, ప్రజలకు భరోసా కలిగించేలా వ్యవహరించారు. తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ ప్రజలతోనే ఉంటుంది. సమస్యల పరిష్కారం కోసం ప్రతి శుక్రవారం 'ప్రజా దర్బార్' నిర్వహించడం మా బాధ్యతగా భావిస్తున్నాం. ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడమే తమ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మా ఉమాపతి నాయుడు, ఏపీ కురుబ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప, యువ నాయకులు సిద్ధార్థ నాయుడు, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ రామకృష్ణ, బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ రామాంజనేయులు, బసాపురం రామస్వామి, మండల పార్టీ అధ్యక్షుడు శివప్ప,యువ నాయకులు సిద్ధార్థ నాయుడు, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్ చౌదరి, అయ్యాన్న, వీరేష్, మల్లికార్జున పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికి నిరంతర కృషి

**ప్రజాదర్బార్‌లో పాల్గొన్న మంత్రి ఎన్ఎండీ ఫరూక్**

నంద్యాల, (చైతన్యరథం): రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ నంద్యాల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన "ప్రజా దర్బార్" కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రజల సమస్యలను నేరుగా స్వీకరించి, తక్షణ పరిష్కారం కోసం సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఎటువంటి జాప్యం ఉండకూడదని మంత్రి స్పష్టం చేశారు. నంద్యాల నియోజకవర్గ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వం తెలుగుదేశం పార్టీ తరపున నిరంతర కృషి చేస్తామని ఆయన తెలిపారు.



# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

**ప్రజాదర్బార్‌లో మ్మెల్యే ఎమ్మెస్ రాజు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి వెల్లడి**

మడకశిర, (చైతన్యరథం): మడకశిర పట్టణం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామిపాల్గొన్నారు. వివిధ సమస్యల పట్ల అర్జీలు రాసుకుని వచ్చిన ప్రజల దగ్గర నుంచి స్వీకరించి వారి సమస్యలను త్వరగా పూర్తిచేసే విధంగా చూస్తామన్నారు. ప్రజలు రెవెన్యూ సమస్య వన్ బి, పట్టాదారు పాసుపుస్తకం, వృద్ధాప్య పెన్షన్, ప్రభుత్వ ఇళ్లు, స్థలాల కోసం అర్జీలు ఎక్కువగా వచ్చాయి. ప్రజలు ఇచ్చిన అర్జీలను స్వీకరించి వారి సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులకు అర్హులైన వారందరి సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్లు సింగల్ విండో అధ్యక్షులు అనే అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



# ప్రజలను ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ పదేపదే తిప్పుకోవద్దు

**అధికారులకు పుట్టపర్తి ఎమ్మెల్యే సింధూర, మాజీమంత్రి రఘునాథరెడ్డి పిలుపు**

పుట్టపర్తి, (చైతన్యరథం): పుట్టపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ప్రజా గ్రీవెన్స్‌కు భారీ సంఖ్యలో హాజరైన ప్రజలు తమ సమస్యలతో అర్జీలు సమర్పించారు. రెవిన్యూ, విద్యుత్, నూతన గృహాలు, పింఛన్లు మంజూరు చేయాలని ఎక్కువ మంది విన్నవించుకున్నారు. ఇందులో రెవిన్యూ పరంగా అన్నదమ్ముల ఆస్తి వివాదాలు ఎక్కువగా ఉన్నాయి. ప్రజలు ఇచ్చిన అర్జీలకు తక్షణం పరిష్కారం చూపాలని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి అధికారులను ఆదేశించారు. ఒకే సమస్యపై అర్జీదారుడు పదేపదే ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిప్పుకోవడం మంచిది కాదని, ఎందుకు పరిష్కారం కాలేదో వాటికి వాస్తవ కారణాలు తెలియజేయాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో కానీ నియోజకవర్గ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో నిర్వహించే ప్రజా



గ్రీవెన్స్ ను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని తక్షణం ఆ సమస్యలకు పరిష్కారం చూపాలని తెలిపారు. ప్రజా గ్రీవెన్స్ సమస్యలపై నిర్లక్ష్యం చేస్తే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని ఎమ్మెల్యే హెచ్చరించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యల పై ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించి అధికారులతో మాట్లాడి వాటికి పరిష్కార మార్గం చూపారు. అర్హత కల్గిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అమలు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి వెల్లడించారు. మాజీమంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ నెలలో ప్రతి శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి అర్జీల స్వీకరణ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలు ఇచ్చిన సమస్యల పై అధికారులు తక్షణమే వాటికి పరిష్కారం చూపాలని కోరారు. రెవిన్యూ పరంగా ఎక్కువగా ఆస్తి విషయాల్లో సమస్యలు ఉన్నాయని వీటిని అన్నదమ్ములు కూర్చొని శాంతియుతంగా మాట్లాడుకుంటే వాటికి శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. దర్బార్‌లో ప్రభుత్వ అధికారులు మండల పార్టీ కన్వీనర్లు పాల్గొన్నారు.

# దేశమంతా వందేమాతర గీతాలాపన



## కార్యక్రమాన్ని ప్రారంభించిన ప్రధాని మోదీ

స్వాతంత్య్ర ఉద్యమంలో కోట్ల మంది భారతీయుల్లో స్ఫూర్తి నింపిన 'వందేమాతరం' గేయానికి శుక్రవారంతో 150 ఏళ్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా ఏడాది పొడవునా కార్యక్రమాలు నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ కార్యక్రమాలను ఢిల్లీలోని ఇందిరా గాంధీ ఇండోర్ స్టేడియంలో శుక్రవారం ప్రధాని మోదీ ప్రారంభించారు. వేడుకల్లో భాగంగా ఉదయం బహిరంగ ప్రదేశాల్లో వందేమాతరం గేయాలాపన చేశారు. అన్ని వర్గాల ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వందేమాతరం గేయాన్ని నవంబరు 7, 1875న బంకించంద్ర ఛటర్జీ రచించారు. ఈ గేయం.. తొలిసారి ఛటర్జీ రాసిన ఆనంద్ మఠ్' నవలలో ప్రచురితమైంది. అనంతరం ప్రధాని మోదీ స్మారక స్టాంపు. నాణేన్ని కూడా విడుదల చేశారు. సామూహిక గేయాలాపనలో ప్రధాని కూడా పాల్గొని పాడారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి గజేంద్రసింగ్ షెకావత్ మాట్లాడారు. "దేశవ్యాప్తంగా వందేమాతరం సామూహిక గేయాలాపన జరుగుతోంది. చిన్న ఘటనకు ప్రేరణగా బంకించంద్ర ఛటర్జీ వందేమాతరం గేయం రచించారు. ఆయన కలెక్టర్‌గా పనిచేసినప్పుడు బరంపురంలో ఆయన వాహనాన్ని అడ్డుకున్నారు. ఆంగ్లేయులు క్రికెట్ ఆడుతున్నారని ఆయన్ను ఆపారు" అని మంత్రి వెల్లడించారు.



## కోల్‌కతా ఎంపీకి సైబర్ నేరగాళ్ల టోకరా

ఏకంగా ఓ పార్లమెంట్ సభ్యుడినే సైబర్ నేరగాళ్లు బురిడీ కొట్టించారు. ఆయన ఖాతా నుంచి రూ.56 లక్షలు దోచేశారు. నకిలీ కేవైసీతో వారు ఈ నేరానికి పాల్పడ్డారు. జాతీయ తృణమూల్ కాంగ్రెస్ నేత, పార్లమెంట్ సభ్యుడు కల్యాణ్ బెనర్జీ సైబర్ నేరగాళ్ల చేతికి చిక్కారు. పశ్చిమబెంగాల్ రాజధాని కోల్‌కతాలో ఉన్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంక్ బ్రాంచ్ ఖాతా నుంచి డబ్బు దోచేశారు. దీనిపై బ్యాంకు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. బెనర్జీ ఖాతాకు సంబంధించిన కేవైసీని అప్డేట్ చేయడానికి మోసగాళ్లు నకిలీ పాన్, ఆధార్ కార్డులను ఉపయోగించారు. ఖాతాలకు లింక్ అయిన రిజిస్టర్డ్ మొబైల్ నంబర్‌ను మార్చేశారు. ఈ వివరాలన్నీ మారిన తర్వాత ఇంటర్నెట్ బ్యాంకింగ్ సదుపాయం ద్వారా పలుమార్లు లావాదేవీలు నిర్వహించారు. మొత్తం రూ.56 లక్షలు కాజేశారు. వాటిని వేర్వేరు ఖాతాలకు బదిలీ చేసి, బంగారం కొనుగోలు చేసినట్లు సమాచారం. కొంతమొత్తాన్ని ఏటీఎంల ద్వారా విత్‌డ్రా చేసుకున్నారని తెలుస్తోంది. అయితే సైబర్ నేరగాళ్ల బారిన పడిన ఖాతా కొంతకాలంగా యాక్టివ్‌లో లేదు. కల్యాణ్ బెనర్జీ ఎమ్మెల్యేగా ఉన్న (2001 నుంచి 2006) సమయంలో దానిని ఓపెన్ చేశారని, చట్టసభ సభ్యుడిగా అయనకు వచ్చిన వేతనం అందులోనే క్రెడిట్ అయిందని జాతీయ మీడియా కథనాలను బట్టి తెలుస్తోంది. ఆ తర్వాత నుంచి యాక్టివ్‌గా లేని ఖాతాలో ఇటీవల కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. దీనిని గుర్తించిన ఎంపీ వెంటనే బ్యాంకు అధికారులను అప్రమత్తం చేయడంతో వారు సైబర్ క్రైమ్ కింద ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంపై దర్యాప్తు జరుగుతోందని కోల్‌కతా సైబర్ క్రైమ్ విభాగానికి చెందిన ఉన్నతాధికారి మీడియాకు వెల్లడించారు.

## పాకిస్థాన్‌కు అలాంటి అలవాటు మామూలే : భారత విదేశాంగశాఖ ప్రతినిధి రణధీర్ జైశ్వాల్

ప్రపంచంలో అణ్వాయుధాలను పరీక్షిస్తున్న దేశాల్లో పాకిస్థాన్ కూడా ఉందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల చేసిన వ్యాఖ్యలపై భారత్ స్పందించింది. ఆ వ్యాఖ్యలను నిశితంగా పరిశీలిస్తున్నామని తెలిపింది. రహస్యంగా, చట్టవిరుద్ధంగా అణు కార్యకలాపాలు కొనసాగించడంలో పాకిస్థాన్‌కు దశాబ్దాల చరిత్ర ఉందని స్పష్టం చేసింది. స్మగ్లింగ్, ఎగుమతి నియంత్రణ ఉల్లంఘనలు, రహస్య భాగస్వామ్యాలు దశాబ్దాలుగా పాకిస్థాన్‌కు అలవాటేనని, ఏకే ఖాన్ నెట్‌వర్క్ విస్తరణ చుట్టూ ఇది కేంద్రీకృతమైందని భారత విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ పేర్కొన్నారు. ఈ అంశాలను అంతర్జాతీయ సమాజం దృష్టికి భారత్ ఎల్లప్పుడూ తీసుకెళ్తూనే ఉంటుందన్నారు. వచ్చే ఏడాది భారత్‌లో పర్యటిస్తానని ట్రంప్ చేసిన ప్రకటన గురించి అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ, దీనిపై ప్రస్తుతానికి తమకు ఎటువంటి సమాచారం లేదన్నారు. ప్రపంచంలో చాలా దేశాలు చురుగ్గా అణ్వాయుధాలను పరీక్షిస్తున్నాయని, ఆ జాబితాలో పాకిస్థాన్ ఉందని అమెరికా అధ్యక్షుడు ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. రష్యా, చైనా, ఉత్తరకొరియా, పాకిస్థాన్ వంటి దేశాలు అణు పరీక్షలను నిర్వహిస్తున్నాయని, వాళ్లెవ్వరూ ప్రశ్నించరని అన్నారు. తాము మాత్రం బహిరంగంగానే చెబుతామన్నారు. ఇన్నాళ్లూ ఎన్ని దేశాలు అణు పరీక్షలు చేపట్టినా వాటి జోలికి వెళ్లలేదని, ఇకపై అలా మిగిలిపోవాలనుకోవట్లేదని అన్నారు. ఇతర దేశాల మాదిరిగానే తామూ అణు పరీక్షలు నిర్వహిస్తామని ట్రంప్ స్పష్టం చేసిన విషయం తెలిసిందే.



# బంగారు బల్లుల తాపడాలు మారలేదు

## కాంచీపురం ఆలయ యాజమాన్యం స్పష్టీకరణ

తమిళనాడులోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కాంచీపురంలోని వరదరాజ పెరుమాళ్ ఆలయంలో బల్లుల విగ్రహాలకు ఉన్న తాపడాలను మార్చినట్లు ఫిర్యాదు అందడం తీవ్ర చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. దీనిపై తాజాగా ఆలయ యాజమాన్యం స్పందిస్తూ ఆరోపణలను తోసిపుచ్చింది. ఆ విగ్రహాల్లో ఎలాంటి మార్పు లేదని స్పష్టం చేసింది. "ఆలయంలోని బంగారు, వెండి బల్లుల విగ్రహాలు సీలింగుకు అలాగే ఉన్నాయి. వాటిని తొలగించడం గానీ, తాపడాలను మార్చడం గానీ చేయలేదు. దీనిపై ఆలయాల ఉద్యమకారుడు తప్పుడు, నిరాధార ఆరోపణలు చేశారు. ఆయనపై న్యాయపరమైన చర్యలు తీసుకోవాలని నిర్ణయించాం" అని ఆలయ ఎగ్జిక్యూటివ్ అధికారి శుక్రవారం వెల్లడించారు. కాంచీపురంలోని వరదరాజ పెరుమాళ్ ఆలయంలో ప్రస్తుతం పునరుద్ధరణ పనులు జరుగుతున్నాయి. ఈ సమయంలో ఆలయంలోని పురాతన బంగారు, వెండి బల్లుల తాపడాలను మార్చేసి వాటి స్థానంలో కొత్త తాపడాలను ఏర్పాటుచేశారని శ్రీరంగానికి చెందిన రంగరాజ నరసింహ ఫిర్యాదు చేశారు. దీంతో విగ్రహాల అక్రమ తరలింపు నిషేధ విభాగం పోలీసులు దీనిపై దర్యాప్తు చేపట్టారు. ఈనేపథ్యంలో బుధవారం ఆలయ ఈవో రాజ్యలక్ష్మిని పోలీసులు 8 గంటల పాటు విచారించారు. ఆలయంలోని ఇతర సిబ్బందిని కూడా ప్రశ్నించారు. ప్రస్తుతం ఈ కేసు దర్యాప్తు కొనసాగుతోంది. అవసరమైనప్పుడు విచారణకు రావాలని ఆలయ ఈవో, సిబ్బందిని ఆదేశించినట్లు తెలిసింది. 108 దివ్య క్షేత్రాల్లో ఒకటైన కాంచీపురంలోని ఈ ప్రసిద్ధ వరదరాజస్వామి ఆలయంలో బంగారు, వెండి బల్లులు విశిష్టమైనవి. నిత్యం ఈ ఆలయాన్ని దేశం నలుమూలల నుంచి వచ్చే భక్తులు దర్శించుకుంటారు. ఇక్కడి బంగారు, వెండి బల్లులను తాకితే దోషనివారణ జరుగుతుందని నమ్మకం.

# ఆకాశ ప్రయాణానికి సైబరాఘాతం

## సాంకేతిక కారణాలతో వందలాది విమానాల నత్తనడక, 300 విమానాలపై ప్రభావం, దిద్దుబాటు చర్యల్లో సాంకేతిక బృందాలు

ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో రెండు, మూడు రోజులుగా సాంకేతిక సమస్యతో వందలాది విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి. ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ వ్యవస్థలో సమస్యే దీనికి కారణంగా భావిస్తున్నారు. సమస్యను పరిష్కరించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నప్పటికీ.. సైబర్ దాడే దీనికి కారణమా! అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఏటీసీ అటోమేషన్ వ్యవస్థలోకి మాల్వేరు చొరబాటు వల్లే ఈ సమస్య తలెత్తిందా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ డేటాకు అనుసంధానంగా ఉండే ఆటోమేటిక్ మెసేజ్ స్విచింగ్ సిస్టమ్‌లో సాంకేతిక సమస్య వల్లే అంతరాయం ఏర్పడిందని ఎయిర్పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా పేర్కొంది. దీన్ని పరిష్కరించేందుకు సాంకేతిక బృందాలు ప్రయత్నిస్తున్నట్లు తెలిపింది. ఢిల్లీ ఎయిర్‌పోర్టు యాజమాన్యం కూడా ఇదే విషయాన్ని వెల్లడిస్తూ సామాజిక మాధ్యమంలో పోస్టు చేసింది. ఈ నేపథ్యంలో ఎయిర్పోర్టు టెర్మినళ్ల లోపల, బోర్డింగ్ గేట్ల వద్ద భారీ సంఖ్యలో ప్రయాణికులు క్యూలో వేచి చూడాల్సి వస్తోంది.

### మాల్వేర్ చొరబాటు..?

ఈ సాంకేతిక సమస్య కారణంగా విమానాల రాకపోకల అప్డేట్లను ఏటీసీ ఆటోమేటిగ్గా పొందలేకపోతున్నట్లు తెలిసింది. దీంతో ఏటీసీ ఆటోమేషన్ వ్యవస్థలో వైఫల్యం చోటుచేసుకుందా? అన్న కోణంలో




సంబంధిత విభాగాలు దర్యాప్తు మొదలుపెట్టాయి. మాల్వేర్ చొరబాటును సాఫ్ట్వేర్ సాయంతో గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. సిస్టమ్లో కొన్ని కీలక అప్డేట్లు లేవని, ఎప్పటికప్పుడు బ్యాకప్ వ్యవస్థ కూడా కనిపించలేదని గుర్తించినట్లు సమాచారం. అయితే, ఇవన్నీ ప్రాథమిక అంచనాలేనని, పూర్తి కారణాలను విశ్లేషిస్తున్నట్లు సంబందిత అధికారులు చెప్పినట్లు పలు జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. మరోవైపు, ఈ సైబర్‌దాడి జరిగినట్లు వస్తున్న వాదనను ప్రభుత్వవర్గాలు తోసిపుచ్చినట్లు తెలుస్తోంది.

### 300 విమానాలపై ప్రభావం

ఢిల్లీ ఎయిర్ పోర్టు దేశంలోనే అత్యంత రద్దీ విమానాశ్రయం. ఇక్కడ నుంచి నిత్యం దాదాపు 1500లకు పైగా విమానాలు రాకపోకలు సాగిస్తాయి. కొన్ని రోజులుగా ఇక్కడి విమాన ప్రయాణాలకు తరచూ అంతరాయం కలుగుతోంది. విమాన నావిగేషన్ వ్యవస్థపై ప్రభావితం చూపే జీపీఎస్ స్పూఫింగ్ ఇందుకు కారణనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఊహించని విధంగా ఎయిర్ ట్రాఫిక్ పెరగడంతో అనేక విమానాలను దారి మళ్లించాల్సి వస్తోంది. శుక్రవారం ఒక్కరోజే 300లకు పైగా దేశీయ, అంతర్జాతీయ సర్వీసులపై ప్రభావం పడింది.

### ఏమిటీ జీపీఎస్ స్పూఫింగ్?

నేవిగేషన్ వ్యవస్థను ప్రభావితం చేసి నకిలీ జీపీఎస్ ద్వారా విమానాలను దారి మళ్లించే ప్రక్రియను జీపీఎస్ సిగ్నల్ స్పూఫింగ్‌గా వ్యవహరిస్తారు. నిజమైన శాటిలైట్ సిగ్నల్స్ ను అడ్డుకొని ఆ స్థానంలో నకిలీ సంకేతాలను పంపి జీపీఎస్ రిసీవర్ను తప్పుదోవ పట్టిస్తాయి. ఫలితంగా... ప్రస్తుతమున్న ప్రదేశం, సమయాన్ని తప్పుగా చూపించేలా చేస్తాయి. పౌర విమానాలే లక్ష్యంగా అంతర్జాతీయ రూట్లలో ఇటీవల ఇలాంటివి చోటుచేసుకుంటున్నాయి. ఈ ఘటనలపై ఆందోళనలు వ్యక్తమవుతున్న వేళ మన దేశంలోనూ ఇవి ప్రభావం చూపడం ఆందోళన కలిగించే విషయమే.




# డయాబెటిస్.. ఒబెసిటీ..

### అమెరికా వీసాకు అడ్డంకులే!

### కొత్త నిబంధనలు తెచ్చిన ప్రపంచ పెద్దన్న

వలసలను నియంత్రించేందుకు నిబంధనలను కఠినతరం చేస్తోన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. మరో కొత్త రూల్ తెచ్చారు. డయాబెటిస్, ఒబెసిటీవంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారికి వీసాలను తిరస్కరించాలనే ఈ నిబంధనలపై అమెరికా ఎంబసీలు, కాన్సులర్ కార్యాలయాలకు అగ్రరాజ్య విదేశాంగ శాఖ తాజాగా మార్గదర్శకాలు జారీ చేసినట్టు అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. సాధారణంగా అమెరికా వీసా కోసం దరఖాస్తు చేసుకునే వారి ఆరోగ్యస్థితిని ఇమిగ్రేషన్ అధికారులు పరిశీలిస్తారు. ఈ నిబంధనలను తాజాగా సవరించారు. మరిన్ని వ్యాధులను జాబితాలో చేరుస్తూ మార్గదర్శకాలు రూపొందించారు. అంటే, ఇకపై వీసా కోసం దరఖాస్తు చేసుకున్న వలసదారుల మెడికల్ హిస్టరీపై అధికారులు మరింత దృష్టి సారించనున్నారన్నమాట. వారు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నారా? వారిని అమెరికాలోకి అనుమతిస్తే ప్రభుత్వ ఖజానాపై అదనపు భారం పడనుందా? అనే అంశాలను పరిగణనలోకి తీసుకుని వీసా జారీపై నిర్ణయం తీసుకోనున్నట్టు తెలుస్తోంది. ప్రభుత్వ వనరులపై అదనపు భారంపడే అవకాశమున్న దరఖాస్తుదారులను అమెరికాలోకి రానివ్వకుండా వీసాను తిరస్కరించేలా నిబంధనలను కఠినతరం చేసినట్టు సమాచారం.

“దరఖాస్తుదారుల ఆరోగ్యాన్ని కచ్చితంగా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. హృద్రోగ సమస్యలు, శ్వాస సంబంధిత వ్యాధులు, క్యాన్సర్, డయాబెటిస్, జీవక్రియ, నాడీ సంబంధిత వ్యాధులు, మానసిక ఆరోగ్య సమస్యలతో బాధపడేవారిని సంరక్షించాలంటే లక్షల డాలర్లు ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఇక, ఒబెసిటీ కారణంగా ఆస్తమా, స్లీప్ అప్నియా, హైబీపీవంటి సమస్యలు ఎదురవుతాయి. ఇలాంటి వ్యాధిగ్రస్తులకు సుదీర్ఘ వైద్య సంరక్షణ అవసరం. ఆర్థిక భారం కూడా ఎక్కువే. అందుకే వలసదారుల ఆరోగ్య పరిస్థితిని అంచనావేసి వారు ప్రభుత్వ వనరులపై ఆధారపడుతారో లేదో గుర్తించాలి. ఒకవేళ అలాంటి వారైతే అమెరికాలోకి ప్రవేశాన్ని తిరస్కరించాలి” అని ఆ మార్గదర్శకాల్లో వెల్లడించారు. అంతేకాదు.. ఒకవేళ వలసదారులు అమెరికా ప్రభుత్వ సాయం లేకుండా వైద్య చికిత్సలను సొంతంగా భరించగలరా లేదా? అన్నది కూడా నిర్ధారించుకోవాలని వీసా అధికారులను ఆదేశించారు. ఇక, కుటుంబసభ్యుల ఆరోగ్యాన్ని కూడా పరిశీలించాలని స్పష్టం చేశారు. అయితే, ఈ వార్తలపై అమెరికా విదేశాంగ శాఖ స్పందించలేదు. దీంతో ఈ రూల్స్ అమల్లోకి వచ్చాయా? లేదా అన్నదానిపై స్పష్టత లేదు.

ఇప్పటికే వలసదారులకు సంబంధించి అమెరికా యంత్రాంగం కఠిన విధానాలను అమలు చేస్తోన్న సంగతి తెలిసిందే. విదేశీ విద్యార్థులు, ఎక్స్ఛేంజీ విజిటర్ల ‘డ్యురేషన్ ఆఫ్ స్టే’పై పరిమితి విధించడం, హెచ్-1బీ వీసాపై వార్షిక రుసుమును లక్ష డాలర్లకు పెంచుతూ తీసుకున్న నిర్ణయాలు వలసదారులను ఆందోళనకు గురిచేశాయి.

# రహస్యంగా బికెన్ బెన్?

**- సీక్రెట్‌గా స్కూల్ నడిపిన వివాదంలో జుకర్‌బర్గ్**

**- పాఠశాలను మూయించామన్న అధికారులు..**

**- కాదు, మరోచోటికి మార్చామంటున్న మెటా ప్రతినిధి**




మెటా అధినేత మార్క్ జుకర్‌బర్గ్ వివాదంలో చిక్కుకున్నారు. అనుమతుల్లేకుండా నాలుగేళ్లపాటు ఇంట్లో రహస్యంగా స్కూల్ నడుపుతున్నట్టు ఆయనపై ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఇవి కాస్తా వివాదాస్పదం కావడంతో చివరకు ఆ స్కూల్‌ను అధికారులు మూసివేయించినట్టు తెలుస్తోంది. ఈమేరకు అంతర్జాతీయ కథనాలు వెల్లడించాయి. కాలిఫోర్నియాలోని పాలో ఆల్టో సిటీలోని తన సువిశాల కాంపౌండ్‌లో జుకర్‌బర్గ్ ఈ స్కూల్‌ను 2021లో ప్రారంభించినట్టు కథనాలు పేర్కొన్నాయి. ‘బికెన్ బెన్ స్కూల్’ పేరిట మాంటిస్సోరీ పద్ధతిలో 30-40 విద్యార్థులకు అక్కడ బోధన అందించారట. తొలుత పాఠశాల నడుపుతున్నారన్న విషయం ఎవరికీ తెలియదు. కానీ, రోజూ ఉదయం వీధిలోకి వరుసగా కార్లు రావడం.. జుకర్‌బర్గ్ నివాసం వద్ద చిన్నారులను దింపి వెళ్లడాన్ని స్థానికులు గుర్తించారు. మొదట ఆశ్చర్యపడిన స్థానికులు.. తర్వాత మెటా అధినేత తన ఇంట్లో పూర్తిస్థాయిలో స్కూల్ నిర్వహిస్తోన్న విషయాన్ని గ్రహించారు. 2022లో దీనిపై స్థానిక అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో.. కొన్ని నెలలపాటు నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. నిబంధనలను ఉల్లంఘించి జుకర్‌బర్గ్ స్కూల్‌ను నడుపుతున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. చివరకు 2024లో అధికారికంగా దీనిపై ఫిర్యాదు వచ్చింది. దీంతో అధికారులు చర్యలు చేపట్టక తప్పలేదు. స్కూల్‌ను మూసివేయాలని.. లేదంటే న్యాయపరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని ఈ ఏడాది మార్చిలో జుకర్‌బర్గ్‌కు నోటీసులు జారీ చేశారు. దీంతో ఆగస్టులో పాఠశాలను అధికారికంగా మూసివేసినట్టు అధికారిక రికార్డుల్లో పేర్కొన్నారు. కానీ, స్కూల్‌ను పూర్తిగా మూసివేయలేదని, కేవలం మరోచోటుకు మార్చారని మెటా ఫ్యామిలీ అధికారిక ప్రతినిధి బ్రియాన్ బేకర్ చెప్పినట్టు మీడియా కథనాలు పేర్కొన్నాయి. అయితే, దాన్ని ఎక్కడకు మార్చారన్న విషయాన్ని మాత్రం బయట పెట్టలేదట. కాగా.. సిలికాన్ వ్యాలీలో జుకర్‌బర్గ్ స్థానికుల నుంచి వ్యతిరేకత ఎదుర్కోవడం ఇదే తొలిసారి కాదు. ఆయన ఎస్టేట్‌లో నిరంతరం నిర్మాణాలు జరుగుతున్నాయని, శబ్ద కాలుష్యంతో తాము ఇబ్బందులు పడుతున్నామని పదేళ్లపాటు స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో జుకర్ 11 ప్రాపర్టీలను కొనుగోలు చేశారు. వాటన్నింటినీ కలిసి ఓ సువిశాల ఎస్టేట్‌గా పునరుద్ధరించారు.

## ఎందుకంత వ్యతిరేకత?


**- పాక్ పత్రికల వైఖరిపై రష్యా ఆగ్రహం**

**- అమెరికా ప్రోత్సాహం ఉందన్న అనుమానం**

పాకిస్థాన్‌కు చెందిన ‘ది ఫ్రాంటియర్ పోస్టు’ పత్రికపై రష్యా ఆగ్రహం వ్యక్తం చేసింది. మాస్కోకు వ్యతిరేకంగా ఈ పత్రిక కథనాలు ప్రచురిస్తోందని ఆరోపించింది. ఈమేరకు పాక్‌లోని రష్యా రాయబార కార్యాలయం ఎక్స్‌లో ఓ పోస్టు పెట్టింది. ‘పాక్ ఆంగ్ల వార్తా పత్రిక ది ఫ్రాంటియర్‌లో రష్యన్ వ్యతిరేక కథనాలను మేం గమనించాం. ఈ పత్రికకు సంబంధించిన ప్రధాన కార్యాలయం వాషింగ్టన్‌లో ఉన్నందున దీన్ని పాకిస్థానీ అని పిలువలేము. పత్రిక తన సంపాదకీయంలో నిరంతరం రష్యా విదేశాంగ విధానం, నాయకత్వాన్ని విమర్శిస్తూ కథనాలు ప్రచురిస్తుంది’ అని పేర్కొంది. ఇతర దేశాల అజెండాపై కథనాలను ఎంపిక చేసే విషయంపై అమెరికనైజ్డ్ బృందం బాధ్యత వహిస్తుందని.. అది రష్యా విదేశాంగ విధానాలకు, అధ్యక్షుడు పుతిన్‌పై విమర్శకులకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఆరోపించింది. తమ దేశానికి సానుకూలంగా ఉండే ఒక్క కథనం కూడా ఈ పత్రికలో రాలేదని పేర్కొంది. అఫ్గాన్ వార్తలకు ఎక్కువ ప్రాధాన్యమిచ్చే ఈ వార్తా పత్రిక.. మాస్కో ఫార్మాట్ ఆఫ్ కన్సల్టేషన్‌ను పూర్తిగా విస్మరించడం గమనార్హం అని వెల్లడించింది. ఈ సందర్భంగా యూఎస్‌కు చెందిన ఫ్రాంటియర్ పత్రిక జర్నలిస్టులు.. రష్యా ఆర్థిక పతనం అంచున ఉన్న దుర్బల దేశంగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించింది. తమ దేశ ఆర్థికవ్యవస్థను సమర్థించింది. ఏ దేశ చరిత్రలోనూ ఇంతకుముందు లేనివిధంగా.. బయట ఒత్తిళ్లు ఎదుర్కొంటున్నా తమ ఆర్థికవ్యవస్థ స్థిరమైన పురోగతిలో ఉందని వెల్లడించింది. 2024లో రష్యా జీడీపీ 4.1శాతం పెరిగిందని పేర్కొంది.

## సముద్ర జలాల్లోకి చైనా భారీ యుద్ధనౌక

**- అమెరికాతో పోటీపడుతున్న డ్రాగన్**



నావికాదళంలో అమెరికాతో పోటీకి చైనా తన ఆయుధ సంపత్తిని విస్తరిస్తోంది. అత్యంత సామర్థ్యం కలిగిన ‘పుజియాన్’ (టైప్-003) యుద్ధనౌకను తాజాగా నావికాదళ అమ్ములపొదికి చేర్చింది. పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో చేసిన విమాన వాహన నౌకను చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ ప్రారంభించినట్లు తెలుస్తోంది. బుధవారం హైనాన్ ద్వీపంలోని సైనిక నౌకాశ్రయంలో దీనికి సంబంధించిన వేడుకలు జరిగినట్టు స్థానిక అధికార మీడియా పేర్కొంది. ఈ సందర్భంగా జిన్‌పింగ్ యుద్ధ నౌకను పరిశీలించినట్లు తెలిపింది. పుజియాన్ చైనాకు చెందిన మూడో అత్యంత అధునాతన యుద్ధ నౌక. విద్యుదయస్కాంత ఆధారిత వ్యవస్థ అయిన ఇమాల్స్‌ను ఇందులో వినియోగించారు. 316 మీటర్ల పొడవు, 80వేల టన్నుల బరువున్న ఈ పుజియాన్‌కు దాదాపు 50 విమానాలను మోసే సామర్థ్యముంది. ఈ ఎమాల్స్ వ్యవస్థను అమెరికాకు చెందిన ‘గెరాల్డ్ ఆర్ ఫోర్డ్’ శ్రేణి విమాన వాహన నౌక మాత్రమే వాడుతున్నాయి. ఇటీవల ఈ పుజియాన్ గురించి జిన్‌పింగ్ మాట్లాడుతూ.. ఇది సాయుధ దళాల ఆధునికీకరణలో కీలకమైన మైలురాయి అని అభివర్ణించారు. బీజింగుకు ఈ నౌక వ్యూహాత్మక సాధనమవుతుందని, తమ దేశ గౌరవాన్ని పెంచుతుందన్నారు. ఇదిలాఉండగా.. మరో విమాన వాహక నౌకను నిర్మించేందుకు చైనా సన్నాహాలు మొదలుపెట్టింది. టైప్-004గా ఇది రానుంది. ఇందులో ఎమాల్స్ సాంకేతికతతోపాటు అణు సామర్థ్యంతో దీన్ని నిర్మించాలని బీజింగ్ ప్లాన్ చేస్తున్నట్టు తెలుస్తోంది.

## ఒక్క ఫోన్ కాల్.. 20 నిమిషాల సమయం!

**హసీనా ప్రాణాలు కాపాడింది ఈ రెండే..**

**‘..ద స్టోరీ ఆఫ్ ఏన్ అన్‌ఫినిష్డ్ రివల్యూషన్’లో ప్రస్తావన**



బంగ్లాదేశ్‌లో అల్లర్లవేళ నాటి ప్రధాని హసీనాను ఒక ఫోన్ కాల్ కాపాడింది. భారత్‌నుంచి వచ్చిన ఫోన్ కాల్‌తో.. మూక దాడినుంచి కేవలం 20నిమిషాల వ్యవధిలో తప్పించుకొని సురక్షితంగా భారత్‌కు చేరుకున్నారు హసీనా. ఇంకా విడుదల కాని ‘ఇన్షాల్లా బంగ్లాదేశ్: ద స్టోరీ ఆఫ్ ఏన్ అన్‌ఫినిష్డ్ రివల్యూషన్’ శీర్షికతో ఉన్న పుస్తకంనుంచి ఈ విషయం వెల్లడైంది. గతేడాది బంగ్లాదేశ్‌లో రిజర్వేషన్లకు వ్యతిరేకంగా చోటుచేసుకున్న ఘర్షణలు హింసాత్మకంగా మారిన సంగతి తెలిసిందే. ఆ నిరసనల్లో వందల మంది ప్రాణాలు కోల్పోయారు. దాంతో అప్పుడు ప్రధానిగా ఉన్న షేక్ హసీనా తన పదవికి రాజీనామా చేసి దేశం దాటాల్సి వచ్చింది. ఆ ఘర్షణల్లో కొందరు నిరసనకారులు ఆమె అధికారిక నివాసం గణభవన్‌లోకి చొచ్చుకువచ్చారు. దానికి 20నిమిషాల ముందే హసీనా అక్కడినుంచి ప్రాణాలతో బయటపడ్డారు. ఆ పుస్తకంలో పేర్కొన్న ప్రకారం.. పరిస్థితులు ఎలావున్నా దేశం వీడే ప్రసక్తే లేదని హసీనా పట్టుబట్టారు. ఆమెను ఒప్పించమని సోదరి రెహానా, అమెరికాలో ఉంటున్న ఆమె కుమారుడు వాజీద్‌ను బంగ్లా ఆర్మీ చీఫ్, ఎయిర్ ఫోర్స్, నేవీ చీఫ్‌లు రంగంలోకి దింపారు. మరోవైపు ఆగ్రహంతో రగిలిపోతున్న మూకలు అధికార భవనంవైపు వేగంగా దూసుకొస్తున్నాయి. అప్పటికే హసీనా ప్రయాణించే ఏ విమానమైనా తమ గగనతలంలోకి ప్రవేశించేందుకు భారత ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. సరిగ్గా (2024, ఆగస్టు 5న) మధ్యాహ్నం ఒకటిన్నరకు భారత్‌నుంచి ఫోన్ కాల్ వచ్చింది. ఆ ఫోన్ చేసింది హసీనాతో బాగా పరిచయమున్న ఉన్నతాధికారి అని ఆ బుక్ ప్రస్తావించింది. “అదొక షార్ట్ కాల్. ఇప్పటికే చాలా ఆలస్యమైందని ఆ అధికారి హసీనాకు చెప్పారు. వెంటనే గణభవన్‌ను వీడకపోతే.. చంపేస్తారని అప్రమత్తం చేశారు. తదుపరి పోరాటం కోసం జీవించి ఉండాలి కదా అని హితవు పలికారు. ఆ మాటలకు హసీనా ఆశ్చర్యపోయారు. కానీ తన మనసు మార్చుకునేందుకు మరో అరగంట పట్టింది. కానీ ఆ సందేశాన్ని ఆమె ఎంతగానో విశ్వసించారు. అయితే దేశాన్ని వీడేముందు తన ప్రసంగాన్ని రికార్డు చేయాలని హసీనా భావించారు. ఏ క్షణమైనా మూక లోపలికి దూసుకువచ్చే అవకాశం ఉండటంతో అందుకు సైన్యాధికారులు అంగీకరించలేదు. తర్వాత హసీనాను రెహానా బలవంతంగా కారులో కూర్చోబెట్టారు. అప్పుడు దుస్తులతో ఉన్న రెండు సూట్కేసులు మాత్రమే ఆమెవెంట ఉన్నాయి. మధ్యాహ్నం 2.23 గంటలకు బంగ్లాలో టేకాఫ్ అయిన చాపర్.. అర్థగంటలోపు భారత్‌లో ల్యాండ్ అయింది. అప్పటినుంచి ఢిల్లీలో గుర్తుతెలియని ప్రాంతంలో ఆమెకు భారత్ ఆశ్రయం కల్పిస్తోంది” అని ఆ పుస్తకంలో రచయితలు పేర్కొన్నారు. ఆ రోజు ఆ కాల్ రాకపోయి ఉంటే.. ఆమె కూడా తన తండ్రి (షేక్ ముజిబుర్ రెహమాన్) వలే హత్యకు గురయ్యేవారని ఆందోళన వ్యక్తంచేశారు. 1975 ఆగస్టులో ముజిబుర్, ఆయన భార్య, ఆ దంపతుల ముగ్గురు కుమారులు వారి ఇంట్లోనే మిలిటరీ అధికారుల చేతుల్లో దారుణ హత్యకు గురయ్యారు. ఆ సమయంలో హసీనా, రెహానా విదేశాల్లో ఉండటం వల్లే ప్రాణాలతో బయటపడ్డారు.

# చెలరేగిన భారత్-ఏ పేసర్లు

- **సౌతాఫ్రికా-ఏ తొలి ఇన్నింగ్స్‌లో 221 పరుగులకు ఆలౌట్**
- **రెండో ఇన్నింగ్స్‌లో భారత్ 78/3**
- **ప్రస్తుతానికి 112 పరుగుల ఆధిక్యం**
- **రెండో అనధికార టెస్ట్**

దక్షిణాఫ్రికా-ఏ జట్టుతో జరుగుతున్న రెండో అనధికార టెస్ట్‌లో రెండో రోజు శుక్రవారం ఆట ముగిసే సరికి భారత్-ఏ జట్టు రెండో ఇన్నింగ్స్‌లో మూడు వికెట్ల నష్టానికి 78 పరుగులు చేసి 112 పరుగుల ఆధిక్యంలో నిలిచింది. క్రీజులో కేఎల్ రాహుల్ (26, 57 బంతులు), కుల్‌దీప్ యాదవ్ (0, 4 బంతులు) ఉన్నారు. ఓపెనర్ అభిమన్యు ఈశ్వరన్ రెండో ఇన్నింగ్స్‌లో కూడా డక్ అవుట్ కాగా, సాయి సుదర్శన్ 23 (38 బంతులు). దేవదత్ పడిక్కల్ 24 (42 పరుగులు) చేశారు. సౌతాఫ్రికా బౌలర్లలో ఒక్కులే సీల్ 2, టియాన్ వాన్ వూరెన్ 1 వికెట్ తీశారు.

అంతకు ముందు చెలరేగిపోయిన భారత-ఏ జట్టు పేసర్లు సౌతాఫ్రికా-ఏను తొలి ఇన్నింగ్స్‌లో 221 పరుగులకే ఆలవుట్ చేశారు. ప్రసిద్ధ కృష్ణ 3, సిరాజ్, ఆకాశీప్ చెరో 2 వికెట్లు తీసి సౌతాఫ్రికా పతనాన్ని శాసించారు. వీరి ధాటికి సౌతాఫ్రికా తొలి ఇన్నింగ్స్ 47.3 ఓవర్లలో 221 పరుగులకే ఆలౌటైంది. స్పిన్నర్లు కుల్‌దీప్ యాదవ్, హర్ష్ దూబే కూడా చెరో వికెట్ తీశారు. సౌతాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 221 పరుగులకే ఆలౌట్ కావడంతో భారత్‌కు 34 పరుగుల ఆధిక్యం లభించింది.

సౌతాఫ్రికా ఇన్నింగ్స్‌లో కెప్టెన్ అకెర్మన్ విధ్వంసకర శతకంతో ఒంటిపోరాటం చేశాడు. సహచరులు సహకరించకపోయినా ఒక్కడే ధాటిగా ఆడి స్కోరును 200 దాటించాడు. కేవలం 118 బంతుల్లోనే 17 ఫోర్లు, 5 సిక్సర్ల సాయంతో 134 పరుగులు చేశాడు. అకెర్మన్ కాకుండా సౌతాఫ్రికా ఇన్నింగ్స్‌లో జోర్డన్ హెర్మన్ (26), సుబ్రాయన్ (20) మాత్రమే రెండంకెల స్కోర్లు చేశారు. సౌతాఫ్రికా ఇన్నింగ్స్‌లో సీనియన్ టీమ్ కెప్టెన్ టెంబా బవుమా సహా నలుగురు డకౌట్లయ్యారు.

అంతకుముందు భారత్-ఏ తొలి ఇన్నింగ్స్‌లో 255 పరుగులకు ఆలౌటైంది. ధ్రువ్ జురెల్ (132) అజేయ శతకంతో ఇన్నింగ్స్‌ను నిలబెట్టాడు. 126 పరుగులకే 7 వికెట్లు కోల్పోయినప్పటికీ.. టెయిలెండర్లు కుల్‌దీప్ (20), సిరాజ్ (15) సహకారంతో టీమిండియాకు జురెల్ గౌరవప్రదమైన స్కోర్ అందించాడు. భారత ఇన్నింగ్స్‌లో సీనియర్లు కేఎల్ రాహుల్ (19), సాయి సుదర్శన్ (17), అభిమన్యు ఈశ్వరన్ (0), దేవదత్ పడిక్కల్ (5), రిషబ్ పంత్ (24) తక్కువ స్కోర్లకే ఔటై నిరాశపరిచారు.

కాగా, రెండు మ్యాచ్‌ల ఈ సిరీస్‌లో భారత్-ఏ 1-0 ఆధిక్యంలో ఉంది. తొలి అనధికార టెస్ట్‌లో భారత్ ఘన విజయం సాధించింది.



## దీప్తిని అందుకే వదిలేశాం..



*మహిళల ప్రీమియర్ లీగ్‌కు ముందు యూపీ వారియర్స్ తీసుకున్న నిర్ణయం ప్రస్తుతం అంతటా చర్చనీయాంశం అయింది. కేవలం ఒకే ఒక్క ప్లేయర్‌ను రిటైన్ చేసుకున్న యూపీ వారియర్స్ మిగతా అందరినీ వదిలేసింది. ఇందులో టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్, వన్డే ప్రపంచ కప్ 2025 విజేత దీప్తి శర్మ కూడా ఉండటం గమనార్హం. మహిళల ప్రపంచ కప్- 2025లో భారత్ విశ్వవిజేతగా నిలవడంలో టీమిండియా స్టార్ ఆల్ రౌండర్ దీప్తి శర్మ కీలక పాత్ర పోషించింది. సౌతాఫ్రికాతో జరిగిన ఫైనల్ మ్యాచులో దీప్తి శర్మ 58 పరుగులు చేయడంతో పాటు.. ఐదు వికెట్లు తీసింది. టోర్నీ ఆసాంతం మంచి ప్రదర్శన కనబరిచి ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్‌గా దీప్తి శర్మ నిలిచింది. దీంతో దేశ వ్యాప్తంగా సినీ, రాజకీయ ప్రముఖుల నుంచి ఆమెకు ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో యూపీ వారియర్స్ ఆమెను వదిలేయటంపై అందరూ ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.*

*ఈ విషయంపై యూపీ వారియర్స్ హెడ్‌కోచ్ అభిషేక్ నాయర్ స్పందించాడు.*

*మేము సరికొత్తగా సీజన్‌ను ఆరంభించాలని అనుకుంటున్నాం. పర్సులో వీలైనంత ఎక్కువ మొత్తాన్ని అట్టిపెట్టుకోవాలనేదే మా ఉద్దేశం. టైటిల్ గెలవగల జట్టును తయారు చేసే క్రమంలో ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చింది. ఇప్పుడు వదిలేసినా మాకు కావాల్సిన ప్లేయర్లను వేలంలో తిరిగి సొంతం చేసుకుంటామని తెలిపాడు. 2023లో ప్రారంభమైన డబ్ల్యూపీఎల్‌లో ముంబై, బెంగళూరు, యూపీ, గుజరాత్, ఢిల్లీ ఫ్రాంచైజీలు పాల్గొననున్నాయి.*

*నవంబర్ 27న డబ్ల్యూపీఎల్- 2026 మెగా వేలం జరగనుంది. ఇప్పటికే ఐదు ఫ్రాంచైజీలు తమ రిటెన్షన్, రిలీజ్ జాబితాను విడుదల చేశాయి.*

*యూపీ వారియర్స్ పర్సులో రూ.14.50కోట్లు ఉన్నాయి. ఇక వన్డే ప్రపంచ కప్‌లో అద్భుతంగా రాణించిన టీమిండియా ఆల్‌రౌండర్ దీప్తి శర్మతో పాటు టోర్నీలో టాప్ స్కోరర్, సౌతాఫ్రికా కెప్టెన్ లారా వోల్వార్ట్ మెగా వేలంలో భాగం కానున్నారు. 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నీ'గా నిలిచిన దీప్తిని యూపీ వారియర్స్ విడుదల చేయగా.. 'టోర్నీ టాప్ స్కోరర్' వోల్వార్ట్‌ను గుజరాత్ జెయింట్స్ జట్టు రీటెయిన్ చేసుకోలేదు.*

## భారత్ చేతుల్లో పాక్ మరోసారి చిత్తు

***- హాంకాంగ్ సిక్సెస్ టోర్నీ***





హాంకాంగ్ సూపర్ సిక్సెస్-2025లో భాగంగా శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో పాకిస్థాన్‌పై 2 పరుగుల తేడాతో ఇండియా సంచలన విజయం నమోదు చేసింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా నిర్ణీత ఆరు ఓవర్లకు నాలుగు వికెట్లు కోల్పోయి 86 పరులు చేసింది. రాబిన్ ఊతప్ప(28), భరత్ చిప్లి(24) రాణించారు. స్టువర్ట్ బిన్నీ(4), అభిమన్యు మిథున్(6) నిరాశ పర్చారు. దినేశ్ కార్తీక్(17) దూకుడుగా ఆడి నాటౌట్‌గా నిలిచాడు. పాకిస్తాన్ బౌలర్లలో మహ్మద్ షెహజాద్ 2, అబ్దుల్ సమద్ ఒక వికెట్ తీసుకున్నారు. అభిమన్యు మిథున్ రనౌట్‌గా వెనుదిరిగాడు.

87 పరుగుల లక్ష్యంతో పాక్ బ్యాటింగ్‌కు దిగింది. మూడు ఓవర్ల తర్వాత వరుణుడు ఆటకు అంతరాయం కలిగించాడు. ఆ సమయానికి పాక్ ఒక వికెట్ నష్టానికి 41 పరుగులు చేసింది. తిరిగి ఆట కొనసాగే పరిస్థితి లేకపోవడంతో డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో టీమిండియా రెండు పరుగుల తేడాతో విజయం సాధించినట్లు ప్రకటించారు. వర్షంతో ఆట ఆగే సమయానికి ఖవాజా నఫే(18), అబ్దుల్ సమద్(16) క్రీజులో ఉన్నారు. మాజ్ సదఖత్ 7 పరుగుల వద్ద పెవిలియన్ చేరాడు. భారత బౌలర్లలో స్టువర్ట్ బిన్నీ ఓ వికెట్ పడగొట్టాడు. కాగా టీమిండియా తన తదుపరి మ్యాచ్‌లో కువైట్‌తో తలపడనుంది.

ఇటీవల కాలంలో పాకిస్తాన్‌పై భారత్ గెలవడం ఇది ఐదోసారి. పహల్గాం ఉగ్రదాడి తర్వాత టీమిండియా పురుషుల జట్టు పాక్‌ను ఆసియా కప్-2025లో మూడు సార్లు ఓడించింది. అనంతరం భారత మహిళల జట్టు వన్డే ప్రపంచ కప్‌లో పాక్‌ను మట్టికరిపించింది.

## ప్రతీక రావల్‌కు విన్నర్ మెడల్



ఐసీసీ చైర్మన్ జై షా చొరవతో తాను మహిళల వరల్డ్‌కప్ విన్నర్ మెడల్ పొందినట్లు టీమిండియా మహిళా క్రికెట్ జట్టు ఓపెనర్ ప్రతీక రావల్ తెలిపారు. వరల్డ్‌కప్ గెలిచిన జట్టులో ఉన్న ప్రతీక..గాయం కారణంగా సెమీ ఫైనల్, ఫైనల్ మ్యాచ్‌లకు దూరమైంది. ప్రతీక బంగ్లాదేశ్‌తో జరిగిన లీగ్ మ్యాచ్‌లో ఫీల్డింగ్ చేస్తూ గాయానికి గురైన విషయం తెలిసిందే. దీంతో ఆమె టోర్నీకి దూరమైంది. ఆమె స్థానంలో షెఫాలీ వర్మను ఆఖర్లో జట్టులోకి తీసుకున్నారు. భారత జట్టు సౌతాఫ్రికాతో జరిగిన ఫైనల్లో లో 52 పరుగులతో విజయం సాధించింది. జట్టులోని 15 మంది సభ్యులు ఐసీసీ మెడల్స్ పొందారు. అయితే ప్రతీకకు మొదట మెడల్ ఇవ్వలేదు. జై సా చొరవతో ప్రతీకకు కూడా మెడల్ అందనుంది. దీనిపై ఒక న్యూస్ ఛానల్‌తో ప్రతీక మాట్లాడుతూ.. ప్రతీకకు పతకం రావడం కోసం ఏర్పాట్లు చేస్తున్నామని జైషా మా మేనేజర్‌కు మెసేజ్ పంపారు. దీంతో నేను చాలా ఆనందపడ్డా. అయితే నా మెడల్ రావడానికి ఇంకాస్త సమయం పడుతుంది. కానీ ఇటీవల ప్రధాని దగ్గరకు వెళ్లినపుడు పతకం లేదనే బెంగ లేకుండా సహాయక సిబ్బంది తన మెడల్‌ను నాకు ఇచ్చారు. ప్రస్తుతానికి సపోర్టింగ్ స్టాఫ్‌కు ఇచ్చిన మెడల్‌ను నాకు అందించారు. మెడల్‌ను చూడగానే ఆనందంతో నా కళ్లల్లో నీళ్లు తిరిగాయి. సాధారణంగా నేను ఎమోషనల్ అవ్వను. కానీ ఈసారి భావోద్వేగాన్ని నియంత్రించుకోలేకపోయాను. దీన్ని నా సొంత పతకంగానే చూడండి. వారిచ్చే పతకం త్వరలోనే రానుందని ప్రతీక చెప్పారు. కాగా ఐసీసీ నిబంధనల ప్రకారం ఫైనల్‌కు ఎంపికైన జట్టులోని పదిహేను మంది ఆటగాళ్లకు మాత్రమే (గెలిచిన జట్టు) విన్నర్ మెడల్స్ ఇస్తారు. గాయం వల్ల ప్రతిక జట్టులో స్థానం కోల్పోయినందున ముందుగా ఆమెకు మెడల్ దక్కలేదు. అయితే, ఐసీసీ చైర్మన్ జై షా నేరుగా జోక్యం చేసుకుని పతకం వచ్చేలా చేశారు.

## షమీకి సుప్రీంకోర్టు నోటీసులు



నెలనెలా తనకు భరణం, కుమార్తె సంరక్షణ కోసం చెల్లిస్తున్న రూ.4 లక్షలు సరిపోవడం లేదని స్టార్ బౌలర్ మహ్మద్ షమీ మాజీ భార్య హసీన్ జహాన్ సుప్రీంకోర్టులో పిటీషన్ దాఖలు చేశారు. దీనిపై సమాధానం ఇవ్వాలని షమీకి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. తనకు, తన కుమార్తెకు కోల్‌కతా హైకోర్టు మంజూరు చేసిన జీవనోపాధిని పెంచాలని కోరుతూ జహాన్ తాజాగా సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

తన కోసం నెలకు రూ.1.5 లక్షలు, కుమార్తె సంరక్షణ కోసం నెలకు రూ.2.5 లక్షలు.. షమీ చెల్లించాలని కోల్‌కతా హైకోర్టు గతంలో ఇచ్చిన తీర్పును ఆమె సవాలు చేశారు. ఈ మొత్తం తమకు సరిపోవడం లేదని సుప్రీంకోర్టు దృష్టికి తీసుకు వెళ్లారు. ఆమె పిటిషన్‌పై విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు.. దీనిపై షమీ నాలుగువారాల్లో స్పందించాలని కోరింది. ఈ గడువు ముగిసిన అనంతరం ఈ కేసు విచారణకు రానుంది. షమి, హసీన్ జహాన్‌కు 2014లో వివాహం కాగా.. 2015లో ఐరా జన్మించింది. తర్వాత ఇద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో వారు విడివిడిగా ఉంటున్నారు. 2018లో హసీన్ జహాన్.. షమీపై గృహ హింస ఆరోపణలతో పోలీసులను ఆశ్రయించారు. హసీన్‌కు నెలకు రూ.50 వేలు, ఐరాకు రూ.80 వేలు చొప్పున ఇవ్వాలని 2023లో జిల్లా సెషన్స్ కోర్టు ఆదేశించగా.. ఆ తీర్పును సవాల్ చేస్తూ ఆమె కోల్‌కతా హైకోర్టును ఆశ్రయించారు. దీంతో ఆ మొత్తాన్ని కోర్టు రూ.4 లక్షలకు పెంచింది. ప్రస్తుతం ఆ డబ్బులూ సరిపోవడం లేదని ఆమె సుప్రీంకోర్టులో పిటీషన్ దాఖలు చేశారు.

చైతన్య రథం
సినిమా
శనివారం 8 నవంబర్ 2025


## ఇఫి నామినేషన్స్‌లో 'కమిటీ కుర్రోళ్లు'



సినీ రంగం ప్రతిష్ఠాత్మకంగా భావించే అవార్డుల్లో 'ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా (ఇఫి) ఒకటి. 56వ ఇఫి వేడుకలు ఈ నెల 20న గోవా వేదికగా ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా ఆ పురస్కారాలకు నామినేట్ అయిన వారి జాబితా శుక్రవారం విడుదలైంది. ఉత్తమ పరిచయ దర్శకుడు విభాగంలో టాలీవుడ్ డైరెక్టర్ యదు వంశీ నామినేట్ అయ్యారు. 'కమిటీ కుర్రోళ్లు' చిత్రానికిగానూ ఆయనకు నామినేషన్ దక్కింది. ఇదే విభాగంలో.. మలయాళం నుంచి జితిన్‌లాల్ (ఎఆర్ఎం), హిందీనుంచి కరణ్ సింగ్ త్యాగి (కేసరి చాప్టర్ 2), బెంగాలీనుంచి రామ్ కమల్ ముఖర్జీ (బినోదిని) తదితరులు పోటీపడుతున్నారు.

# సచిన్‌తో సుజీత్?




ప్రస్తుతం సోషల్ మీడియాలో కొన్ని ఫొటోలు వైరల్‌గా మారాయి. క్రికెట్ దిగ్గజం సచిన్ తెందూల్కర్, ఓజీ దర్శకుడు సుజీత్ కలిసివున్న ఫొటోలను సినీ, క్రికెట్ అభిమానులు షేర్ చేస్తున్నారు. వీరిద్దరూ కలిసి ఓ వాణిజ్య ప్రకటన కోసం వర్క్ చేస్తున్నట్టు ఇటీవల వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. గురువారం ప్రకటనల షూటింగ్ జరిగింది. ఇందుకు సంబంధించిన ఫొటోలు తాజాగా బయటకు వచ్చాయి. సుజీత్ దర్శకత్వంలో సచిన్ రెండు ప్రకటనల్లో నటించినట్టు తెలుస్తోంది. తాజాగా 'ఓజీ'తో హిట్ అందుకున్న సుజీత్.. ప్రస్తుతం నాని హీరోగా సినిమా రూపొందిస్తున్నారు. ఈ సినిమాకు 'బ్లడీ రోమియో' అనే టైటిల్ ప్రచారంలో ఉంది. ఇటీవలే ఈ చిత్రాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఇందులో నాని సరసన పూజా హెగ్డే నటించనున్నట్టు తెలుస్తోంది.

# అర్థంలేని పాటలొస్తున్నాయి..



"ఈ కాలం పాటలు ఎందుకొస్తున్నాయో తెలియడం లేదు. మేల్ సింగర్ పాడింది, ఫీమేల్‌కు తెలియదు. ఆమె పాడింది మేల్‌కు తెలియదు. డైరెక్టర్‌కు అసలు ఏ పాట వస్తుందో తెలిసే పరిస్థితే ఉండటం లేదు". ఈ వ్యాఖ్యల్ని అప్పుడే ఇండస్ట్రీకి వచ్చినోళ్లంటే పెద్దగా పట్టించుకోనక్కర్లేదు. కానీ, ఈ వ్యాఖ్యలు చేసింది సంగీతజ్ఞాని ఇళయరాజా. తన జీవితమంతా పాటలమయమని సంగీత దర్శకుడు ఇళయరాజా అన్నారు. విజయవాడలో తొలిసారి నవంబర్ 8న ఆయన కాన్సర్ట్ జరగనుంది. దీని గురించి మాట్లాడుతూ.. తన పాటలను ఆదరిస్తోన్న ప్రేక్షకులకు ధన్యవాదాలు తెలిపారు. "నా జీవితమంతా పాటలమయమే. నా పాటలు విని ఇంతమంది కన్సర్ట్‌కు వస్తున్నారు. పాటల్లో జీవం, ఎమోషన్స్ అన్నీ ఉంటాయి. నా పాటలు ప్రేక్షకుల హృదయాన్ని తాకుతాయి. మీ అందరి జీవితాల్లో అవి భాగమయ్యాయి. ఇంతకుమించిన ఆనందం నాకు ఇంకేం కావాలి" అన్నారాయన. "గతంలో 60 మంది ఆర్కెస్ట్రా ఒకేచోట ఉండి.. పాటలు కంపోజ్ చేసేవాళ్లం. నేను రికార్డ్ చేసిన టైమ్, పాడేవాళ్లు, స్టూడియో పేరు అన్నీ వివరంగా రాస్తాను. ఎవరు ఏ పాట ఎప్పుడు పాడాలో రాస్తాను. అప్పుడు నిర్మాతలు వాళ్లను పిలిచి పాడిస్తారు. రిహార్సల్ చేసి పాట కరెక్ట్ వచ్చింది అనుకున్నప్పుడే బయటకు విడుదల చేస్తాం. 60మంది ఒకేసారి కృషి చేస్తే 4 నిమిషాలపాట పూర్తవుతుంది. ఇప్పుడు మ్యూజిక్ చేసే వాళ్లు కనీసం ఒక లైన్‌లో కూడా ఉండటం లేదు" అని ఇళయరాజా విచారం వ్యక్తం చేశారు.

## కత్రినా.. అమ్మ అయినవేళ..



బాలీవుడ్ స్టార్ కపుల్ కత్రినా కైఫ్, విక్కీ కౌశల్ తల్లిదండ్రులయ్యారు. నేడు (నవంబర్ 7) కత్రినా పండంటి బాబుకు జన్మనిచ్చారు. సోషల్ మీడియా వేదికగా ఆనందాన్ని పంచుకుంటూ విక్కీ కౌశల్ పోస్ట్ పెట్టారు. "ఎంతో ఆనందంగా ఉంది. మా ప్రేమకు ప్రతిరూపంగా బాబు జన్మించాడు. మీ అందరి ఆశీర్వాదాలు కావాలి" అంటూ విక్కీ శుభవార్తను పంచుకున్నారు. ఈ పోస్టుపై స్పందిస్తూ పలువురు సినీ ప్రముఖులు, నెటిజన్లు జంటకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. కొన్నేళ్ల ప్రేమ ప్రయాణం అనంతరం కత్రినా కైఫ్ – విక్కీ కౌశల్ 2021లో వివాహబంధంతో ఒక్కటైన విషయం తెలిసిందే.

## 'తుడరుమ్'కు అరుదైన ఘనత



మలయాళ అగ్ర కథానాయకుడు మోహన్‌లాల్ నటించిన 'తుడరుమ్' అరుదైన ఘనతను సొంతం చేసుకుంది. 56వ అంతర్జాతీయ చలన చిత్రోత్సవాలకు అధికారికంగా ఎంపికైంది. దీనిపై ఆయన స్పందిస్తూ ఎంతో ఆనందంగా ఉందన్నారు. '56వ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు ఇండియన్ పనోరమా విభాగంలో తుడరుమ్ ఎంపికైందని, ఆ విషయాన్ని మీ అందరితో పంచుకోవడం గౌరవంగా, సంతోషంగా ఉంది. మీ అందరి ఆదరణ వల్లే ఇది సాధ్యమైంది. ఇంత గొప్ప గుర్తింపు ఇచ్చినందుకు అందరికీ ధన్యవాదాలు" అని తన పోస్టులో మోహన్‌లాల్ రాసుకొచ్చారు. 56వ అంతర్జాతీయ చలనచిత్ర వేడుక గోవా వేదికగా నవంబర్ 20నుంచి 28 వరకూ జరగనుంది. ఈ వేడుకలో దీన్ని ప్రదర్శించనున్నారు. తుడరుమ్ విషయానికొస్తే.. మోహన్‌లాల్ కథానాయకుడిగా తరుణమూర్తి దీన్ని రూపొందించారు. కేవలం కేరళ బాక్సాఫీసు వద్దే రూ.100 కోట్లు (గ్రాస్) వసూలు చేసిన తొలి మలయాళ సినిమాగా 'తుడరుమ్' నిలిచింది. ప్రపంచవ్యాప్తంగా రూ.210 కోట్లు (కేరళతో కలిపి) రాబట్టి అత్యధిక వసూలు చేసిన మలయాళ చిత్రాల జాబితాలో చోటు సొంతం చేసుకుంది. సాఫీగా జీవితాన్ని సాగిస్తున్న ఓ ట్యాక్సీ డ్రైవర్ ఊహించనివిధంగా హత్య కేసులో ఇరుక్కోవడం, దానినుంచి బయటపడేందుకు ఎలాంటి ప్రయత్నాలు చేశాడనే అంశాలతో దర్శకుడు తరుణమూర్తి తెరకెక్కించారు. మోహన్‌లాల్ సరసన శోభన నటించారు.

## 'కుంభ'.. షాకింగ్ లుక్ రివీల్ చేసిన జక్కన్న

ఇప్పుడు ఇండియన్ సినిమానుంచి నెక్స్ట్ బిగ్ థింగ్ ఏదన్నా ఉంది అంటే అది సూపర్ స్టార్ మహేష్‌బాబుతో దర్శకుడు రాజమౌళి తెరకెక్కిస్తోన్న సినిమా. గ్లోబల్ ఆడియెన్స్‌ని టార్గెట్ చేసిన ఈ భారీ సినిమా కోసం అభిమానులు ఎగ్జైటెడ్‌గా ఎదురు చూస్తుండగా.. ఈ 15న జరగనున్న భారీ ఈవెంట్‌కి ముందు కొన్ని సర్ప్రైజ్‌లు ఉన్నట్టుగా దర్శకుడు రాజమౌళి తెలిపారు. అందులో భాగంగా.. నేడు పృథ్వీరాజ్ సుకుమారన్ ఫస్ట్ లుక్ ఇస్తున్నట్టు కన్ఫర్మ్ చేస్తూ.. ఆ లుక్ పోస్టర్‌తో షాకిచ్చారు. పృథ్వీ రాజ్‌ని 'కుంభ'గా పరిచయం చేస్తూ తన యునిక్ రోల్‌ని రివీల్ చేసేసారు. ఒక వీల్ చైర్‌లో పృథ్వీరాజ్ అంగ వైకల్యంతో కనిపిస్తుండగా.. అదే సమయంలో తన చైర్ వెనుక ఉన్న రోబోటిక్ చేతులు చూస్తుంటే పవర్‌ఫుల్ విలన్‌గా కనిపిస్తున్నాడు. మొత్తానికి రాజమౌళి ఒక ఊహించని ట్రీట్‌నే బిగ్ స్టార్స్‌తో ప్లాన్ చేస్తున్నారని చెప్పవచ్చు. ఇక నెక్స్ట్ రానున్న అప్డేట్ పోస్టర్ ఎలా ఉంటుందో చూడాలి.



## చికిరి చికిరి.. పాటేసుకున్నాడు..

'పెద్ది'గా సినీప్రియుల్ని అలరించేందుకు సిద్ధమవుతున్నారు కథానాయకుడు రామ్‌చరణ్. ఆయన టైటిల్ పాత్రలో నటిస్తున్న పాన్ ఇండియా చిత్రాన్ని బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తున్నారు. జాన్వీ కపూర్ కథానాయిక. శివ రాజ్ కుమార్, దివ్యేందు శర్మ, జగపతిబాబు కీలక పాత్రలు పోషిస్తున్నారు. తాజాగా ఇందులోనుంచి మొదటి గీతాన్ని విడుదల చేశారు. 'చికిరి చికిరి..' అంటూ సాగే పాటకు బాలాజీ లిరిక్స్ అందించారు. ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తోన్న చిత్రం వచ్చే ఏడాది మార్చి 27న ప్రేక్షకుల ముందుకు రానుంది.



## అందుకే.. ఈ సినిమా చేశా

రామ్ పోతినేని హీరోగా నటిస్తున్న 'ఆంధ్ర కింగ్ తాలూకా' ఇప్పటికే షూటింగ్ పనులు ముగించుకుని రిలీజ్‌కు రెడీ అయింది. చిత్ర ప్రమోషన్స్‌ను యూనిట్ ప్రారంభించింది. ఇక ఈ సినిమాను దర్శకుడు మహేష్‌బాబు పి తెరకెక్కిస్తున్నారు. చిత్ర ప్రమోషన్స్‌లో భాగంగా ఓ ఇంటర్వ్యూలో రామ్ పోతినేని కొన్ని ఇంట్రెస్టింగ్ విషయాలను వెల్లడించారు. రామ్ మాట్లాడుతూ.. 'ఇటీవల సినిమాలు హింసాత్మకంగా మారాయి. అందుకే సౌమ్యమైన భావోద్వేగ చిత్రాన్ని చేయాలని నిర్ణయించుకుని ఆంధ్ర కింగ్ తాలూకా చేశా. ఈ సినిమాను ప్రేక్షకులు మెచ్చే విధంగా తీర్చిదిద్దాం' అని అన్నారు. భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తున్న సినిమాలో ఉపేంద్ర కీలక పాత్రలో నటిస్తున్నాడు. ఈ చిత్రాన్ని మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తుండగా, వివేక్–మెర్విన్ సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్రాన్ని నవంబర్ 28న గ్రాండ్ రిలీజ్‌కు రెడీ చేస్తున్నారు.

